జ్ఞాన సిద్ధాంతం
రూ॥200/-
పేజీలు:210

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

బెంగాల్ సిఎస్‌పై ఇసి వేటు

దేశంలో ముడి చమురు కొరత లేదు 05

ఆసుపత్రిలో భారీ అగ్నిప్రమాదం

సంపుటి 09, సంచిక: 107 | మంగళవారం | 17-03-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## బడ్జెట్ కేవలం ఆర్థిక కేటాయింపులే కాదు

- అంతర్జాతీయ ప్రమాణాలతో, అధునాతన భవిష్యత్ తెలంగాణ నిర్మాణానికి మార్గదర్శనం
- ప్రతి పౌరుడి ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలు తీర్చేది
- ప్రజా ప్రభుత్వ ప్రతి పాలసీ, ప్రతి సంస్కరణ ప్రజలకు అవకాశాలను సృష్టిస్తోంది
- ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థకు చేరుకునేందుకు' తెలంగాణ విజన్ -2047' ఒక రోడ్ మ్యాప్



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజాప్రభుత్వం ఎంచుకునే ప్రతి పాలసీ, అమలు చేసే ప్రతి కార్య క్రమం,చేపడుతున్న ప్రతి సంస్కరణ తెలంగాణ ప్రజలకు అవకాశాలను సృష్టిస్తుందని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. సమ్మిళిత వృద్ధి దిశగా వారిని నడిపించి, మరింత శక్తివంతులుగా తయారు చేస్తుందని, రాష్ట్ర సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ అభివృద్ధిపై ప్రభుత్వం చాలా స్పష్టతతో ఉన్నదని, అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో ప్రభుత్వాన్ని ఎవ్వ రూ ఆపలేరని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థకు చేరుకునేందుకు' తెలంగాణ విజన్ 2047' ఒక రోడ్ మ్యాప్ లాంటిదన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించారు. బడ్జెట్ కేవలం ఆర్థిక కేటాయింపులు మాత్రమే కాదని,ఇది అంతర్జాతీయ ప్రమాణాలతో, అధునాతనమైన భవిష్యత్తు తెలంగాణ నిర్మాణానికి

తరువాయి 2లో

### 30 వరకు శాసనసభ, శాసనమండలి బడ్జెట్ సమావేశాలు

03

### శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ






## యుద్ధం నిలిపివేయాలి

- ఈ విషయాన్ని అమెరికాకు భారత్ స్పష్టంగా తెలియజేయాలి
- వామపక్ష పార్టీల నేతల డిమాండ్
- ప్రధాని మోదీ అసమర్థత వల్లే దేశప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన
- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల దురాక్రమణ దాడిని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ తదితర వామపక్ష పార్టీల నిరసన ర్యాలీ

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ దేశాలపై ఆధిపత్యమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై తలపెట్టిన యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని భారత ప్రధాని మోదీ అమెరికాకు స్పష్టంగా చెప్పాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. మొత్తం 140 కోట్ల మంది ప్రజలకు ప్రతినిధిగా ఉన్న ప్రధాని అసమర్థత కారణంగా ప్రజలందరూ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల దురాక్రమణ దాడిని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ, తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నారాయణగూడ చౌరస్తా నుంచి వైఎంసిఎ వరకు నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఉద్దేశించి సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహ, సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు ప్రసంగించారు.

### ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్వాధీనమే అమెరికా లక్ష్యం: డాక్టర్ నారాయణ

డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ అమెరికా కేవలం తమ స్వార్థం కోసం ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థను స్వాధీనంచేసుకునేందుకే ఈ యుద్ధాన్ని తలపెట్టిందని

తరువాయి 2లో

### అహంకారంతోనే యుద్ధకాంక్ష

అమెరికా జాతి, సామ్రాజ్యవాద అహంకారంతోనే ప్రపంచాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవాలని ఆలోచన కలిగి ఉందని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇప్పుడు యుద్ధం ఇరాన్‌పై మాత్రమే కాదని, గతంలో పాలస్తీనా, చిలీ, లిబియా, లాంటి దేశాలపై దాడులు చేసి ఆ దేశాల అధ్యక్షులతో అనేక మంది హత్యలకు పాల్పడిందని విమర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా డాలర్ పెత్తనం కొనసాగాలంటే నిరంతరం యుద్ధాలు జరుగుతుండాలనేదే అమెరికా లక్ష్యమని, తద్వారా ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో సంక్షోభం ఏర్పడి ఇతర దేశాల కరెన్సీ విలువలు పడిపోయి డాలర్ మరింత బలపడేలా చేసుకునేందుకే ఈ యుద్ధ కాంక్ష అన్నారు. ఎవరు అవునన్నా, కాదన్నా మోదీ భారతదేశ ప్రధాని అని, ఆయన ప్రతి చర్య దేశ ప్రజలపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ యుద్ధం అప్రకటిత మూడో ప్రపంచ యుద్ధంగా మారిందని,

తరువాయి 2లో

## స్పష్టమైన హామీల్లేవ్

- బడ్జెట్ సమావేశాలు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండాలి : సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని
- ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలి: నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/హైదరాబాద్

గవర్నర్ ప్రసంగంలో ప్రజల ప్రధాన సమస్యలపై స్పష్టమైన హామీలు కనిపించలేదని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం గవర్నర్ ప్రసంగంపై ఆయన స్పందిస్తూ గవర్నర్ ప్రసంగం మూడు భాషల్లో ఉన్నప్పటికీ అందులో ప్రజల ప్రధాన సమస్యలపై స్పష్టమైన హామీలు లేవన్నారు. బడ్జెట్ సమావేశాలు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు కింది స్థాయి వరకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కాగితాల్లో మాత్రమే నిధులు మంజూరు అవుతున్నాయని, కింది స్థాయిలో అమలు కావడం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ సంక్షోభం, సాగునీటి సమస్యలు వంటి కీలక అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ధరల పెరుగుదల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించాలని కోరారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని సూచించారు. కార్మికులు, కూలీల సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరుతూ, కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రాలకు నిధులు తగ్గుతున్నాయని విమర్శించారు. రైతులు, కార్మికులు, పేదల సమస్యలను సభలో లేవనెత్తుతామని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో సిపిఐ బలంగా పోరాడుతుందని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే అంశాలపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు మద్దతు ఇస్తామని, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను మాత్రం సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని సాంబశివరావు స్పష్టం చేశారు. ప్రజల్లో ప్రభుత్వంపై ఆశించిన స్థాయిలో

తరువాయి 2లో

### దుబాయ్ విమానాశ్రయంపై

## ఇరాన్ డ్రోన్ దాడి



- గల్ఫ్ దేశాలపైనా దాడులు : కదలని నౌకలు
- ఇరాన్ అంతరిక్ష కేంద్రం ధ్వంసం
- దక్షిణ లెబనాన్‌లో 10 మంది పౌరులు మృతి
- విస్తరిస్తున్న డీజిల్ కొరత

**దుబాయ్/బీరూట్:** గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు విరామం లేకుండా కొనసాగుతుండగా, ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌లో విస్తారంగా గగనతల దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో అంతరిక్ష కేంద్రాన్ని ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడిఎఫ్) ప్రకటించింది. అంతరిక్షంలో తమ ఉపగ్రహాలను ధ్వంసం చేయగల సామర్థ్యం ఉన్న సాధనాలను ఇరాన్ తయారు చేస్తోందని, దానికి సంబంధించిన మౌలిక సదుపాయాలన్నింటినీ ధ్వంసం చేశామని ఐడిఎఫ్ పేర్కొంది. ఇరాన్‌లో నగరాలపై అమెరికా–ఇజ్రాయెల్ బాంబు దాడులతో విధ్వంసం సృష్టిస్తుండగా, ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ కూడా ఇరాన్ ప్రయోగించిన క్లస్టర్ బాంబు క్షిపణి దాడులతో దద్దరిల్లింది. నిషేధిత క్లస్టర్ బాంబుల ప్రభావం కారణంగా టెల్‌అవీవ్‌లో తొమ్మిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. దక్షిణ లెబనాన్‌లో కూడా ఇజ్రాయల్ దాడులు ఉద్ధృతమయ్యాయి. ఈ దాడుల్లో 10 మంది పౌరులు మరణించగా 200 మంది గాయపడ్డారు. దీంతో లెబనాన్‌లో గడచిన





15 రోజులుగా లెబనాన్‌లో జరుగుతున్న యుద్ధంలో 850 మంది మరణించారు. హెజ్బొల్లా సంస్థ సైనికులు కూడా వెనక్కు తగ్గకుండా ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులు చేస్తున్నారు. ఇరాన్ డ్రోన్ దాడుల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయిందని అమెరికా ఒకవైపు ప్రకటించినప్పటికీ బహ్రైన్,కువైట్,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఇరాన్ డ్రోన్ దాడులు ఆగలేదు. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇరాన్ మరోసారి డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో విమానాశ్రయం సమీపంలో ఉన్న అయిల్ ట్యాంకర్ ధ్వంసమైంది. దీంతో దుబాయ్ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు ఇరాన్ దాడుల నుండి ఆత్మరక్షణ చర్యలు తీసుకుంటున్నాయి. సోమవారం ఏకంగా 61 ఇరాన్ డ్రోన్లనుఅడ్డుకున్నట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించింది. యుద్ధం మొదలైనప్పటినుండీ అమెరికా మిత్రదేశాలపై ఇరాన్ వందలకొద్దీ డ్రోన్లు, క్షిపణులనుప్రయోగించింది. తమదేశంపై దాడి చేసేందుకు అమెరికాకు అనుమతి ఇస్తున్నారని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వంపై ఇరాన్ తీవ్ర విమర్శలు చేసింది. గల్ఫ్‌దేశాలతో సంబంధాలను పునఃసమీక్షిస్తామని ప్రకటించింది. కాగా సోమవారం 35 ఇరాన్ డ్రోన్లు తూర్పు ప్రాంతంపై దాడి చేశాయని, వాటిని అడ్డుకున్నామని, ఈ ప్రాంతంలో ప్రధానమైన చమురు కేంద్రాలు ఉన్నాయని సౌదీ అరేబియా ప్రకటించింది. గల్ఫ్ దేశాల్లో తాము చేసే దాడులకు, అమెరికా స్థావరాలకు దూరంగా ఉండాలని, అమెరికా, ఇటలీలకు చెందిన స్థావరాలను లక్ష్యంగా

తరువాయి 2లో

### నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

ఆంగ్లంలో నవతేజ్ సర్నాకు, హిందీలో మమతా కాలియా సహా 24 భాషాల్లో 24 మందికి అవార్డులు



**న్యూఢిల్లీ :** ప్రముఖ రచయిత, 'నాగేటి సాల్లళ్ల నా తెలంగాణ' అంటూ తెలంగాణ ఆత్మను పలకరించిన అక్షర యోధుడు నందిని సిధారెడ్డిని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. ఆయన రాసిన 'అనిమేష' కవితా సంపుటికి ఈ పురస్కారం లభించింది. కరోనా కాలంలోని సామాజిక

తరువాయి 2లో



### ద్వైపాక్షిక విభేదాల పరిష్కారమే లక్ష్యం


అమెరికాతో చర్చలపై క్యూబా అధ్యక్షుడు కానెల్

**హవానా:** అమెరికా–క్యూబా మధ్య చర్చలు జరుగుతున్నాయి. క్యూబా పత్రిక ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించగా, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి క్యూబాతో చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు క్యూబా అధ్యక్షుడు డయాజ్ కానెల్ బెర్ముడెజ్ కొద్ది రోజుల క్రితం అమెరికాతో చర్చల విషయాన్ని ధృవీకరించగా, క్యూబా అధికారిక పత్రిక గ్రాన్మా కూడా దీనిపై ఒక ప్రత్యేక వార్త ప్రచురించింది. అమెరికాతో చర్చల విషయమై క్యూబా నాయకత్వంతో అధ్యక్షుడు బెర్ముడెజ్ మార్చి 13న జరిపిన సమావేశ చిత్రాన్ని గ్రాన్మా పత్రిక విడుదల చేసింది. క్యూబా సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకుంటూ రెండు దేశాల

తరువాయి 2లో

### సిఇసి జ్ఞానేశ్ కుమార్ పాపాల చిట్టా

## ఉభయసభలకూ ఇచ్చాం



- లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ
- ప్రతిపక్షనేతను అవమానించి, రాత్రికి రాత్రే సిఇసి నియామకం
- నోటీసులో ఏడు ఆరోపణలు, 190 మంది ఎంపిల సంతకాలు

**న్యూఢిల్లీ:** భారత ఎన్నికల సంఘం ప్రధానాధిపతి జ్ఞానేశ్ కుమార్ నియామకం దగ్గర నుండి ఇటీవల ఎన్నికల్లో చేసిన తప్పిదాల వరకూ ఆయన పాపాల చిట్టాను వివరిస్తూ పార్లమెంటు ఉభయసభల్లో నోటీసులు ఇచ్చామని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సోమవారం ఢిల్లీలో చెప్పారు. రాత్రికి రాత్రే ప్రభుత్వం ఆయన నియామకం విషయంలో చేసిన తప్పుల దగ్గర నుండీ జ్ఞానేశ్ కుమార్ ఓటర్ల జాబితాలను తారుమారుచేసిన ఘటనలు, బెదిరింపులన్నింటినీ సుదీర్ఘ నోటీసులో ఉభయసభలకు తెలియజేశామని చెప్పారు. కర్ణాటకలోని అలంద్, మహదేవపురలలోని ఓటర్ల జాబితాలలో జరిగిన అవకతవకలను ప్రతిపక్షాలు బహిర్గతం చేశాయని,ఆందోళన వ్యక్తం చేశాయని ఈ అంశాలన్నింటినీ ఆ నోటీసులలో పొందుపరచామని చెప్పారు.జ్ఞానేశ్ కుమార్‌ను సి.ఇ.సి పదవి నుండి తొలగించాలని కోరుతూ గడచిన శుక్రవారం (మార్చి 13) ఈ నోటీసులను రాహుల్‌గాంధీ ఉభయసభలకు సమర్పించారు. లోక్‌సభకు చెందిన 130 మంది ఎంపిలు, రాజ్యసభకు చెందిన 60 మంది ఎంపీలు ఈ నోటీసులపై సంతకాలు చేశారు. పదవీ నిర్వహణలో పక్షపాత ధోరణి, వివక్షపూరిత ప్రవర్తన,ఓటర్ల జాబితాల్లో అక్రమాలపై విచారణ,దర్యాప్తు జరగకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుపడటం,సామూహికంగా ప్రజలను ఓటుహక్కుకు దూరం చేయడం వంటి ఆయన చేసిన పాపాలను ఈ నోటీసులలో పొందుపరచినట్లు రాహుల్‌గాంధీ చెప్పారు. ఎన్నికల ప్రధానాధికారిని పదవి నుండి తొలగించేందుకు పార్లమెంటు చేపట్టే ప్రక్రియ సుప్రీంకోర్టు లేదా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిని తొలగించే అభిశంసన, దోషారోపణ నిరూపణ ప్రక్రియతో సమానమైనదని చెప్పారు. రుజువైన ఆయన అసమర్థత, తప్పుడు ప్రవర్తన ప్రాతిపదికపై ఆయనను తొలగించేందుకు ఈ అభిశంసన ప్రక్రియను పార్లమెంటు చేపడుతుంది. ఉభయసభలకూ ఇచ్చిన ఈ నోటీసులపై సంతకాలు చేసినవారిలో''ఇండియా కూటమి'' పార్టీల ఎంపిలు, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపిలు, కొందరు

తరువాయి 2లో

## 90 లక్షల మెట్రిక్ టన్నులు

- రబీలో ధాన్యం కొనుగోలుచేసేందుకు ప్రణాళికలు
- రాష్ట్ర వ్యాప్తంగా 8,251 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యవసాయ రంగ చరిత్రలోనే ముందెన్నడూ లేని విధంగా 2025–26 రబీ సీజన్‌లో 60 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 30 లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలు మొత్తం 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని పౌర సరఫరాల శాఖా మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా 8,251 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకై సమగ్రమైన కార్యాచరణను రూపొందించామని మంత్రి పేర్కొన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు ,కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన తదితర ఏర్పాట్లపై సోమవారం ఉదయం బేగంపేట లోని ఐఎఎస్ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తో కలసి అదనపు కలెక్టర్లు,జిల్లా పౌర సరఫరాల శాఖాధికారులు, ఆయా జిల్లాల సివిల్ సప్లయ్స్ మేనేజర్లతో మంత్రి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్

తరువాయి 2లో

## తప్పుడు వాణిజ్య విధానాలు సరిదిద్దుకోండి

### పారిస్ వాణిజ్య సమావేశంలో అమెరికాకు చైనా హితవు

**బీజింగ్:** చైనాలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈనెలాఖరులో పర్యటన, పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల మధ్య అమెరికా–చైనా ప్రతినిధులమధ్య పారిస్‌లో రెండురోజులపాటు సమావేశాలు ఆదివారం,సోమవారం రెండు రోజులు జరిగాయి. ఈ చైనా ప్రధానమంత్రి హే లిఫెంగ్, అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్‌లు ఈ ప్రతినిధి వర్గాలకు నాయకత్వం వహించారు. టారిఫ్‌లు, అరుదైన ఖనిజాలు, వ్యవసాయ ఉపకరణాలు తదితర అంశాలపై వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తప్పుడు వాణిజ్య విధానాలు, టారిఫ్‌ల భారాలు వేసే పద్ధతులను తక్షణం సరిదిద్దుకోవాలని చైనా ప్రతినిధి అమెరికాకు విజ్ఞప్తి చేసినట్లు జపాన్ వాణిజ్య పత్రికలు ప్రకటించాయి. సమస్యలన్నింటినీ చర్చల మార్గం ద్వారా పరిష్కరించుకుందామని చైనా ప్రతినిధులు ఈ సందర్భంగా స్కాట్ బెస్సెంట్‌కు ప్రతిపాదించారు. గతవారంలో అమెరికా కొన్ని దేశాలపై కొత్త వాణిజ్యపరమైన దర్యాప్తులు ప్రారంభించడంతో చైనా ప్రతినిధులు పారిస్ సమావేశంలో తమ ప్రాతినిధ్యాలు,వివరణలు డిమాండ్లను అమెరికా ప్రతినిధులకు తెలియజేశారు. తప్పుడు టారిఫ్ విధానాలను తక్షణం సరిదిద్దుకోవాలని ప్రధానంగా వారు అమెరికా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. చైనా సహా 60 దేశాల ఆర్థిక వ్యవస్థలను,కంపెనీలను లక్ష్యంగా చేసుకుని అమెరికా వాణిజ్య దర్యాప్తులు ప్రారంభించింది. ఈ దేశాలతో అనుసరిస్తున్న వాణిజ్యంవల్ల అమెరికాకు అధిభారంగా మారతాయా,మేలు చేస్తాయా అనే అంశంపై ఈ దర్యాప్తు జరుగుతోంది. చైనా సహా 16 దేశాల పారిశ్రామిక సామర్థ్యాలు దర్యాప్తు చేయడం రాజకీయాలను తారుమారు చేయడమే అవుతుందని చైనా విమర్శించింది. అదేవిధంగా చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ బీజింగ్‌లో మీడియాతో మాట్లాడుతూ చైనా పర్యటన సందర్భంగా రెండు దేశాల ప్రధాన ప్రతినిధులు నిత్యం అనుసంధానంలో ఉంటారని, సంప్రదింపులు జరుపుతారని చెప్పారు. ఆయన పర్యటన తీవ్రవత్వంపై సరిదిద్దే మార్గంగా లిన్ జియాన్ అభివర్ణించారు.మార్చి 31 నుండి ఏప్రిల్ రెండో దీ వరకు ట్రంప్ చైనాలో పర్యటిస్తారని అనధికార సమాచారం వెల్లడించింది. ఈ వార్తను బీజింగ్ వర్గాలు ఇంకా ధృవీకరించాల్సి ఉంది.

# హోర్ముజ్‌పై బెంబేలు : ఏకాకిగా మారుతున్న ట్రంప్!

### యుద్ధ నౌకలు పంపేందుకు మిత్రదేశాల తిరస్కృతి

**వాషింగ్టన్:** హోర్ముజ్ జలసంధి వద్ద పరిణామాలపై ట్రంప్ బెంబేలెత్తుతున్నారు. ట్రంప్ స్వయంకృతాపరాధానికి తాము మూల్యం చెల్లించుకోలేమని, యుద్ధ నౌకలను పంపలేమని నాటో మిత్రదేశాలు స్పష్టంగా చెబుతున్నాయి. దీంతో ట్రంప్ చైనాను కూడా బ్రతిమిలాడుకుంటున్నారు. హోర్ముజ్ రక్షణకు, తెరచి ఉంచేందుకు యుద్ధ నౌకలు పంపాల్సిందిగా ఏడు దేశాలకు విజ్ఞప్తి చేసినట్లు ట్రంప్ సోమవారం ప్రకటించారు. మీ మీ సొంత ప్రాంతాలను కాపాడుకోవడానికి ముందుకు రావాలని దేశాలను కోరానని ఆయన చెప్పారు. ఐతే ఏ దేశమూ ఆయనకు నిర్దిష్ట వాగ్దానం చేయలేదు. మిత్రదేశాలతో బుజ్జగింపులు, హెచ్చరికలకు దిగారు. హోర్ముజ్ నుండి నౌకలను సురక్షితంగా దాటించేందుకు రక్షణ చర్యల నిమిత్తం యుద్ధ నౌకలు పంపించడానికి తిరస్కరిస్తే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నాటో దేశాలకు హెచ్చరిక చేశారు. హోర్ముజ్‌ను కాపలా కాసేందుకు యుద్ధ నౌకలు పంపాలని చైనా సహా నాటో దేశాలకు ట్రంప్ సోమవారం పదే పదే కోరారు. దాదాపు కాళ్ళబేరానికి వచ్చి విజ్ఞప్తులు చేయడం ప్రారంభించారు. ''ముఖ్యంగా బ్రిటన్,ఫ్రాన్స్,చైనా దేశాలు హోర్ముజ్‌కు యుద్ధ నౌకలు పంపాలి, తద్వారా ఈ ప్రాంతాన్ని రక్షించుకోగలుగుతాం, దాదాపుగా శిరచ్ఛేదానికి గురైన ఇరాన్ దేశం వల్ల ఇక అప్పుడు హోర్ముజ్‌కు ఎలాంటి బెదిరింపులూ,ప్రమాదం ఉండదు'' అని ట్రంప్ తన ప్రకటనలతో పట్టుపట్టారు. ఐతే బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్ దేశాలు ట్రంప్ అభ్యర్థనను ఇప్పటికే తిరస్కరించాయి. ఐతే బ్రిటన్ మాత్రం మైన్ స్వీపింగ్ డ్రోన్‌లను పంపడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆదివారం రాత్రి ట్రంప్‌తో బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్ ఫోన్ సంభాషణ చేసి మైన్ స్వీపింగ్ డ్రోన్లను మాత్రం పంపుతామని చెప్పినట్లు వార్తలు వెలువడ్డాయి.



నౌకా దళాలను హోర్ముజ్ ప్రాంతానికి పంపితే అవి నీట మునిగిపోయే ప్రమాదం ఉందని బ్రిటన్ సైనిక దళాల మాజీ ప్రధానాధిపతి ఒక ప్రకటనలో హెచ్చరిక చేశారు.నాటో అనేది ఒక రక్షణాత్మక కూటమే తప్ప దాడి చర్యలకు పాల్పడటానికి మద్దతు ఇవ్వడానికి అది సిద్ధంగా లేదని మరో అధికారి నిక్ కార్టర్ అన్నారు. యుద్ధంలోకి వెళితే బ్రిటన్ దేశ ప్రయోజనాలు దెబ్బతింటాయని మంత్రులు భావిస్తున్నారు. అదేవిధంగా ట్రంప్ చేసిన విజ్ఞప్తికి చైనా ప్రభుత్వం కూడా స్పందించింది. కానీ యుద్ధం వెంటనే ఆపేయాలని షరతు విధించింది. చైనా విదేశీవ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ మాట్లాడుతూ, హోర్ముజ్ జలసంధి నుండి నౌకల రవాణా స్వేచ్ఛగా సాగేలా యుద్ధ నౌకలు పంపడానికి,సహకారానికి తాము సిద్ధంగా ఉన్నామని, కానీ అమెరికా,ఇజ్రాయెల్–ఇరాన్ వెంటనే పశ్చిమ ఆసియాలో యుద్ధం నిలిపివేయాలని ఈ యుద్ధం వల్ల ప్రపంచశాంతి,స్థిరత్వం, ఆర్థికవ్యవస్థకు నష్టం వాటిల్లుతోందని అన్నారు. ఈ జలసంధిని మూసివేసినందు వల్ల చమురు సంక్షోభం తలెత్తిందని నౌకలను సురక్షితంగా అక్కడి నుండి దాటించేందుకు యుద్ధ నౌకలు పంపాలని ట్రంప్ కోరుతున్నారు. ఈ జలసంధి నుండి వచ్చే చమురులో 90 శాతం వాటి చైనాకు కూడా ఉన్నందువల్ల చైనా కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని, చైనాకు కూడా పూర్తి బాధ్యత ఉందని ఆయన వాదిస్తున్నారు. ''యుద్ధ నౌకలను పంపించాలని నేను ఇచ్చిన పిలుపును తిరస్కరిస్తే నాటో దేశాలకు భవిష్యత్తు చాలా చెడ్డగా ఉంటుంది'' అని హెచ్చరించారు. ఇరాన్ తన యుద్ధం ద్వారా ప్రపంచాన్ని ఆర్థిక గందరగోళంలోకి నెట్టే ప్రమాదం ఉందని ఆయన నాటో దేశాలకు చెప్పారు. ఇరాన్‌లో జరుగుతున్న యుద్ధాన్ని, ఉక్రేన్‌లో యుద్ధానికి ముడిపెట్టి ఆయన ఈ హెచ్చరికలు చేస్తున్నారు. పరిస్థితులు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. కానీ బ్రిటన్ మంత్రులు మాత్రం వైట్‌హౌస్ వాదనలను అంత తీవ్రంగా పరిగణించకుండా ట్రంప్ ఆందోళన తీవ్రతను తక్కువ చేసి చూపించే ప్రకటన చేశారు. ఇరాన్ యుద్ధపరమైన శక్తిసామర్థ్యాలను గణనీయంగా క్షీణింపజేశామని, డ్రోన్లు తయారుచేసే సామర్థ్యం కూడాఇరాన్‌కు తగ్గిపోయిందని ట్రంప్ ప్రచారం చేస్తున్నప్పటికీ, ప్రపంచ దేశాలకు అవసరమైన చమురు అవసరాల్లో ఐదోవంతు అవసరాలు తీరకుండా ఇరాన్ చాలా విజయవంతంగా హోర్ముజ్ జలసంధి ద్వారా రాకపోకలను అడ్డుకుంది.

## అకాడమీ పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులలో ఇతివృత్తంగా దీన్ని రచించారు. అదే విధంగా ఆంగ్ల రచయిత, మాజీ రాయబారి నవతేజ్ సర్నా, హిందీ రచయిత్రి మమతా కాలియా సహా 24 మంది రచయితలను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. వీరంతా 2025 సంవత్సరానికి గాను సాహిత్య అకాడమీ పురస్కారం అందుకోనున్నారని జాతీయ సాహిత్య అకాడమీ సోమవారం ప్రకటించింది. ఈ పురస్కారాలను ప్రకటించేందుకు డిసెంబర్ 2025లో నిర్వహించ తలపెట్టిన విలేకరుల సమావేశాన్ని అకాడమీ రద్దు చేసిన కొన్ని నెలల తర్వాత ఈ ప్రకటన వెలువడింది. 'సాహిత్య అకాడమీతో గుర్తింపు పొందిన 24 భారతీయ భాషలలో పలు సాహిత్య అకాడమీ పురస్కారాలను సోమవారం ప్రకటించడం పట్ల అకాడమీ హర్షం వ్యక్తం చేసింది. 8 కవితా సంకలనాలు, 4 నవలలు, 6 కథా సంకలనాలు, 2 వ్యాస సంకలనాలు, ఒక సాహిత్య విమర్శ గ్రంథం, ఒక ఆత్మకథ, 2 జ్ఞాపకాల గ్రంథాలు 2025 సాహిత్య అకాడమీ పురస్కారాలను గెలుచుకున్నాయని ఒక ప్రకటనలో పేర్కొంది. నవతేజ్ సర్నా తన నవల 'క్రిమ్‌సన్ స్ప్రింగ్'కు గాను ఈ పురస్కారానికి ఎంపిక కాగా, మమతా కాలియా తన జ్ఞాపకాల గ్రంథం 'జీతే జీ అల్హాబాద్' కు గాను ఈ అవార్డును అందుకోనున్నారు. ఈనెల 31న జరిగే ఒక ప్రత్యేక కార్యక్రమంలో పురస్కార గ్రహీతలకు ఒక రాగి ఫలకం (దీనిపై వివరాలు చెక్కబడి ఉంటాయి), ఒక శాలువా, రూ. 1 లక్ష నగదు బహుమతిని అందజేస్తామని అకాడమీ తెలిపింది. పురస్కారం అందుకుంటున్న ఇతర రచయితలలో బెంగాలీ భాషలో 'శ్రేష్ఠ కవిత'కు గాను ప్రసూన్ బంద్యోపాధ్యాయ, గుజరాతీలో 'భట్‌కడేక'కి గాను యోగేష్ వైద్య, కన్నడలో 'జాడ సీరు ఒండి'కు గాను అమరేష్ నుగడోని, మలయాళంలో 'మయం అన్య యార్'కు గాను ఎన్. ప్రభాకరన్, మరాఠీలో 'కల్యానిల్య రేఖా'కు గాను రాజు బావిస్కర్, పంజాబీలో 'సేఫ్టీ కిట్ గాను జిందర్, రాజస్థానీలో 'భర్ద మా'కు గాను జితేందర్ కుమార్ సోనీ, తమిళంలో 'తమిళ్ సిరుకతైయిన్ తడంగల్'కు గాను సా. తమిళ్ సెల్వన్ ఉన్నారు. ఉర్దూలో 'సఫర్ జరీ హై' కోసం ప్రీతాపాల్ సింగ్ బేతాబ్, సింధీలో 'వాఘూ' కోసం భగవాన్ అట్లానీ, సంతాలీలో 'మిద్ బిర్హా చెన్రె సాతోన్ జనాగ్ సాగై' కోసం సుమిత్రా సోరెన్, 'సంతాలిలో మహామహోపాధ్యాయ సాహు భద్రేష్తాస్‌క్తాస్' ఒడియాలో 'పాదపురాణం'కి గిరిజాకుమార్ బలియార్ సింగ్, నేపాలీలో 'నేపాలీ పరంపరీక్ సంస్కృతి రా సభ్యతా కో దుకుటి'కి ప్రకాష్ భట్టరాయ్, మణిపురిలో 'కంగ్లమద్రిబా ఈఫుట్' కోసం హౌబామ్ నళిని కూడా ఈ అవార్డును అందుకున్నవారిలో ఉన్నారు.

## యుద్ధం నిలిపివేయాలి

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. ఎక్కడో జరుగుతున్న ఈ యుద్ధం కారణంగా దేశంలోని రైతులు, వ్యాపార వర్గాలు, అన్ని వర్గాల ప్రజలతో పాటు ఇతర దేశాల్లో ఉంటున్న భారతీయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోదీ ఏమీ పట్టనట్లుగా అమెరికాకు బానిసలా వ్యవహరిస్తున్నారని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ శాంతి కావాలంటే ట్రంప్ యుద్ధం ఆపాల్సిందేనని, ఈ దిశగా భారత ప్రధాని అమెరికాపై ఒత్తిడి తేవాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు.

**ఇరాన్‌లో ని 9 కోట్ల మంది ప్రజలకు జీవించే హక్కు లేదా : బివి.రాఘువులు**

ఇరాన్‌లోని 9 కోట్ల మంది ప్రజలకు ఈ ప్రపంచంలో జీవించే హక్కులేదన్నట్లుగా డొనాల్డ్ ట్రంప్, నేతన్యాహూలు వ్యవరిస్తూ గత 16 రోజులుగాదాడులకు తెగబడుతూ వేలాది మందిని హతమార్చిందని బి.వి.రాఘువులు విమర్శించారు. తమను ప్రశ్నించే దేశాలు ఉండకూడదనే కోపంతోనే అమెరికా, ఈ దాడులకు తెగబడుతోందన్నారు. అమెరికా ఆటలు ఇంకా సాగబోవని రష్యా, చైనా, బ్రెజిల్ లాంటి అనేక దేశాలు ఇప్పటికే స్పష్టం చేస్తున్నా, బ్రిక్స్ దేశంలో భాగస్వామ్యంగా ఉన్న భారత ప్రధాని మోదీ మాత్రం అమెరికాకు దాసోహామంటూ పరోక్షంగా యుద్ధంలో భాగస్వామ్యం అవుతున్నారని ఆరోపించారు. ప్రధాని మౌనంపై దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని రాఘువులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్య నాయక్, ఎస్.ఛాయాదేవి, కౌన్సిల్ సభ్యురాలు ఫైమిదా, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, నాయకులు డి.జి.నరసింహారావు, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు హమ్మేష్ , సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## కొలువుదీరిన మయన్మార్ కొత్త పార్లమెంటు

### దేశాధ్యక్షుడి ఎన్నికకు రంగం సిద్ధం



**నైపిటావ్:** ఐదు సంవత్సరాల విరామం తర్వాత మయన్మార్‌లో కొత్త పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యాయి. సైనికుల మద్దతు ఉన్న యుఎస్‌డిపి (యూనియన్ సాలిడారిటీ అండ్ డవలప్‌మెంట్ పార్టీ) తరపున గెలిచిన ప్రజాప్రతినిధులు మయన్మార్ సం ప్రదాయ దుస్తులు ధరించి దేశంలోని అన్ని ప్రాంతాలనుండీ రాజధానికి తరలివచ్చి పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యారు. కొత్త పార్లమెంటు మొదట స్పీకర్‌ను, ఆ తర్వాత దేశాధ్యక్షుణ్ణి, మ రో ఇద్దరు ఉపాధ్యక్షులను ఎన్నుకుంటుంది. సైనికులు తమ పరిపాలనను చట్టబద్ధం చేసుకోవడంకోసమే అక్రమ పద్ధతుల్లో ఎన్నిక లు నిర్వహించారని, ఈ ఎన్నికల ఫలితాలను తిరస్కరించాలని ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కార్యాలయంలో ప్రత్యేక ప్రతినిధి టామ్ ఆండ్రూస్ ప్రపంచ దేశాలను కోరారు. అక్రమంగా జై లుపాలైన ప్రజాస్వామ్య ఉద్యమ నాయకురాలు ఆంగ్‌సాన్ సూకీ (80) జీవితకాల శిక్ష అనుభవిస్తున్నారు. సైనిక జుంటా పరిపాలనలో అంతర్జాతీయ పరిశీలకుల తీవ్ర నిరసనలు,వ్యతిరేకత మధ్య ప్రజాస్వామ్య పునరుద్ధరణ పేరుతో పార్లమెంటు ఎన్నికలు జరిగిన తర్వాత సైనిక పాలకుల అనుకూల పార్టీ యుఎస్‌డిపి సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. కొత్త ప్రభుత్వం నాయకత్వంలో మొదటిసారి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యాయి. సైనికపాలకులు నిర్దేశించిన కొత్త రాజ్యాంగం ప్రకారం పార్లమెంటు ఉభయసభల్లో ఉన్న మొత్తం 586 స్థానాల్లో 166 స్థానాలు సైనిక ప్రతినిధులకు రిజర్వు చేసి ఉంటాయి. పార్లమెంటు దిగువసభలో 373 స్థానాలు, ఎగువసభలో 213 స్థానాలు ఉన్నాయి. సైనిక అనుకూల యుఎస్‌డిపి 339 స్థానాలు గెలుచుకోగా, ఇతర అనుకూల పార్టీలు ఒకటి నుండి 20 లోపు స్థానాలు గెలుచుకున్నాయి. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఎన్నికల ద్వారా పునరుద్ధరించామని సైనిక పాలకులు ప్రకటించారు. సూకీ పార్టీని, ఇతర ప్రతిపక్షాల ను ఎన్నికల్లో పోటీ చెయ్యనివ్వలేదు. ఎగువ సభ సమావేశాలు మా ర్చి 18వ తేదీ బుధవారం ప్రారంభమవుతాయి. మార్చి 18వ తేదీ నుండీ దేశవ్యాప్తంగా ఉన్న 14 ప్రాంతీయ చట్టసభల సమావేశా లు ప్రారంభమవుతాయి. ఈ ఎన్నికల ద్వారా పాలక సైనిక వ్యవస్థ పరిపాలనపై తన ధృఢమైన పట్టు నిలబెట్టుకుంది. సైనికపాలకులు తమ అధికారాన్ని పటిష్టం చేసుకోవడంకోసం ప్రజాస్వామానికి కట్టుబడిన పార్టీలను పోటీ చెయ్యనివ్వకుండా తమకు అనుకూలమైన పద్ధతుల్లో ఎన్నికలు నిర్వహించారని ప్రపంచవ్యాప్తంగా పరిశీలకుల నుండి విమర్శలు వెలువెత్తాయి. 2021 ఫిబ్రవరిలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానమంత్రి ఆంగ్‌సాన్ సూకీకి చెందిన నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ ప్రభుత్వాన్ని అధికారం చేపట్టనీయకుండా సైనికపాలకులు అడ్డుపడి ఆమెను జైలుపాలు చేశారు. అప్పటినుండీ సైనిక పాలన కొనసాగింది. చివరకు గత ఏడాది చివరి నుండి మూడు విడతలుగా మయన్మార్‌లో ఎన్నికల తంతు నడిపించి జుంటా కనుసన్నల్లో ఉండే యుఎస్‌డిపి ప్రభుత్వం కొలువుదీరింది.

## యుద్ధకాంక్ష

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని దేశాలపై ప్రత్యక్షంగా, మరి కొన్ని దేశాలపై పరోక్షంగా తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ఇప్పటికైనా ప్రధాని మోదీ అమెరికాకు వ్యతిరేకంగా తన గళం విప్పాలని డిమాండ్ చేశారు. ఈ యుద్ధంపై శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని బిఎసి సమావేశంలో ప్రస్తావించినట్లు సాంబశివరావు తెలిపారు.

## 90 లక్షల మెట్రిక్ టన్నులు

(మొదటి పేజీ తరువాయి)

కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌లో 54.48 లక్షల ఎకరాల్లో 152.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా ఉందని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వమే పెద్ద ఎత్తున్న ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవడంతో రైతులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండ ధాన్యం ఉత్పత్తికి తగినట్లుగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు ఆధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్రప్రభుత్వం నిర్ణయించిన మద్ధతు ధర గ్రేడ్ ఎ రూ.2,389, సాధారణ రకంకు రూ. 2,369లను చెల్లించ నున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ ఏడాది కొనుగోలు కేంద్రాలను పెంచడంతో పాటు రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో టార్బాలిన్ షీట్లు, ఎలక్ట్రానిక్ తుకాలు, తేమను కొలిచే పరికరాలు, ఆటోమేటిక్ వరి క్లినర్లు, డిజిటల్ డయల్ కాలిపర్స్, హస్క్ రిమువర్ల తో పాటు సరిపడా గన్నీ బ్యాగులను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు.

## పరిష్కారమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధులు సమానత్వ ప్రాతిపదికపై రాజకీయ వ్యవస్థలను గౌరవించుకుంటూ స్వయంనిర్ణయాధికారం ఆధారంగా చర్చలు జరపడానకి సంసిద్ధత వ్యక్తంచేసినట్లు బెర్ముడెజ్ పేర్కొన్నారు. అవసరమైన పరిష్కారాలు సాధించడానికి ద్వైపాక్షిక సమస్యలను గుర్తించడమే ఈ చర్చల్లో ప్రధానమైన ఎజెండా అని చెప్పారు. ''క్యూబా విప్లవ చరిత్ర, దాని స్థిరమైన విధానాలకు అనుగుణంగా విప్లవ నాయకుడుగా ఆర్మీ జనరల్ రౌల్ కాస్ట్రో రుజ్, కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీ మొదటి ప్రధాన కార్యదర్శి, క్యూబా రిపబ్లిక్ అధ్యక్షుడు బెర్ముడెజ్‌లు పార్టీ,ప్రభుత్వ అత్యున్నత నిర్మాణాలతో కలిసి సమష్టిచర్యల్లో భాగంగా ఇటీవల క్యూబా అధికారులు అమెరికా ప్రతినిధులతో చర్చలు జరిపారు'' అని గ్రాన్మా పత్రిక పేర్కొంది. పార్టీ పొలిటికల్ బ్యూరో, పార్టీ సెంట్రల్ కమిటీ సెక్రటేరియట్, మంత్రిమండలి కార్యనిర్వాహక సభ్యుల సమక్షంలో అమెరికా ప్రతినిధులతో చర్చల విషయాన్ని దయాజ్ కానెల్ బెర్ముడెజ్ ప్రకటించారు. రెండు దేశాలమధ్యా ద్వైపాక్షిక విభేదాలకు చర్చల ద్వారా పరిష్కార మార్గాలు కనుక్కోవడమే లక్ష్యంగా ఈ ప్రక్రియ ప్రారంభమైందని ఆయన తెలియజేశారు.

ట్రంప్ కూడా తాజాగా చర్చల విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ఉద్ఘాటించారు. అమెరికా విధించిన ఆర్థిక, చమురు ఆంక్షలవల్ల క్యూబా పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. ఆ దేశంలో సర్వత్రా విద్యుత్ కొరత, అంధకారం అలముకుందని, అనేక మంది ప్రజలు వలసబాటపట్టారన్నారు. వారికి చర్చలు తప్ప వేరే మార్గం లేదని అన్నారు. అనేక దశాబ్దాలుగా క్యూబాలో కమ్యూనిస్టుపాలనను అంతమొందించేందుకు అమెరికాలో వరుస ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు ఇప్పుడు ట్రంప్ పాలనలో మరింత పరాకాష్ఠకు చేరుకున్నాయి.

## ఆర్థిక కేటాయింపులే కాదు

(మొదటి పేజీ తరువాయి)

మార్గదర్శనమని, రాష్ట్రంలోని ప్రతి పౌరుని ఆశలు, ఆకాంక్షలను, వారి ఆశయాలను తీర్చేందుకు అని అన్నారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు, నగరాలతో తెలంగాణ పోటీపడే స్థాయికి చేరుకుంటుందని,ప్రపంచ వ్యాప్తంగా విజయవంతమైన అభివృద్ధి నమూనాల స్ఫూర్తితో, 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజా ప్రభుత్వ స్వప్నాన్ని సాకారం చేయడానికి, ఐకమత్యంతో, ఆత్మవిశ్వాసంతో నిలువెత్తు నిబద్ధతతో మనమందరమూ కలిసి పని చేద్దామని,తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రభాగాన నిలుపుదామన్నారు. రాష్ట్రంలో 3.38 కోట్ల మందికి సన్న బియ్యాన్ని అందిస్తున్నామని, టిజిపిఎస్‌సిని, ఇతర నియామక బోర్డులను సంస్కరించి, రికార్డు సమయంలో 67,763 ఉద్యోగాలను భర్తీ చేశామని గవర్నర్ వివరించారు. తెలంగాణలో వేగంగా పట్టణీకరణ జరుగుతున్నందున, 2031నాటికి రాష్ట్రంలో పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుకుంటుందని అంచనా ఉన్నదని, పట్టణాల భవిష్యత్తు అవసరాల నేపథ్యంలో జిహెచ్‌ఎంసిని సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించిందని, జిహెచ్‌ఎంసీని పునర్వ్యవస్థీకరించిందని తెలిపారు.

హైడ్రా సంస్థ ద్వారా రూ.60 వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడుకున్నామన్నారు. ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ద్వారా ఇప్పటి వరకు 269.68 కోట్ల జీరో టికెట్లు ఇచ్చారని, తద్వారా రూ.9,222 కోట్లు ఆదా అయిందన్నారు. మహాలక్ష్మి పథకంలో 42.90 లక్షల కుటుంబాలకు రూ.500కు ఎల్‌పిజి సబ్సిడీ సిలిండర్లను అందిస్తున్నామని, గృహ జ్యోతి కింద పేదల గృహాలకు 200 యూనిట్ల ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ఇప్పటివరకు, రూ.3,900.54 కోట్లు ఖర్చు చేసి 10.97 కోట్ల జీరో బిల్లులు ప్రభుత్వం జారీ చేసిందని ఆయన వివరించారు. డ్రగ్స్‌ను నిర్మూలిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత సంవత్సరం వానాకాలం సీజన్‌లో రైతభరోసా పథకం కింద రూ. 8,744 కోట్లు ఇచ్చామని, పంట రుణమాఫీ కోసం ప్రభుత్వం రూ.20,616 కోట్లు ఖర్చు చేసిందన్నారు. మహాత్మాగాంధీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా, ప్రజా ప్రభుత్వం 6.52 కోట్ల పని దినాల ఉపాధి కల్పించిందన్నారు. బిసి రిజర్వేషన్ల బిల్లు భారత రాష్ట్రపతి ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపించామని గుర్తు చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ ట్రాన్ఫఫర్మేషన్ ప్రాజెక్టులో భాగంగా ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాల నుంచి గాంధీ సరోవర్ వరకు ఫేజ్1 ప్రాజెక్టు త్వరలోనే ప్రారంభమవుతుందని గవర్నర్ తెలిపారు. రానున్న కొన్ని సంవత్సరాల్లో తెలంగాణ పశ్చిమ ప్రాంతంలో ఉన్న కొడంగల్ ఏరియా ఇండస్ట్రియల్ హబ్ గా మారనుందన్నారు.

**రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం... :**

తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ. 3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయని, ఇటీవల హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని గవర్నర్ తెలిపారు. '23వ బయో ఆసియా సదస్సు' ద్వారా రూ.1700 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామన్నారు. ఐటి ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయని, ఎగుమతుల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే 7వ స్థానంలో నిలిచిందని వివరించారు.

**దేశ జిడిపిలో తెలంగాణ వాటా 4.49 శాతం**

దేశ జాతీయ వృద్ధి రేటు 8 శాతం. ద్రవ్యోల్బణం 1.72 శాతం ఉన్నదని, జాతీయ తలసరి ఆదాయం కూడా నిరంతరం పెరుగుతోందని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సుస్థిర వృద్ధి నమోదు చేస్తోందని, 202526లో రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి రూ. 17.82 లక్షల కోట్లు అని, 10.7 శాతం వృద్ధి రేటు నమోదు చేసిందన్నారు. దేశ జిడిపిలో తెలంగాణ వాటా 4.99 శాతమని, రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కు చేరుకుందని, ఇదే సమయంలో, ద్రవోల్బణాన్ని 0.2 శాతానికి నియంత్రించిందని, రాష్ట్రంలో ధరల స్థిరత్వం కొనసాగించిందని వివరించారు. 'వికసిత్ భారత్ 2047 విజన్'కు అనుగుణంగా 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' డాక్యుమెంట్‌ను ఆవిష్కరించామన్నారు.

**పెండింగ్ ప్రాజెక్ట్‌ల భూసేకరణ కొన్ని నెలల్లోనే పూర్తి చేస్తాం:**

కృష్ణా, గోదావరి నదుల జలాల వాటాల్లో రాష్ట్ర ప్రయోజనాలను రక్షించేందుకు ప్రభుత్వం అన్ని వేదికల్లో కట్టుబడి పని చేస్తోందని గవర్నర్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, పునరావాస ప్రక్రియను కొన్ని నెలల్లోనే పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులను వచ్చే మూడు సంవత్సరాల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ ప్రాజెక్టుల ద్వారా మూడేళ్లలోనే ఆశించిన కొత్త ఆయకట్టుకు నీరందుతుందన్నారు.

## స్పష్టమైన హామీల్లేవ్

(మొదటి పేజీ తరువాయి)

సంతృప్తి కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. కాగా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరుగుతోందని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని సిపిఐ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాకుండా ఉన్నాయని, కార్మికులు, రైతులు, అనేక రంగాల ప్రజల సమస్యలు చర్చించేందుకు కనీసం 20 రోజుల పాటు శాసనమండలి సమావేశాలను నిర్వహించాలని కోరారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద గవర్నర్ ప్రసంగంపై ఆయన స్పందిస్తూ పెండింగ్ ప్రాజెక్టుల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలు పూర్తిగా అమలు కావడం లేదని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు రాని పరిస్థితి నెలకొన్నదని, విశ్రాంత ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలు అందడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి తగిన బడ్జెట్ కేటాయింపులు చేయకుండా సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదని సత్యం విమర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ సమస్యలు, పంటలకు మద్దతు ధర, సాగునీటి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ధరల పెరుగుదల వల్ల సాధారణ ప్రజల జీవితం కష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమానికి సంబంధించిన పథకాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. విద్య, ఆరోగ్యం, పబ్లిక్ సెక్టార్‌లో ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలని కోరారు. ప్రజల ప్రయోజనాలకు అనుకూలమైన నిర్ణయాలకు మద్దతు ఇస్తామని, కానీ ప్రజా వ్యతిరేక విధానాలను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ఉభయసభలకూ ఇచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

ఇండిపెండెంట్ ఎంపిలు కూడా ఉన్నారు. ఈ నోటీసులలో ఎంపీలు అందరూ జ్ఞానేశ్ కుమార్‌పై ఏడు ఆరోపణలు చేశారు. అనేక సందర్భాలలో జ్ఞానేశ్ కుమార్ భారతీయ జనతాపార్టీకి ఎన్నికల్లో సహకరించారని ప్రతిపక్షాలు తరచు విమర్శలు చేశాయి. ప్రత్యేకించి 'సర్' ప్రక్రియలో బిజెపికి ఆయన చాలా మేలు చేశారన్నది ప్రతిపక్షాల ప్రధాన విమర్శ.

2025 ఫిబ్రవరిలో జ్ఞానేశ్ కుమార్‌ను భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారిగా నియమించారు. వాస్తవానికి ఆనాడే పది పేజీలతో తన అసమ్మతిని రాహుల్ గాంధీ లిఖితపూర్వకంగా తెలియజేశారు. కొద్ది గంటల్లో సుప్రీంకోర్టు విచారణ ఉన్న తరుణంలో రాత్రికి రాత్రే ఆయన నియామకంపై నిర్ణయం తీసుకున్నారని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఈ నియామకానికి సంబంధించిన కమిటీలో ఎవరెవరు ఉండాలనే విషయంపై వివాదం సుప్రీంకోర్టులో ఉందని, ఈ కమిటీ నియామకాన్ని సవాలుచేసిన అంశం 48 గంటల్లో సుప్రీంకోర్టులో విచారణకు వస్తుందనగా ప్రధానమంత్రి, హోంమంత్రి అర్ధరాత్రి ఆదరాబాదరాగా కొత్త ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్ నియామకంపై నిర్ణయం తీసుకున్నారని, ఈ కమిటీలో ఉన్న ప్రతిపక్ష నాయకుణ్ణి పరిగణనలోకి తీసుకోకుండా ఇతర సభ్యులను గౌరవించకుండా, వారి అభిప్రాయాన్ని పట్టించుకోకుండా చాలా అమర్యాదకరంగా ఈ నిర్ణయం తీసుకున్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రధానమంత్రి,హోంమంత్రితోపాటు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు కూడా సిఇసిని ఎంపిక చేసే నిర్ణయాత్మక కమిటీలో ఉంటారని, కానీ ప్రతిపక్ష నాయకుణ్ణి వారు గౌరవించలేదని విమర్శించారు. ఈ ఎంపిక కమిటీలో ఎవరెవరు ఉండాలనే విషయం సుప్రీంకోర్టు ఎదుట విచారణలో ఉన్న సమయంలో ప్రధానమంత్రి, హోంమంత్రి ఇలాంటి చర్యకు పాల్పడ్డారని చెప్పారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఓట్ చోరీ ఆరోపణలు చేసిన నేపథ్యంలో, గత ఏడాది ఆగస్టునెలలో జరిగిన పత్రికాగోష్ఠిలో జ్ఞానేశ్ కుమార్ బహిరంగంగా ప్రతిపక్ష నాయకుణ్ణి హెచ్చరించారు. ఘర్షణాత్మక మనస్తత్వంతో జ్ఞానేశ్ కుమార్ బాహాటంగా ప్రతిపక్ష నాయకుణ్ణి క్షమాపణలు చెప్పమని డిమాండ్ చేశారు. లేకపోతే ఎన్నికల నిబంధనల ప్రకారం ఒక అఫిడవిట్‌పై సంతకం చేసి ఇవ్వాలని కోరారు. ఈ అంశాలన్నింటినీ పార్లమెంటు ఉభయసభలకూ ఇచ్చిన నోటీసులలో ప్రముఖంగా ప్రస్తావించామని రాహుల్‌గాంధీ చెప్పారు. దేశంలో జరుగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ అంతా వట్టిమోసం,దగా,ఓట్‌చోరీ అని ప్రతిపక్షాలకు చెందిన ఎంపీలు అందరూ ముక్తకంఠంతో విమర్శిస్తున్నారన్నారు. ఓటర్ల జాబితాలలో అనేక తప్పులు,అధికారపార్టీకి అనుకూలమైన పద్ధతులలో సవరణలు చేశారని అనేకసార్లు రుజువైందని, ఈ విషయంలో ప్రతిపక్షాలు అనేకసార్లు ఆందోళనలు చేశాయని ఆయన గుర్తుచేశారు.

## ఇరాన్ డ్రోన్ దాడి

(మొదటి పేజీ తరువాయి)

చేసుకుని దాడులు చేస్తున్నామని ఇరాన్ ముందస్తు హెచ్చరిక చేసింది. ఇరాన్ దాడులతో తీవ్రంగా నష్టపోయిన కువైట్ ప్రభుత్వం యుద్ధంలో మరణించిన సైనికులకు సోమవారం నివాళులు అర్పించింది. వారికోసం సంతాపదినం పాటించింది. మరోవైపు ఆఫ్రికా, ఆసియా తదితర దేశాల్లో నిత్య రవాణాకు ఉపయోగించే డీజిల్ కొరత తీవ్రత పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ ఒక బ్యారెల్ ధర 100 డాలర్లువద్ద స్థిరంగా నిలబడి ఉంది. ఫిబ్రవరి 28న యుద్ధం మొదలైన తర్వాత క్రూడాయిల్ ధర గణనీయంగా 45 శాతం మేరకు పెరిగింది. ఆ తర్వాత కొద్దిగా క్షీణించింది. ఒకదశలో బ్యారల్ చమురు ధర అత్యధికంగా 120 డాలర్లకు చేరుకుంది. సోమవారం ఎర్లీ ట్రేడింగ్‌లో ఈ ధర 104 డాలర్లు ఉండగా ఆ తర్వాత 100 డాలర్ల వద్ద స్థిరంగా నిలబడింది. వెనిజులాలో చమురు క్షేత్రాలపై ఆధిపత్యం సంపాదించిన ట్రంప్ ఇప్పుడు ఇరాన్‌కు ప్రాణాధారమైన ఖర్గ్ ద్వీపంలో ఉన్న కీలకమైన చమురు కేంద్రాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అమెరికన్ పత్రికల సమాచారం పేర్కొంది. ఐతే ట్రంప్ ఇంకా దీని కోసం ఒక ప్రణాళిక సిద్ధం చేయలేదని వైట్‌హౌస్ అధికారి ఒకరు అన్నారు.

**సహాయం నిరాకరించిన దేశాలను గుర్తుంచుకుంటాం:ట్రంప్**

హోర్ముజ్ జలసంధి ద్వారా అన్ని నౌకలకు అనుమతి ఉంటుందని, కానీ అమెరికా, ఇజ్రాయెల్‌లతో ముడిపడిన నౌకలకు మాత్రం అనుమతి లేదని ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చి ప్రకటించగా, హోర్ముజ్ జలసంధిని నౌకా రవాణాకోసం తెరచి ఉంచేవిధంగా రక్షించుకోవడానికి ముందుకు రావాలని చైనా సహా నాటో మిత్ర దేశాలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విజ్ఞప్తి చేశారు. కానీ ఏ దేశమూ ఆయన విజ్ఞప్తికి స్పందించలేదు. తొలుత ఆయన చైనా, ఫ్రాన్స్,జపాన్,దక్షిణ కొరియా, బ్రిటన్ దేశాలకు ఈ విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌ఫోర్స్ ఒన్ విమానంలో ట్రంప్ ప్రయాణ సమయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ, హోర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచేందుకు సహకరించమని దేశాలను తాము కోరామని, తమకు సహకరించేందుకు నిరాకరించిన దేశాలను గుర్తుంచుకుంటామని హెచ్చరించారు. బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్ అందరికంటే ముందుగా హోర్ముజ్‌కు యుద్ధ నౌకలను పంపేందుకు తిరస్కరించారు. అదేసమయంలో బ్రస్సెల్స్‌లో యూరోపియన్ యూనియన్ (ఇ.యు) దేశాల విదేశీమంత్రుల సమావేశం సందర్భంగా ఇ.యు విదేశీ విధాన ప్రధానాధిపతి కాజా కల్లాస్ మీడియాతో మాట్లాడుతూ, ఎర్ర సముద్రం నుండి హోర్ముజ్ జలసంధి వరకూ ఉన్న వాణిజ్య నౌకలను రక్షించడానికి వీలుగా నావికాదళాలను పంపించే విషయాలను చర్చిస్తామని చెప్పారు. నౌకా రహదారుల రక్షణకు యూరప్ ఎప్పుడూ అండగా నిలబడుతుందని కల్లాస్ అన్నారు. జపాన్ ప్రధానమంత్రి సనే తకైచీ కూడా సోమవారం మీడియాతో మాట్లాడుతూ, హోర్ముజ్ జలసంధిని రక్షించేందుకు సహకరించాల్సింది ట్రంప్ నుండి తనకు ఎలాంటి వర్తమానం రాలేదని అన్నారు.

ఈ పరిస్థితులమధ్య గల్ఫ్ దేశాలపై దాడులు ఆపేయాలని, విధ్వంసం సృష్టించవద్దని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనతో ఫోన్ సంభాషణ చేసినట్లు మేక్రాన్ ప్రకటించారు. మరోవైపు ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఒక ప్రకటన చేస్తూ, యుద్ధ నివారణకు చర్చల భ్రమలు తొలగిపోయాయని, ఇక చర్చలు–సంభాషణలు మాకు వద్దని స్పష్టం చేశారు. ''ఎంతకాలమైనాగానీ మా దేశాన్ని మేం కాపాడుకుంటాం, పోరాడతాం'' అని ప్రకటించారు. యుద్ధం మొదలైన తర్వాత నుండి ఇప్పటివరకూ అమెరికా–ఇజ్రాయెల్‌పై ఇరాన్ 3,600 డ్రోన్లు, 700 క్షిపణులు ప్రయోగించింది.ఇరాన్‌పై ఇప్పటివరకూ జరిగిన దాడుల్లో 1300 మంది ఇరానియన్లు మరణించగా, ఇరాన్ చేసిన క్షిపణి దాడుల్లో 12 మంది ఇజ్రాయెలీ ప్రజలు మరణించారు. పశ్చిమాసియా యుద్ధంలో ఈ 17 రోజుల్లో 13 మంది అమెరికా సైనికులు మరణించారు.

## ● అసెంబ్లీ మీడియా పాయింట్

### గవర్నర్ అంటే బిఆర్ఎస్‌కు గౌరవం లేదు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గవర్నర్ అంటే బిఆర్ఎస్ నేతలకు గౌవరం లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక గవర్నర్ ప్రసంగం పట్ల అవమానకరంగా మాట్లాడుతున్నారన్నారు. ఆరు గ్యారంటీలలో ఐదు అమలు అవుతున్నా బిఆర్ఎస్ పార్టీ ప్రజలను తప్పు దోవ పట్టించడం విడ్డూరంగా ఉందన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, మూడు ఎకరాల భూమి ఇస్తామని అమలు చేశారా? అని బిఆర్ఎస్ నేతలను ఆయన ప్రశ్నించారు. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ బిఆర్ఎస్ నేతలకు కనిపించడం లేదా? అని అన్నారు. ఉన్నదంతా ఊడ్చుకుని వెళ్ళి, అప్పుల కుప్పగా రాష్ట్రాన్ని మార్చి నేడు ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. బిఆర్ఎస్ హయాంలో ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, నిరుద్యోగుల కోపాన్ని చవిచూశారన్నారు. తాము ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీ అమలు చేసుకుంటూ ముందుకు పోతామన్నారు.

### గవర్నర్ ప్రసంగంలో గోదావరి జలాల ఊసే లేదు

బిఆర్ఎస్ పక్ష ఉప నాయకులు టి.హరీష్‌రావు



తెలంగాణ గవర్నర్ ప్రసంగంలో గోదావరి జలాలు కాపాడుకుంటామని ఎందుకు పొందుపర్చలేదని బిఆర్ఎస్ పక్ష ఉప నాయకులు టి.హరీష్‌రావు ప్రశ్నించారు. సమైక్య రాష్ట్రంలో నీళ్ల విషయంలో తెలంగాణ నీటి హక్కుల కోసం కెసిఆర్ నిరంతరం పోరాటం చేశారని హరీష్‌రావు గుర్తు చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద గవర్నర్ ప్రసంగంపై ఆయన స్పందిస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కృష్ణ, గోదావరి జిలాల్లో అన్యాయం జరుగుతున్నదని, ఇందుకు స్పష్టత, దూరదృష్టి లేని రేవంత్ రెడ్డి ప్రభుత్వమే దీనికి కారణమని ఆరోపించారు. ఎపిలో టిడిపి, కేంద్రంలో బిజెపి కలిసి తెలంగాణకు నీటి విషయంలో తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. సిడబ్ల్యుసి చర్యలు గోదావరి జలాల్లో తెలంగాణకు అన్యాయం చేసే విధంగా ఉన్నాయన్నారు. జనవరి 12న సిడబ్ల్యుసి మీటింగ్ జరిగిందని, సిడబ్ల్యుసి మినిట్స్ వచ్చిన తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం, రేవంత్ రెడ్డి నిద్రపోతున్నారా? చంద్రబాబుకు దాసోహం అయ్యారా? అని హరీష్‌రావు ప్రశ్నించారు. గోదావరి, బనకచర్ల అంశం లేకపోతే మీటింగ్‌కు పోతామని ప్రభుత్వం చెప్పిందని, మొదటి అంశం పోలవరం, నల్లమల సాగర్ అయినా సమావేశానికి ఎలా వెళ్లారని నిలదీశారు. గోదావరి జలాల్లో నీటి కేటాయింపులు లేవని ఎపి చెప్పింది. దానికి ఎలా ఒప్పుకున్నారు? మినిట్స్ తప్పు వస్తే ఎందుకు స్పందించడం లేదు? ఒప్పుకున్నారా? ఒప్పుకున్నట్లు లెక్కనా అని ఆయన ప్రశ్నించారు. చేతగాని ముఖ్యమంత్రి చర్యల వల్ల గోదావరి నీటి హక్కులను తెలంగాణ కోల్పోతున్నదని ఆరోపించారు.

### గవర్నర్ ప్రతి మాట అక్షర సత్యం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

అసెంబ్లీలో గవర్నర్ నోటి వెంట వచ్చిన ప్రతి మాట అక్షర సత్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగం ఒక రోడ్ మ్యాప్ అని, ప్రతి అంశం అందులో ఉందన్నారు. ఎంతమంది ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయో లెక్కలతో సహా చెప్పామన్నారు. దాదాపు 25 లక్షల మంది రైతులు రైతు రుణమాఫీ లబ్ధి పొందిన విషయం బిఆర్ఎస్ నేతలకు కనిపించడంలేదా? అని ప్రశ్నించారు. ఉంటే అధికారపక్షంలో ఉంటాం, లేదంటే ఫామ్‌హౌస్‌లో ఉంటామనే విధంగా బిఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 'మొదటిసారి కొత్త గవర్నర్ అసెంబ్లీకి వస్తే ప్రతిపక్ష నేత కెసిఆర్ ఎక్కడికి వెళ్లారు. ఫామ్‌హౌస్‌లో పడుకుంటే ఎలా? మళ్ళీ హాజరు కోసం అసెంబ్లీకి బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు ఐదునిమిషాలు వచ్చి పోతారు. ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసినా, చిక్కు ముళ్ళు విప్పుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుంది' అని ఆయన అన్నారు.

### కాళేశ్వరం పేరుతో ఆర్థిక దోపిడీ చేశారు

ఎమ్మెల్యే రామ్‌చందర్‌నాయక్

బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం, మిషన్ భగీరథ పేరుతో ఆర్థిక దోపిడీకి పాల్పడిందని ఎమ్మెల్యే రామ్‌చందర్‌నాయక్ ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రజలను బిఆర్ఎస్ నేతలు మభ్యపెడుతున్నారని విమర్శించారు. గవర్నర్ ప్రసంగాన్ని బిఆర్ఎస్ నేతలు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

### బిఆర్ఎస్ పార్టీ ఇల్లీగల్ పార్టీ

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

బిఆర్ఎస్ పార్టీ లీడర్ లెస్‌పార్టీ, ఇల్లీగల్ పార్టీ అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ, 'మీ (బిఆర్ఎస్) నాయకుడు ఫామ్ హౌస్‌లో పడుకుంటారు. మీ నాయకులు డ్రగ్స్ తీసుకుంటారు' అని ఆయన అన్నారు. హరీశ్ రావు, కెటిఆర్ వల్ల బిఆర్ఎస్ పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డిని ఎదుర్కొనే నాయకుడు ప్రతిపక్ష పార్టీలో లేరన్నారు. అసెంబ్లీలో కూడా బిఆర్ఎస్ నేతలకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించాలన్నారు.

### బిఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదు

ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్

బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క పేదవాడికి ఇల్లు ఇవ్వలేదని, ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రెండేళ్లలోనే ప్రజలకు కొత్తగా 13 లక్షల రేషన్ కార్డులు ఇచ్చిందని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 70 లక్షల మెట్రిక్ టన్నులు రైతుల నుండి వడ్ల కొనుగోలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసే మూసీ ప్రక్షాళనపై కెటిఆర్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మూసీ ప్రక్షాళన నల్లగొండకు వరప్రదాయిని అవుతుందని, ఇది గొప్ప కార్యక్రమం అని అన్నారు.

### గవర్నర్ ప్రసంగం అంతా డొల్ల

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



గవర్నర్ ప్రసంగం పూర్తిగా డొల్ల ప్రసంగంగా ఉందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్‌తో అబద్ధాలతో నిండిన ప్రసంగం చేయించిందని ఆరోపించారు. గవర్నర్ ప్రసంగంలో స్కీమ్‌ల గురించి లేదని, స్కామ్‌ల గురించి ఉందని ఎద్దేవా చేశారు. మొత్తం ప్రసంగం చిత్తు కాగితంతో సమానంగా ఉందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు, మహిళలకు రూ.2500 సాయం హామీ గురించి గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావన లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు ఏళ్ళు గడిచినా ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్లు పెంచలేదన్నారు. రెండేళ్లు ప్రజలను మోసం చేసి, మరోమారు ఈ బడ్జెట్‌లో తెలంగాణ ప్రజలను మోసం చేయడానికి సిద్ధమయ్యారన్నారు. ఒక్క కొత్త పెన్షన్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేదని, ఆశగా ఎదురుచూస్తున్న పేదవారిని మోసం చేస్తుందన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న రూ.15 వేల రైతు భరోసా ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను అసెంబ్లీలో ఎండగడతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన జోక్ అయ్యిందన్నారు.

## 30 వరకు శాసనసభ, శాసనమండలి

# బడ్జెట్ సమావేశాలు



20న రాష్ట్ర వార్షిక బడ్జెట్... 30న ద్రవ్య వినియమయ బిల్లు : బిఎసి నిర్ణయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలను ఈనెల 30 వరకు మొత్తం 11 రోజుల పాటు కొనసాగించాలని సభా వ్యవహారాల సలహా కమిటీ (బిఎసి) నిర్ణయించింది. ఈనెల 17, 18 తేదీలలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చించాలని బిఎసి తీర్మానించింది. ఈనెల 19న ఉగాది పండుగ సందర్భంగా సభకు సెలవు. ఈనెల 20వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క 2026–27 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్‌ను సభలో ప్రవేశపెడతారు. రంజాన్ పండుగ సందర్భంగా ఈనెల 21, 22 తేదీలలో సభకు సెలవు ఇవ్వగా, 23, 24 తేదీలలో వార్షిక బడ్జెట్‌పై సాధారణ చర్చ జరగనుంది. అనంతరం ఈనెల 25, 26, 28, 29 తేదీలతో ప్రభుత్వ శాఖల పద్దులపై చర్చ ఉంటుంది. శ్రీరామ నవమి పండుగ సందర్భంగా 27వ తేదీన సభకు సెలవు ప్రకటించారు. జిహెచ్ఎంసి స్థానంలో 'క్యూర్' బిల్లు, గిగ్ వర్కర్లకు సంబంధించిన బిల్లు తదితర పలు బిల్లులపై కూడా 29వ తేదీన చర్చ జరగనుంది. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ, ఆమోదం 30వ తేదీన జరగనుంది. శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత సభ మంగళవారం నాటికి వాయిదా పడింది. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన బిఎసి సమావేశం జరిగింది. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, బిఆర్ఎస్ పక్ష ఉప నాయకులు టి.హరీష్‌రావు, ఎంఐఎం పక్ష నాయకులు అక్బరుద్దీన్ ఓవైసీ, బిజెపి పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర రెడ్డి, సిపిఐ పక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా తెలంగాణ శాసనమండలి సమావేశాలను కూడా ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షత జరిగిన సభా వ్యవహారాల సలహా కమిటీ (బిఎసి) నిర్ణయించింది. సభ ఎజెండా దృష్ట్యా ఒక ఆదివారం కూడా సభను నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో సిపిఐ సభ్యులు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సభలో తాము వేస్తున్న ప్రశ్నలకు మంత్రులు, ప్రభుత్వ శాఖల నుంచి సమాధానాలు రావడం లేదని, వాటికి సమాధానాలు ఇవ్వడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి సభ చైర్మన్ చొరవ తీసుకోవాలని కోరారు.



## శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ జాతి గౌరవం, నిరంతర స్ఫూర్తికి నిలువెత్తు ప్రతిబింబంగా, అస్తిత్వం, సంస్కృతికి ప్రతిరూపమైన శక్తి స్వరూపిణి 'తెలంగాణ తల్లి విగ్రహాన్ని' రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభ రోజున సోమవారం జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్‌తోపాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తొలుత ముఖ్యమంత్రితో కలిసి గవర్నర్ అసెంబ్లీ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం పునరుద్ధరించిన శాసనమండలి భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించారు.

## మూడు భాషల్లో గవర్నర్ ప్రసంగం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా' తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషలలో ప్రసంగించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం అసెంబ్లీకి వచ్చిన నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తొలుత శాసన సభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సోమవారం ఉదయం 11:45 గంటలకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కలిసి గవర్నర్ శుక్లాను శాసనసభలోకి తొడ్కొని వచ్చారు. అనంతరం 'జయ.. జయ జయ హే తెలంగాణ', వందే మాతరం, జాతీయ గీతాన్ని' ఆలపించిన తర్వాత గవర్నర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. సభలోకి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్లబ్యాడ్జీలతో వచ్చారు.'ఆరు గ్యారంటీలను' అమలు చేయాలని నిరసిస్తూ గవర్నర్ ప్రసంగం పూర్తయ్యే వరకు వారు తమ తమ స్థానాల్లోనే నిల్చున్నారు. అయితే గవర్నర్ తన ప్రసంగంలో 'ఉద్యోగాలు, పెట్టుబడులు, రైతు భరోసా, నది జలాలు, మహాలక్ష్మి పథకం' తదితర అంశాలను ప్రస్తావించగా బిఆర్ఎస్ సభ్యులు 'దోకా' అంటూ నినాదాలు చేశారు. కాగా గవర్నర్ తన ప్రసంగాన్ని ఉదయం 11:52 గంటలకు ప్రారంభించి, 12:52 గంటలకు పూర్తి చేశారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభ, శాసనమండలి బడ్జెట్ సమావేశాలలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. వరుసగా ఎన్నికల్లో ఓటమి పాలవుతున్న బిఆర్ఎస్ పార్టీ నైరాశ్యంలో ఉందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సన్నద్ధమై వస్తారని, వారిని సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించే సమయం ముగిసిందని, ఇకపై కాంగ్రెస్ ప్రభుత్వ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయనుందనే దానిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంగ్రెస్ శాసనసభా పక్షం (సిఎల్‌పి) సమావేశం సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం శాసనమండలి ప్రాంగణంలోని హాల్‌లో జరిగింది. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సిలకు సిఎం రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. అసెంబ్లీలో చర్చలు పక్కదారి పట్టకుండా విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. ప్రజా ప్రభుత్వంగా మూడో బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నామని, ప్రభుత్వ ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలపై గవర్నర్ ప్రసంగంలో ఇప్పటికే స్పష్టంగా వివరించామని చెప్పారు. గవర్నర్ ప్రసంగం తమ ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లాంటిదని ఆయన అభిప్రాయపడ్డారు. బడ్జెట్ అద్భుతంగా ఉండనుందని, భవిష్యత్‌లో మంచి పథకాలు రానున్నాయని సిఎం వెల్లడించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తమకు వివిధ అంశాలపై మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని, సిఎల్‌పి నేతగా ఉన్న మల్లు భట్టివిక్రమార్కకు, అలాగే సీనియర్ నాయకులు కె.జానారెడ్డికి కూడా మైక్ ఇవ్వలేదని, తాను ఎమ్మెల్యేగా ఉన్న రోజుల్లో సెషన్ మొత్తం సస్పెండ్ చేసి సభకు రాకుండా చేశారని సిఎం గుర్తుచేశారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు హాజరు విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని సిఎం హెచ్చరించారు. ముఖ్యంగా మహిళా శాసనసభ్యులు సభకు హాజరై చర్చల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఉభయ సభలకు సభ్యులు సకాలంలో హాజరై చురుకుగా పాల్గొనాలన్నారు. సమావేశాల సమయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ప్రతి సభ్యుడు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రతిపక్ష పార్టీ సభ్యులు అడిగే ప్రశ్నలకు మంత్రులు సమగ్రంగా, స్పష్టంగా సమాధానాలు ఇవ్వాలని, విమర్శలను ఎమ్మెల్యేలు సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు.

## గవర్నర్ ప్రసంగం తెలంగాణ అభివృద్ధికి ప్రతిబింబం

మంత్రి వాకిటి శ్రీహరి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేసిన ప్రసంగం రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలు, సంకల్పం, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు స్పష్టమైన ప్రతిబింబంగా నిలిచిందని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందిస్తూ... తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి, సంక్షేమం మరియు పారదర్శక పాలన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ముఖ్యంగా రైతు సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యా, వైద్య రంగాల అభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు స్పష్టంగా ప్రతిబింబించాయని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా లక్షలాది మహిళలు ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. అలాగే రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించడం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి నిర్ణయాలు సామాన్య కుటుంబాలకు గణనీయమైన ఉపశమనం కలిగిస్తున్నాయని అన్నారు. రైతులపై అప్పుల భారం తగ్గించేందుకు రైతు రుణమాఫీ అమలు దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి సాగునీటి వనరుల అభివృద్ధి మరియు ఆధునిక సాంకేతికత వినియోగంపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. తెలంగాణను అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడం, ప్రతి వర్గానికీ సంక్షేమ ఫలితాలు అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీకి జీవన్‌రెడ్డి రాజీనామా?



జీవన్ రెడ్డి ఇంటి వద్ద కాంగ్రెస్ నేతలతో కూడిన ఫ్లెక్సీల తొలగింపు



**ప్రజాపక్షం/జగిత్యాల :** నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీలో కార్యకర్త నుండి మంత్రి వరకు పనిచేసిన తాటిపర్తి జీవన్ రెడ్డి రాజీనామా దిశగా అడుగులు వేయడం జగిత్యాలలో కనబడుతోంది. జీవన్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులతో కూడిన ఫ్లెక్సీలు ఉండగా సోమవారం సాయంత్రం తొలగించడం మొదలు పెట్టారు. దీంతో జీవన్ రెడ్డి రాజీనామా, పార్టీ మారేందుకు వేస్తున్న అడుగు మరింత బలమైందని జగిత్యాలలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే జీవన్ రెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులు బుజ్జగించేందుకు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేకపోవడంతో పార్టీ మారేందుకు ముహూర్తం ఫిక్స్ అయినట్లు కాంగ్రెస్ కార్యకర్తలే పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం జీవన్ రెడ్డి ఇంటి వద్ద తీసుకుంటున్న చర్యలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ జెండాలు, ఫ్లెక్సీలతో నిండిపోయిన వాటిని పూర్తిగా తొలగించడం రాజీనామా అంశానికి మరింత బలం చేకూరినట్లు వాదనలు వినిపిస్తున్నాయి. గత మున్సిపల్ ఎన్నికల సమయం నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతోనే విసుగు చెంది రాజీనామా నిర్ణయానికి జీవన్ రెడ్డి వచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనా జగిత్యాలలో జీవన్ రెడ్డి రాజీనామా చేస్తారనే అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఇదిలా ఉండగా ఈ నెల 25న జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

## మోదీ ప్రభుత్వ వైఫల్యంతోనే చమురు సంక్షోభం



సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హనుమకొండలో సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా

**ప్రజాపక్షం/హనుమకొండ :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం వైఫల్యంతోనే దేశంలో చమురు సంక్షోభం నెలకొందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం గ్యాస్, పెట్రోల్ ధరలను తగ్గించాలని, చమురు సంక్షోభాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాళీ గ్యాస్ సిలిండర్‌లతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నేడు నెలకొన్న ఈ సంక్షోభం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దూరదృష్టి లేని విధానాలు, తప్పుడు ప్రాధాన్యతల యొక్క ప్రత్యక్ష ఫలితం అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు మోతె లింగారెడ్డి, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎన్ ఎ స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం, మునిగాల భిక్షపతి, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, మాలోత్ శంకర్ నాయక్, కొట్టే వెంకటేష్, అదరి రమేష్, వేల్పుల సారంగపాణి, కండె నర్సయ్య, గుంటి రాజేందర్, కామెర వెంకట రమణ, అలువాల రాజు, యాళ్ళ సంజయ్, లకవత్ లక్ష్మి, భూక్యా స్వరూప, గోకాల రాజయ్య, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశంలో గ్యాస్ కొరతను నివారించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ :** అమెరికా ఇరాన్‌పై చేస్తున్న యుద్ధంతో మన దేశ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దేశ ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడి... ట్రంప్ ఆగడాలపై స్పందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి అన్నారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధం... దేశంలో గ్యాస్ కొరతకు వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గీతా భవన్ చౌరస్తాలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్‌ల కొరతతో రాబోయే రోజుల్లో మళ్లీ కట్టెల పొయ్యిలే దిక్కని సూచిస్తూ కట్టెల పొయ్యిని అంటించి, గ్యాస్ సిలిండర్‌లను ఎత్తుకొని నిరసన వ్యక్తం చేశారు. ట్రంప్ యుద్ధోన్మాదానికి, దేశంలో గ్యాస్ కొరతకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండవ సారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ప్రపంచ దేశాలపై తన ఆధిపత్యాన్ని చెలాయించాలని చూస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి, సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, న్యాలపట్ల రాజు, కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బీర్ల పద్మ, కటికరెడ్డి, బుచ్చన్న యాదవ్, మచ్చ రమేష్, కొట్టే అంజలి, తెరాల సత్యనారాయణ, సిపిఐ నగర నాయకులు గామినేనీ సత్యం, భారతి, కూన రవి, నగునూరి రమేష్, బాకం ఆంజనేయులు, చెంచలమురళి, ఆవునూరి రమేష్, బాపురెడ్డి, విష్ణు, రజిత, స్వప్న, సుజాత,రవళి తదితరులు పాల్గొన్నారు.

GHMC
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, ఖైరతాబాద్ జోన్, హైదరాబాద్.
'e'Procurement No.34/EE-II/Circle-38/Khairatabad Zone/GHMC/2025-26 తేది: 16.03.2026
Nit No. 34/EE-II/KZ/GHMC/2025-26, పని పేరు: సివిల్ పనులు (01 నెం.లు), అంచనా విలువ / ఇసివి: రూ.2.20 లక్షలు, ప్రారంభ తేది / డౌన్‌లోడ్ ఆఖరి తేది & సమయం: క్ర.సం.01 పనుల కొరకు 17.03.2026న మ.12.00గం.ల నుండి 20.03.2026న మ.12.00గం.ల వరకు మాత్రమే, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, కెజెడ్, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా @ https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు. ఇ-మెయిల్ అడ్రస్: eec38.yousufguda@gmail.com, మొబైల్ నెం. 7331189501.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, ఖైరతాబాద్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 17100-PP/CL/ADVT/1/2025-26, Date: 16-03-2026

దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ సహస్రలింగేశ్వర స్వామి దేవస్థానము, కమలానగర్.
ECIL 'X' రోడ్స్, కాప్రా (మం), మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రం
Rc.No.F4/12849/2024 ప్రకటన/నోటిఫికేషన్ తేదీ: 16/03/2026
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా! తేదీ:24/02/2026 శ్రీయుత కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, తెలంగాణ, హైదరాబాద్ ప్రకారము దేవాదాయ శాఖ వారి ప్రకారము TC & HRI Rule 4 మరియు దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టము 30/1987 ప్రకారము శ్రీ సహస్రలింగేశ్వర స్వామి దేవస్థానము, కమలానగర్, ECIL 'X' రోడ్స్, కాప్రా (మం). మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు నాన్ హెరిడేటరీ ట్రస్ట్ బోర్డు నియామకము గూర్చి నోటిఫికేషన్ జారీ అయినది.
కావునా ట్రస్టీషిప్ కొరకు ఆసక్తి గలవారు నోటీసు ప్రకటన తేదీ నుండి 20 దినములలోపు దరఖాస్తులను దేవాదాయ శాఖ చట్టంలోని 17 వ సెక్షన్ నందలి సెక్షన్ (3) క్రింద నిర్దిష్ట ప్రొఫార్మా లోని (ఫామ్-II) లో ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి 20 రోజుల లోపు శ్రీయుత కమీషనర్, దేవాదాయ - ధర్మాదాయ శాఖ, తెలంగాణ, హైదరాబాద్/ శ్రీయుత సహాయ కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, రంగారెడ్డి జిల్లా వారికి దరఖాస్తు పంపగలరు.
సం/- కమీషనర్
DIPR R.O. No. : 17051-PP/CL/ADVT/1/2025-26, Date: 16-03-2026

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
మంగళవారం
17-03-2026
www.prajapaksham.in
జనరల్
STATE & REGIONAL NEWS

## బడ్జెట్‌లో మధ్యాహ్న భోజన పథకానికి
# కేటాయింపులు పెంచాలి

అసెంబ్లీలో వంట కార్మికుల సమస్యలపై పోరాటం

సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో మధ్యాహ్న భోజన పథకానికి కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేస్తూ, అలాగే వంట కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో పోరాటం చేస్తానని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎఐటియుసి అనుబంధ సంఘం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేంపావని అధ్యక్షతన జరిగింది. ఈ ధర్నాకు కూనంనేని సాంబశివ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట కార్మికులు 54,200 మందికి గత 24 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనం చెల్లిస్తూ ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకోవడం అన్యాయమన్నారు. అసెంబ్లీలో వంట కార్మికుల సమస్యలపై తన వంతు పోరాటం చేస్తానని, వంట కార్మికులు అసెంబ్లీ వెలుపల పోరాటాల ద్వారా హక్కుల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వంట కార్మికుల యొక్క సమస్యలు పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వస్తే వంట కార్మికులకు రూ.10వేల వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. డా.బి.వి.విజయలక్ష్మి మాట్లాడుతూ వంట కార్మికులకు కోర్టు తీర్పు ప్రకారం రూ.17వేలు వేతనం అమలు చేయాలని, వీరికి సామాజిక భద్రత కల్పించే పిఎఫ్, ఇఎస్‌ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని, ప్రమాద బీమా పథకం వర్తింప చేయాలని, గతంలో అల్పాహారం చేసిన బిల్లులు, పారితోషిక బకాయిలను సత్వరం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. పి.ప్రేమ్ పావని మాట్లాడుతూ మధ్యాహ్న భోజన వంట కార్మికుల కోడిగుడ్లను, నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా బిల్లులు చెల్లిసున్నా అవి సక్రమంగా అమలు కావటం లేదన్నారు. వంట కార్మికులకు లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా గుర్తింపు కార్డులను ఇవ్వాలని, సెంట్రలైజ్డ్ కిచన్ ఆలోచనను ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. ఈ ధర్నాలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ వక్తలను వేదికపైకి ఆహ్వానించగా, వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేశ్, గౌరవాధ్యక్షురాలు డి.కమలా రెడ్డి, ఉపాధ్యక్షులు టి.చక్రపాణి, కె.సుగుణ, కుంటాల రాములు, కార్యదర్శులు రామక్రిష్ణ, లక్ష్మణ్, కోశాధికారి రంగారెడ్డిలతో పాటు జిల్లాల నాయకులు పాటకుల కళావతి, సామల రమ, సమ్మక్క, సాయమ్మ, బాలరాజ్, బి.లక్ష్మి, శ్రీదేవి, తాల్లూరి లక్ష్మి, ఇందిరా, సరస్వతి, పద్మలు ప్రసంగించారు.

# యుద్ధం అంతర్జాతీయ హక్కుల ఉల్లంఘన

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వివిఎస్ బోస్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** అమెరికా, ఇజ్రాయిల్ దేశాల కూటమి సామ్రాజ్యవాద దురాక్రమణ లక్ష్యంగా ఇరాన్‌పై చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపాలని సిపిఐ డిమాండ్ చేస్తూ సోమవారం మేడ్చల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు, ప్లే కార్డులతో ధర్నాలు నిర్వహించారు. సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో మల్లాపూర్‌లో ప్లేకార్డులతో జరిపిన నిరసన ధర్నాలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్ మాట్లాడుతూ ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధం అంతర్జాతీయ హక్కుల ఉల్లంఘన అన్నారు. ప్రపంచ శాంతి మరియు మానవత్వం కోసం యుద్ధం కాకుండా రాజదౌత్యం, సంప్రదింపులే సరైన మార్గమన్న విషయాన్ని చరిత్ర ఎన్నోసార్లు నిరూపించిందన్నారు. రాజకీయ, ఆర్థిక ఆధిపత్యం కోసమే మధ్య ప్రాచ్య దేశాలను యుద్ధ వేదికగా మార్చాయన్నారు. యుద్ధాలు సామాన్య ప్రజలకు మేలు చేయదని, పేద కార్మికులు, రైతులు, సామాన్య ప్రజలు, మహిళలు, పిల్లలే యుద్ధ బాధితులవుతారన్న విషయాన్ని మర్చిపోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.ధర్మేంద్ర, సిపిఐ నాయకులు టి.మల్కయ్య, పార్టీ ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్యప్రసాద్, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, మహిళా కన్వీనర్ జి.స్వప్న, సిపిఐ నేతలు నారా నరసింహ, నరసింహారావు, కృపాకర్, నర్సింగరావు, సీనియర్ సిటిజన్ నేతలు సాంబశివ రావు, మల్లేష్, నాగేశ్వరరావు, ఉప్పల్ నియోజక వర్గ ఏఐఎస్‌ఎఫ్ నేతలు వికాస్‌రెడ్డి, కౌశిక్, కిరణ్, స్వాజిత్‌రెడ్డి, శ్రీనివాస్, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. జవహర్‌నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోటపల్లి శంకర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నిమ్మల నరసింహులు, పార్టీ సీనియర్ నేత సిహెచ్ దశరథ్, ఆల్వాల్ మండల కార్యదర్శి అమరావతి బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.జంగయ్య, గిరిజన సమైఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామలత, వి.స్వరూప నాయక్, ప్రజా కళాకారుడు వి.వెంకటాచారి,సిపిఐ నేతలు పి.నరసింహ, చిరంజీవి, ఎన్.పద్మ, ఎన్ సంతోష్, మల్లిక, కోమల గణేష్ తదితరులు పాల్గొన్నారు. నేరేడ్‌మెట్‌లో ... లేబర్ అడ్డా వద్ద సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాసర్ల నాగరాజు అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఐ నేత సిహెచ్ దశరథ్ అమెరికా అధికార దాహాన్ని తీర్చుకొనేందుకు యుద్ధాన్ని తీసుకొని వచ్చి దురహంకారంతో ప్రవర్తిస్తూ పలు దేశాల సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తక్షణమే యుద్ధాన్ని ఆపేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రొయ్యల గిరిజా కృష్ణమూర్తి, ఎస్‌కె అజీజ్ సయ్యద్, యూసూఫ్, జె.వెంకటరమణ, కె.రెడ్డప్ప, ఇ.మహేష్, కె.శీను, ఆర్ సత్తయ్య, కె.వెంకటేష్, ఆంజనేయులు, కరుణాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**గ్యాస్ సిలిండర్లతో నిరసన :** అమెరికా,ఇజ్రాయిల్ల కూటమి చేస్తున్న యుద్ధాన్ని ఆపేయాలన్న డిమాండ్‌తో జగద్గిరిగుట్ట అవుట్‌పోస్ట్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ఖాళీ గ్యాస్ సిలిండర్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలను తమ గుప్పిట్లో ఉంచుకొని సంపదపై పెత్తనం చెలాయించాలన్న దురాలోచనతోనే ట్రంప్ యుద్ధోన్మాద చర్యలంటూ దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు హైమవతి, పార్టీ మండల సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్, మండల కోశాధికారి సదానంద్, శాఖ కార్యదర్శి సహదేవ రెడ్డి, ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు బాబు, శాఖ సభ్యులు ఇమామ్ రవి, సామెల్ కొండయ్య విజయ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




## హైదరాబాద్‌లో అత్యాధునిక ఎఐ ఆధారిత 640-స్లైస్ సిటి స్కానర్

ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని విస్టా ఇమేజింగ్ అండ్ మెడికల్ సెంటర్‌లో దేశంలోనే తొలిసారిగా అత్యాధునిక యుసిటి 960+ ఎఐ ఆధారిత 640స్లైస్ సిటి స్కానర్‌ను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ అత్యాధునిక స్కానింగ్ వ్యవస్థను మెడికా బజార్, యునైటెడ్ ఇమేజింగ్ హెల్త్‌కేర్ సంస్థల సహకారంతో ఏర్పాటు చేశారు. 640స్లైస్ సామర్థ్యంతో ఒక్కసారి యంత్రం తిరిగినప్పుడు పూర్తి గుండెను స్కాన్ చేయడం సాధ్యమవుతుంది. ఈ సందర్భంగా మెడికాబజార్ అధ్యక్షుడు వి.పి.తిరుమలై మాట్లాడుతూ భారతదేశంలో వైద్య రంగానికి ప్రపంచ స్థాయి సాంకేతికతను అందించడం తమ లక్ష్యమని, ఈ కొత్త స్కానర్ దేశంలోని డయాగ్నస్టిక్ సేవలను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు ప్రముఖ వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డితో ప్రముఖ ఆర్థికవేత్త సుబ్రమణియన్ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో ప్రముఖ భారత ఆర్థికవేత్త సుబ్రమణియన్ హైదరాబాద్‌లోని అసెంబ్లీలోని సిఎం చాంబర్‌లో సోమవారం మర్యాదపూర్వక సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ రంగం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, జిఎస్‌టి అంశాలపైన సుబ్రమణియన్ తో సిఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క చర్చించారు. విద్యుత్ రంగంలో ఖర్చుల నమూనా , స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ విభాగంలో నమూనా మూల్యాంకనం, జిఎస్‌టిలో పన్నుల అంచనా, ఇతర అంశాలపై చర్చించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు సుబ్రమణియన్ పలు కీలక సూచనలు చేశారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చుకునేందుకు ప్రణాళికాబద్ధంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

## నందిని సిధారెడ్డికి సిఎం అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణకు చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ 2025 పురస్కారం లభించడం పట్ల, సిధారెడ్డి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిన కవి నందిని సిధారెడ్డి రాసిన అనిమేష కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. సిధారెడ్డి కరోనా మహమ్మారి కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను చిత్రీకరించడంవల్ల తనకు సమాజంపట్ల ఉన్న నిబద్ధతను, అలాగే తనలోనున్న ఆర్ద్రతను తెలియజేస్తుందని, వారు గొప్ప మానవతావాదని అన్నారు. సిధారెడ్డి గారి సుదీర్ఘ సాహిత్య కృషికి లభించిన గౌరవమని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో అక్షరాన్ని ఆయుధంగా మలిచి ప్రజల్లో చైతన్యం నింపడంలో వారు పోషించిన పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## మైనార్టీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేని కాంగ్రెస్ : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని బిఆర్‌ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. మైనార్టీల సంక్షేమం కోసం ప్రకటించిన డిక్లరేషన్‌ను అమలు చేయకుండా వారిని మోసం చేశారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ తెలంగాణ భవన్‌లో బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం 'దావత్‌ఏఇఫ్తార్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మైనారిటీలకు పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న ప్రతి హామీ పట్ల ప్రభుత్వాన్ని అసెంబ్లీ వేదికగా నిలదీస్తామన్నారు. కెసిఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం కుల మతాలకు అతీతంగా, గంగాజమునా తెహజీబ్ సంస్కృతితో అద్భుతంగా ముందుకు సాగిందన్నారు.

# గ్యాస్ కొరతతో ఇబ్బందుల్లో ఆటో, క్యాబ్ డ్రైవర్లు

రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో గ్యాస్ (సిఎన్‌జి) కొరతతో చాలా మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి జీవనోపాధి దెబ్బతింటుందని తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం అన్నారు. పెరిగిన గ్యాస్ ధరతో పాటు సిఎన్‌జి కొరతను నిరసన్తూ తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి ఆధ్వర్యంలో సోమవారం నారాయణగూడ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బి.వెంకటేశం మాట్లాడుతూ ఇంటి అవసరాలకు ఉపయోగించే గ్యాస్‌తో పాటు వాహనాలలో వాడే ఎల్‌పిజి(సిఎన్‌జి)లో భారీ కొరత ఏర్పడిందన్నారు. దీంతో అనేక ప్రైవేట్ బంకుల్లో రూ.60 ఉన్న ఎల్‌పిజి ధరను రూ.100కు పెంచడం జరిగిందని, సుమారు 5, 6 గంటలు క్యూలో వేచి ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించడంతో ఇప్పటికే గత రెండున్నర సంవత్సరాల నుంచి ఆటో డ్రైవర్లు గిరాకీలు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ఇప్పుడు గ్యాస్ ధరలు పెంచడం, గ్యాస్ కొరతతో రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచన చేసి, గ్యాస్ కొరతను నివారించి, ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాలలో ఆటో కార్మికుల దీర్ఘకాలిక సమస్యలపై స్పందించాలని, లేని పక్షంలో ఈనెల 25వ తేదీన ఇందిరాపార్క్ వద్ద వేలాది మంది ఆటో డ్రైవర్లతో భారీ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వి.ప్రవీణ్ (టియుసిఐ), శ్రీకాంత్ (సిఐటియు), ఎ.సత్తిరెడ్డి(టిఎడిఎస్), ఎంఎ.సలీం(తెలంగాణ జాగృతి), యాదగిరి (టిఎన్‌టియుసి), సిహెచ్.జంగయ్య, ఎస్.అశోక్, మున్నూరు కృష్ణ, యం.నర్సింహా, యం.శ్రీనివాస్, కొమురెల్లి బాబు, ఉమర్ ఖాన్, మురళి(ఎఐటియుసి) తదితరులు పాల్గొన్నారు.

## నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ
# ప్రారంభోత్సవ ఏర్పాట్లు ముమ్మరం చేయాలి

అధికారులతో మంత్రులు తుమ్మల, పొన్నం, వాకిటి సమీక్ష




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నర్మెట్ట ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ప్రారంభోత్సవ ఏర్పాట్లు త్వరితగిన పూర్తిచేయాలని తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలు అధికారులను ఆదేశించారు. ఈనెల 22న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లుకు సంబంధించి సోమవారం అధికారులతో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ ,వాకిటి శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను వేగవంతం చేసి, సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ముఖ్యంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా రైతువేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు, తద్వారా పెద్ద సంఖ్యలో రైతులు కార్యక్రమాన్ని వీక్షించే అవకాశం కల్గుతుంన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా రైతుల సందర్శనార్థం ఈనెల 20 నుంచి 22 వరకు రైతు మేళాను నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ మేళాలో రైతులకు ఉపయోగపడే విధంగా వివిధ స్టాల్స్ ఏర్పాటు చేయాలని, కేవలం వ్యవసాయ శాఖకు సంబంధించిన స్టాల్స్ మాత్రమే కాకుండా వ్యవసాయ అనుబంధ రంగాలు, పశు సంవర్థక శాఖకు సంబంధించిన స్టాల్స్ కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ బాషా , ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో 13 ప్రఖ్యాత యుకె స్కూల్స్ క్యాంపస్‌లు

18న రాష్ట్రంలో యూకే ప్రతినిధి బృందం టూర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలోనే అత్యద్భుతమైన అంతర్జాతీయ సౌకర్యాలతో కూడిన హైదరాబాదు మహానగరానికే అంతర్జాతీయ సంస్థలు జై కొడుతున్నాయి. ఇదివరకు ఐటీ కంపెనీలు, బయో సంబంధిత సంస్థలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలు ఆసక్తి చూపుతుండగా తాజాగా విద్యా సంస్థలు కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అసక్తి చూపుతున్నాయి. యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)కు చెందిన 13 ప్రఖ్యాత పాఠశాలలు హైదరాబాద్ నగరంలో తమ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశాయి. ఈ మేరకు యూకే ప్రభుత్వం నుంచి తెలంగాణ సర్కారుకు సమాచారం అందింది. అందులో భాగంగా యూకే డిపార్టుమెంట్ ఆఫ్ బిజినెస్ అండ్ ట్రేడ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం.. ఈ నెల 18న రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ సందర్భంగా స్థానిక ఉన్నతాధికారులతో యూకే ప్రతినిధులు కీలక సమాలోచనలు జరపనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంటు మేరకు అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలోకి ఆహ్వానించేందుకు ప్రజా ప్రభుత్వం తీవ్ర కసరత్తులు చేస్తున్నది. ఈ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంలో 13 యూకే స్కూల్స్ కు సంబంధించిన రిప్రజేంటెటివ్స్, యూకే ప్రభుత్వ అధికారులు పాల్గొననున్నారు. ఈ క్యాంపస్‌లు ఎక్కడ పెట్టాలన్న దానిపై తెలంగాణ ప్రభుత్వ ఉన్నతాధికారులు సమగ్రంగా చర్చలు చేస్తున్నప్పటికీ, మరొవైపు భారత్ ఫ్యూచర్ సిటీలో ఇప్పటికే ప్రత్యేకంగా ఒక ఎడ్యుకేషన్ జోన్ లో వరల్డ్ క్లాస్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ఏర్పాటు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అడుగులు పడుతున్నాయి.



## పారాక్వాట్ గడ్డి, కలుపు మందులను నిషేధించాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులకు రైతు కమిషన్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ వ్యాప్తంగా 70దేశాల్లో నిషేధించిన పారాక్వాట్ గడ్డి, కలుపు మందులను రాష్ట్రంలోనూ నిషేధం విధించాలని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సోమవారం రైతు కమిషన్ ఛైర్మన్ ఎ.కోదండరెడ్డి నేతృత్వంలో రాములు నాయక్, చెవిటి వెంకన్న, భవానీ రెడ్డి, కెవిఎన్ రెడ్డి, కమిషన్ మెంబర్ కార్యదర్శి గోపాల్‌లతో కూడిన ప్రతినిధుల బృందం అసెంబ్లీ ఆవరణలో శాసన సభా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలను కలిసి వినతి పత్రం అందజేశారు. అత్యంత విషపూరితమైన గడి కలువు మందును తెలంగాణలో నిషేధించడం తోపాటు దేశ వ్యాప్తంగా నిషేదించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని ఈ సందర్భంగా సిఎంకు ప్రతినిధుల బృందం విజ్ఞప్తి చేసింది. దీంతో రైతు కమిషన్ ప్రతిపాదనను అసెంబ్లీలో చర్చించి రాష్ట్రంలో నిషేదించేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రులు హామీ ఇచ్చినట్లు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి వెల్లడించారు.

## బడ్జెట్ సమావేశాలు కుదించాలనే ప్రభుత్వ యత్నం

బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఎసి సమావేశంలోనే ప్రభుత్వ బాధ్యతారహితమైన ఆలోచన విధానం బయటపడిందని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ సెలవులు మినహా కేవలం ఐదు లేదా ఆరు రోజుల్లోనే బడ్జెట్ సమావేశాలు నిర్వహించి ముగించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా ఉండేందుకు పథకం ప్రకారమే సమావేశాల రోజులను తగ్గించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. కనీసం 30 రోజులపాటు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

**గవర్నర్ చేత అబద్ధాలతో ప్రసంగం చేయించారు**

**ఎమ్మెల్యే పాయల్ శంకర్**

గవర్నర్ చేత అబద్ధాలతో ప్రసంగం చేయించారని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలపై ఎలాంటి ప్రస్తావన లేదన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, బోనస్ వంటి అంశాలు ప్రసంగంలో లేవన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలపై కూడా ఎక్కడా చర్చ లేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై స్పష్టత లేదని తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల అంశం కూడా మోసమని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగుల సమస్యలు, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

**నిరుద్యోగ యువతను ప్రభుత్వం నిరాశలోకి నెట్టింది**

**ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా**

నిరుద్యోగ యువతను ప్రభుత్వం నిరాశలోకి నెట్టిందని బిజెపి ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందన్నారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీపై ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిన హామీ అమలు కాలేదన్నారు. ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించిన పెండింగ్ బకాయిలపై కూడా ఎలాంటి ప్రస్తావన లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపిస్తోందని విమర్శించారు.

**ఆరు గ్యారంటీలు, హామీలు ప్రభుత్వం మరిచిపోయింది**

**ఎమ్మెల్యే రామారావు పటేల్**

ఆరు గ్యారంటీలు, రైతు భరోసా, నిరుద్యోగ భృతి వంటి హామీలను ప్రభుత్వం మరిచిపోయిందని బిజెపి ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. రైతు రాజ్యం అని చెబుతూనే రైతులకు భరోసా కల్పించడంలో విఫలమయ్యారన్నారు. రైతు భరోసా నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. రైతుల సమస్యలపై బిజెపి పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. తులం బంగారం హామీ, మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చేసిన హామీ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## కౌంటర్ దాఖలు చేయండి

హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకా పేటలో టిఆర్‌ఎస్ పార్టీకి 11 ఎకరాలు కేటాయించడాన్ని సవాల్ చేసిన ప్రజాహిత వ్యాజ్యంలో ఆ పార్టీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సర్వే నెం. 239, 240లో 11 ఎకరాల భూకేటాయింపుపై మూడు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలంది. ఇదే చివరి అవకాశమని తేల్చి చెప్పింది. విచారణను మూడు వారాలకు వాయిదా ఎ సింది. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్, మరొక వ్యక్తి దాఖలు చేసిన పిల్స్ ను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. 11 ఎకరాల భూమిని రూ.37 కోట్లకే కేటాయించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.1100 కోట్ల నష్టం వాటిల్లిందని పిటిషనర్ల వాదన. తాము కౌంటర్ దాఖలు చేశామని బిఆర్‌ఎస్ దాఖలు చేయలేదని ప్రభుత్వం చెప్పింది. దీనిపై బీఆర్‌ఎస్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కాంగ్రెస్ పార్టీ కి కూడా ప్రభుత్వం భూమి కేటాయించిందని దానిని మాత్రం సవాలు చేయని బ్రిటిష్నరులు బిఆర్‌ఎస్ పార్టీకి కేటాయించడాన్ని మాత్రమే తప్పుపడుతున్నారని అన్నారు. వాదన తర్వాత హైకోర్టు.. చాలాసార్లు నోటీసులు జారీ చేశామని, బిఆర్‌ఎస్ కి ఇదే చివరి అవకాశమని, కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

## పిటిషన్లు డిస్మిస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని కేజీబీవీలకు బంకర్ బెడ్‌ల సరఫరాకు సంబంధించి ప్రైవేటు సంస్థలతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం కరెక్టేనని హైకోర్టు తీర్పు చెప్పింది. ఒప్పందాన్ని సవాలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు చెప్పింది. కేజీబీవీలకు 45,360 బంకర్ బెడ్‌లతోపాటు పరుపులు, దిండ్లు సరఫరాను మఫత్‌లాల్ ఇండస్ట్రీస్, ట్రూఫా టెండర్‌ప్రైజెస్ తదితరులతో రాష్ట్రంతో చేస్తున్న అగ్రిమెంట్స్ ను తెలంగాణ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ స్టీల్ అండ్ ఉడెన్ ఫర్నిచర్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఇతరులు హైకోర్టులో సవాలు చేశారు. వీటిని కొట్టివేస్తూ జస్టిస్ సూరేపల్లి నంద ఇటీవల తీర్పు చెప్పారు.

# బెంగాల్ సిఎస్‌పై ఇసి వేటు

### హోంశాఖ కార్యదర్శి, డిజిపి బదిలీ



**న్యూఢిల్లీ :** బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేపట్టింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే రాష్ట్ర ప్రభుత్వంలోని పలువురు కీలక సీనియర్ అధికారులను పదవుల నుంచి తప్పిస్తూ కొత్త నియామకాలు ప్రకటించింది. స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలనే ఉద్దేశంతో ఆ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈనెల 15 తేదీన కోల్‌కతాలోని రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఎన్నికల సంఘం ఒక లేఖ పంపింది. ఆ లేఖలో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన అనంతరం, ఆ బదిలీలు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది. ఆదేశాల ప్రకారం 1993 బ్యాచ్ ఐఎఎస్ అధికారి దుష్యంత్ నరియాలాను రాష్ట్ర ప్రభుత్వ కొత్త చీఫ్ సెక్రటరీగా నియమించాలని తెలిపింది. ఇప్పటి వరకు ఆ బాధ్యతలు నిర్వహిస్తున్న నందిని చక్రబర్తిని ఆ పదవి నుంచి తప్పించింది. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఆమెను ఎలాంటి ఎన్నికలకు సంబంధించిన బాధ్యతల్లోనూ నియమించకూడదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అదే విధంగా మరో కీలక మార్పుగా 1997 బ్యాచ్ ఐఎఎస్ అధికారి సంఘమిత్ర ఘోష్‌ను రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించింది. ఈ నియామకాలు వెంటనే అమలులోకి తీసుకురావాలని ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎన్నికల సంఘం కార్యదర్శి సుజీత్ కుమార్ మిశ్రా సంతకంతో జారీ చేసిన ఆదేశాల్లో ఈ మార్పులను వెంటనే అమలు చేయాలని స్పష్టంగా పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన అధికారులు తమ బాధ్యతలు స్వీకరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం మధ్యాహ్నం 3 గంటల లోపు నివేదిక సమర్పించాలని కూడా సూచించింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వస్తుంది. ఆ తరువాత రాష్ట్ర పరిపాలనా వ్యవస్థపై ఎన్నికల సంఘం నేరుగా పర్యవేక్షణ చేపడుతుంది. తాజాగా బెంగాల్ డిజిపిని మార్చింది. పీయూష్ పాండే స్థానంలో సిద్ధ్ నాథ్ గుప్తాను డిజిపిగా నియమించింది. సుప్రతిమ్ సర్కార్ స్థానంలో కోల్‌కతా పోలీస్ కమిషనర్‌గా అజయ్ కుమార్ నంద్‌ను నియమించింది. అయితే ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పక్షపాతం లేకుండా ఉండేందుకు పరిపాలనా వ్యవస్థలో కీలక మార్పులు చేయడం సాధారణమని అధికారులు చెబుతున్నారు. ఇదే క్రమంలో రాష్ట్ర హోంశాఖ సెక్రటరీ జగదీష్ ప్రసాద్ మీనాను కూడా పదవి నుంచి తప్పించినట్లు సమాచారం. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమీక్షించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి.

# దేశంలో ముడి చమురు కొరత లేదు

### పెట్రోల్ బంకులు యథావిధిగా పనిచేస్తున్నాయి : కేంద్రం



**న్యూఢిల్లీ:** దేశంలో ముడి చమురు కొరత లేదని కేంద్రం స్పష్టం చేసింది. భారతదేశం అంతటా ఇంధన సరఫరా స్థిరంగా ఉందని పేర్కొంది. ముడి చమురు తగినంత పరిమాణంలో అందుబాటులో ఉందని, అన్ని శుద్ధి కర్మాగారాలు వాటి అత్యధిక సామర్థ్యంతో పనిచేస్తున్నాయని స్పష్టం చేసింది. ఈ మేరకు పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ వెల్లడించారు. 'దేశంలో తగినంత పరిమాణంలో ముడి చమురు అందుబాటులో ఉంది. అన్ని శుద్ధి కర్మాగారాలు అత్యధిక సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. దేశంలో పెట్రోల్ పంపులు సాధారణంగా పనిచేస్తున్నాయి. ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత ఉన్నట్లు నివేదికలు రాలేదు' అని సుజాత శర్మ తెలిపారు. దేశంలో ఇంధన లభ్యతకు సంబంధించి కొన్ని ప్రాంతాలలో ఆందోళనల నేపథ్యంలో ఈ మేరకు ఆమె వివరణ ఇచ్చారు.

**'సరఫరా గొలుసు సజావుగా పనిచేస్తోంది'**

పెట్రోలియం సరఫరా గొలుసు సజావుగా పనిచేస్తోందని పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ అధికారులు స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్ పంపిణీలో ఎటువంటి అంతరాయం లేదని పేర్కొన్నారు. రిటైల్ అవుట్‌లెట్‌లో ఇంధనం నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చమురు మార్కెటింగ్ కంపెనీలు సరఫరా పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నాయని వెల్లడించారు.

**ముంద్రా పోర్టుకు చేరుకోనున్న నౌకలు**

మరోవైపు, శివాలిక్ నౌకలో ఎల్పీజీ క్యారియర్‌ను తీసుకొస్తున్నామని కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ అధికారి రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు. ఆ నౌకను త్వరలోనే గుజరాత్‌లోని ముంద్రా ఓడరేవులో డాకింగ్ చేయనున్నట్లు చెప్పారు. 'పర్షియన్ గల్ఫ్ నుంచి హర్మూజ్ జలసంధిని దాటి శివాలిక్ ఎల్పీజీ క్యారియర్ ఈ రోజు (సోమవారం) సాయంత్రానికి ముంద్రా పోర్టుకు చేరుకుంటుంది. ఆ నౌక రాకముందే సరుకును విడుదల చేయడంలో ఎటువంటి ఆలస్యం జరగకుండా డాక్యుమెంటేషన్, ప్రాధాన్యత బెర్తింగ్ వంటి వాటిని ఓడరేవులో ఏర్పాటు చేశాం' అని రాజేశ్ సిన్హా స్పష్టం చేశారు. 'పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలోని అందరూ భారతీయ నావికులు సురక్షితంగా ఉన్నారు. గత 24 గంటల్లో ఎటువంటి దుర్ఘటన జరగలేదు. మేము వారి పరిస్థితిపై నిరంతరం నిఘా ఉంచాం. ప్రతి నౌక, అందులోని సిబ్బందితో సంప్రదింపులు జరుపుతున్నాం. 22 భారతీయ జెండా కలిగిన నౌకలు పర్షియన్ గల్ఫ్‌లోని హర్మూజ్ జలసంధికి పశ్చిమాన ఉన్నాయి. ఆ నౌకల్లో 611 మంది భారతీయ నావికులు ఉన్నారు. మార్చి 14న యూఏఈ నుంచి బయలుదేరిన భారత జెండా ఉన్న నౌక జాగ్ లాడ్కి దాదాపు 81,000 టన్నుల ముర్బన్ ముడి చమురును మోసుకొస్తోంది. అది భారత్‌వైపునకు సురక్షితంగా ప్రయాణిస్తోంది. ఆ నౌకలో ఉన్న భారతీయ నావికులందరూ సేఫ్‌గా ఉన్నారు. వారు మంగళవారం ముంద్రా పోర్టుకు చేరుకుంటారు.' అని రాజేశ్ సిన్హా పేర్కొన్నారు.

# గ్యాస్ సంక్షోభంపై ఖర్గే ఆందోళన

### నివారణకు, బ్లాక్ మార్కెట్‌కు తరలడాన్ని అరికట్టడానికి ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదని మండిపాటు



**న్యూఢిల్లీ :** దేశంలో గ్యాస్ సంక్షోభం నెలకొనడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షోభం నివారణకు, వంట గ్యాస్ బ్లాక్ మార్కెటింగ్ తరలడాన్ని అరికట్టడానికి ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దీనిపై కేంద్ర మంత్రి, రాజ్యసభా నాయకుడు జె పి నడ్డా స్పందిస్తూ, సంక్షోభ పరిస్థితిలో ప్రతిపక్షం ప్రభుత్వానికి అండగా నిలబడటానికి బదులుగా దేశంలో అరాచకాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తోందన్నారు. రాజ్యసభలో జీరో అవర్ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ నేపథ్యంలో ఎల్‌పిజి సంక్షోభం దేశవ్యాప్తంగా విస్తృతమైన బాధను కలిగించిందన్నారు. ఇది పేదలు, దుర్బలులు, మధ్యతరగతి, సాధారణ కుటుంబాలు, రెస్టారెంట్లు, హాస్టళ్లు, వాణిజ్య వినియోగదారులను తీవ్రంగా ప్రభావితం చేస్తోందన్నారు. పశ్చిమ ఆసియాలో సంఘర్షణ పెరిగినప్పుడు, ప్రభుత్వం భారత పౌరులకు ఒక సలహా జారీ చేసిందని, అప్పటి నుండి, ఇంధన సరఫరా ప్రభావితమవుతుందని ప్రభుత్వానికి తెలుసునని ఆయన అన్నారు. అయినప్పటికీ ఎటువంటి సన్నాహాలు జరగలేదని, ఫలితంగా, దేశంలోని అనేక రంగాలు సమస్యలను ఎదుర్కొంటున్నాయని మండిపడ్డారు. ఈ సంక్షోభం ప్రభుత్వ దయనీయమైన నిర్వహణను, లోపభూయిష్ట విదేశాంగ విధానాన్ని బయటపెట్టిందని విమర్శించారు. ఎల్‌పిజి సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌లో సిలిండర్‌కు రూ.5,000 వరకు అమ్ముడవుతున్నాయని ఖర్గే అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, చిన్న వ్యాపారులందరికీ సరసమైన ధరలకు సిలిండర్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆయన ఉద్ఘాటించారు. దేశంలో ఎల్‌పిజి కొరత లేదని కేంద్ర పెట్రోలియం మంత్రి లోక్‌సభలో చెప్పారని, పుకార్లకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారని, అయితే వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందని ఆయన అన్నారు. ఖర్గే వ్యాఖ్యలకు నడ్డా ప్రతిస్పందిస్తూ సంక్షోభ సమయంలో కూడా ప్రతిపక్షం, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ, ఈ అంశంపై రాజకీయాలు చేయడం విచారకరమని అన్నారు.

# ఆసుపత్రిలో భారీ అగ్నిప్రమాదం

- 10 మంది రోగులు మృత్యువాత
- రోగులను తరలించే క్రమంలో 11 మంది ఆసుపత్రికి సిబ్బందికి గాయాలు
- మృతులకు ఒక్కొక్కరికి రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ఒడిశా ప్రభుత్వం



**భువనేశ్వర్ :** ఒడిశాలోని ఓ ప్రభుత్వం ఆసుపత్రిలో ఘోర విషాదం చోటు చేసుకుంది. ఎస్‌సిబి మెడికల్ కాలేజీ, ఆసుపత్రిలోని ఐసియులో సోమవారం తెల్లవారు జామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో పది మంది రోగులు ప్రాణాలు కోల్పోయారు. 11 ఆసుపత్రి సిబ్బందికి గాయాలైనట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంఝీ తెలిపారు. ప్రమాదం విషయం తెలుసుకున్న సిఎం హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ప్రమాదంలో చిక్కుకున్న రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించే క్రమంలో ఆసుపత్రి సిబ్బందికి కూడా గాయాలయ్యాయన్నారు. ఈ అగ్నిప్రమాదం బహుశా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించి ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు.

తెల్లవారుజామున 2:30 నుండి 3 గంటల మధ్య సంభవించిందని, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఆసుపత్రికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారని ఒక అధికారి తెలిపారు. రోగులు మరణించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పిఎంఎన్‌ఆర్‌ఎఫ్) నుండి ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా (ఆర్థిక సహాయం) అందజేస్తామని ఆయన ప్రకటించారు. 'ఒడిశాలోని కటక్‌లో ఉన్న ఆసుపత్రిలో జరిగిన ఈ దుర్ఘటన అత్యంత బాధాకరం. తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేయబడుతుంది' అని ప్రధాని మంత్రి కార్యాలయంలో ఎక్స్‌లో పోస్టు చేసింది. ప్రధానమంత్రి ఫోన్ ద్వారా ముఖ్యమంత్రి మాఝీతో మాట్లాడి, అక్కడి పరిస్థితిని సమీక్షించారు. అత్యవసర చర్యలు, సహాయక చర్యలు, గాయపడిన వారికి అందిస్తున్న ప్రత్యేక వైద్య సేవలకు సంబంధించిన వివరాలను తాను ప్రధాన మంత్రికి వివరించినట్లు సిఎం మాంఝీ తెలిపారు. ఈ అగ్నిప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన న్యాయ విచారణకు సంబంధించిన వివరాలను కూడా ముఖ్యమంత్రి, ప్రధానమంత్రికి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని కూడా ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆసుపత్రిలో జరిగిన ఈ అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సంతాపం వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని వారు ప్రార్థించారు. కాగా, ట్రామా కేర్ ఐసియు, పక్కనే ఉన్న మరో ఐసియు, వార్డులో 23 మంది రోగులు ఉన్నట్లు ముఖ్యమంత్రి మాంఝీ గమనించి, అగ్ని ప్రమాదంలో ఏడుగురు రోగులు మరణించారని, మరో ముగ్గురు కాలిన గాయాలు లేదా ఊపిరాడక మరణించారని చెప్పారు. ప్రమాదంపై విచారణ జరిపి వెంటనే తనకు నివేదించాలని అగ్నిమాపక శాఖ డిజిని కోరారు. న్యాయ విచారణ తర్వాత ఎవరైనా దోషిగా తేలితే, కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. ఆరోగ్య మంత్రి ముఖేష్ మహాలింగ్‌తో కలిసి మాఝీ రాష్ట్ర ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన రోగులు, సిబ్బందికి సరైన చికిత్స అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 11 మంది వైద్య అధికారులు తమ ప్రాణాలను పణంగా పెట్టి రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నారని, వారు ఇప్పుడు ఆసుపత్రిలోని ఒక వార్డులో చికిత్స పొందుతున్నారని మాఝీ చెప్పారు.

**ఐసియు దట్టమైన పొగతో నిండింది**

విద్యుత్ సరఫరా రెండుసార్లు నిలిపవేశఆరని, ఆ తరువాత మంటలు చెలరేగగా, మొత్తం ఐసియు దట్టమైన పొగతో నిండిపోయిందని ఓ ప్రత్యక్ష సాక్షి చెప్పారు. తాను బుఅగ్నిమాపక దళ సిబ్బందికి ఫోన్ చేశానని, వారు దాదాపు 20 నిమిషాల తర్వాత వచ్చారన్నారు. ఇంతలో, రోగుల బంధువులు, సహాయకులు రోగులను రక్షించడానికి వైద్య సిబ్బందితో చేతులు కలిపినట్లు ప్రత్యక్ష సాక్షి చెప్పారు. మరో వ్యక్తి కిటికీ అద్దాన్ని పగలగొట్టి, మంటలను ఆర్పడానికి నీరు పోశానని చెప్పారు. తాను కొన్ని విద్యుత్ పరికరాలను ఆపివేసి విషమ పరిస్థితిలో ఉన్న ఏడుగురు రోగులను ఐసియు నుండి రక్షించానని చెప్పారు. గాయపడిన రోగులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించినట్లు ఆరోగ్య కార్యదర్శి స్వస్థ్య ఎస్ ఆసుపత్రి వద్ద విలేకరులకు తెలిపారు. గాయపడిన 13 మందిలో కనీసం ఐదుగురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు మరొక అధికారి పేర్కొన్నారు. అగ్నిప్రమాదంలో 10 మంది రోగులు మరణించినందుకు ఒడిశా గవర్నర్ హెచ్.బి. కంభంపాటి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

# కార్గిల్ బంద్, లఢాఖ్‌లో ర్యాలీ



**లేహ్ :** లఢాఖ్‌కు రాష్ట్ర హోదా, ఆరవ షెడ్యూల్ పొడిగింపు డిమాండ్లకు మద్దతుగా లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఎబి), కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కెడిఎ) పిలుపునివ్వడంతో సోమవారం కార్గిల్ బంద్ పాటించింది. లేహ్ పట్టణంలో జరిగిన ర్యాలీలో వందలాది పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో పటిష్టం బందోబస్తును ఏర్పాటు చేశారు. సెప్టెంబర్‌లో నిరసనల సమయంలో హింస చెలరేగిన విషయం తెలిసిందే. జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద దాదాపు ఆరు నెలల నిర్బంధం తర్వాత వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను కేంద్రం రెండు రోజుల క్రితం విడుదల చేసింది. ఆ తరువాత నిర్వహించిన తొలి ర్యాలీ ఇదే. లఢాఖ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ముఖేష్ సింగ్ లేహ్‌లోని సింగే నాంగ్యాల్ చౌక్ వద్ద ర్యాలీ స్థలాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. శాంతిభద్రతలను కాపాడటానికి పట్టణం అంతటా అదనపు పోలీసులు. భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎల్ఎబి సహ చైర్మన్ చెరింగ్ డోర్జాయ్ నేతృత్వంలో నిరసనకారులు సింగే నాంగ్యాల్ చౌక్ నుండి లేహ్ పోలో మైదానానికి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. రాష్ట్ర హోదా, ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్లకు మద్దతుగా నినాదాలు చేశారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో ఎల్ఎబి ప్రాయోజిత నిరసన ర్యాలీ హింసాత్మకంగా మారిన తర్వాత కాల్పుల్లో మరణించిన నలుగురి చిత్రాలను కూడా ర్యాలీలో కొందరు ప్రదర్శించారు. గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్ర హోదా, ఆరవ షెడ్యూల్ సమస్యలపై ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న రెండు గ్రూపులు ఎల్ఎబి, కెడిఎ ఇచ్చిన ఉమ్మడి పిలుపుకు ప్రతిస్పందనగా కార్గిల్, దాని ప్రక్కనే ఉన్న ద్రాస్ పూర్తి బంద్‌ను పాటించాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని అధికారులు తెలిపారు. లేహ్‌లో విలేకరులతో మాట్లాడుతూ రోడ్లను బారికేడ్ చేసి, పరిపాలన ఆంక్షలు విధించినా, ర్యాలీకి పెద్ద సంఖ్యలో తరలివచ్చినందుకు ప్రజలకు డోర్జాయ్ కృతజ్ఞతలు తెలిపారు. తీవ్రమైన రెచ్చగొట్టే చర్యలు ఉన్నప్పటికీ పూర్తి శాంతిని కాపాడుకున్నందుకు లద్ధాక్ ప్రజలను అభినందిస్తున్నా అని ఎల్ఎబి నాయకుడు అన్నారు. ర్యాలీని పెద్ద విజయంగా అభివర్ణించారు. అపెక్స్ బాడీకి ప్రజల మద్దతు లేదని చెప్పడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అయితే లఢాఖ్ ప్రజలు అపెక్స్ బాడీ, కెడిఎతో ప్రజలు అండగా నిలుస్తున్నారని నిరూపించారన్నారు. ఆందోళనల సమయంలో హింసను ప్రేరేపించారనే ఆరోపణలతో ఆందోళనకు ప్రముఖ నాయకుడు వాంగ్‌చుక్‌ను సెప్టెంబర్‌లో ఎన్ఎస్ఎ కింద అరెస్టు చేశారు.

# బిజెపికి సౌలభ్యంగా పోలింగ్ తేదీలు


### నాలుగు రాష్ట్రాలు, యుటిలో ఎన్నికల తేదీలపై కాంగ్రెస్ ఆగ్రహం



**న్యూఢిల్లీ:** ఎన్నికల కమిషన్ నాలుగు రాష్ట్రాలు, ఒక యుటిలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పోలింగ్ తేదీలు అధికార భారతీయ జనతా పార్టీ (బిజెపి) సౌలభ్యం ప్రకారం నిర్ణయించబడినట్లు అనిపిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ కూడా ఎన్నికల షెడ్యూల్‌పై స్పందించారు. కేరళలో ముందస్తు ఎన్నికలు తమను ఆశ్చర్యానికి గురి చేశాయన్నారు. అసోం, కేరళ, పుదుచ్చేరి (ఏప్రిల్ 9), తమిళనాడు (ఏప్రిల్ 23)లలో ఒకే రోజు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో రెండు దశల్లో ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీలలో పోలింగ్ నిర్వహించనున్నారు. 4 రాష్ట్రాల్లో, యుటిలోనూ ఓట్ల లెక్కింపు మే 4న జరుగుతుందని ఇసి ఆదివారం ప్రకటించింది. ఎన్నికల తేదీలపై ప్రియాంకాగాంధీని విలేకరులు ప్రశ్నించగా, ప్రకటించిన ఎన్నికల తేదీలు బిజెపి సౌలభ్యం ప్రకారం నిర్ణయించినట్లుగా కనిపిస్తోందన్నారు. ఇక పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో మాట్లాడిన థరూర్ ముందస్తు ఎన్నికలు మనందరినీ ఆశ్చర్యపరిచాయన్నారు. ఏప్రిల్ చివరి 10 రోజుల్లో ఓటింగ్ జరుగుతుందని అందరం ఆశించాము, కానీ 9న కేరళలో ఓటింగ్ పెట్టారన్నారు. అంటే పోలింగ్‌కు ఇంకా మూడు వారాలే మిగిలి ఉందన్నారు. పాలక సిపిఐ(ఎం) రానున్న ఎన్నికలలో అనేక మంది ప్రస్తుత ఎమ్మెల్యేలను పోటీలో నిలబెట్టినప్పటికీ, కాంగ్రెస్‌కు చాలా మంది కొత్త అభ్యర్థులు ఉన్నారని, ఓటర్లతో తమను తాము పరిచయం చేసుకోవడానికి వారికి ఎక్కువ సమయం అవసరమని థరూర్ అన్నారు.'ఇది మాకు పెద్ద సవాలు కానీ కష్టపడి పనిచేస్తున్నాము. ఆ సవాలును ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కేరళ ఎన్నికల కారణంగా పార్లమెంటు సమావేశాలకు చివరి రెండు వారాలు తాను హాజరు కాలేనని థరూర్ అన్నారు. ప్రచార సమయం చాలా తక్కువగా ఉందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ ఆదివారం అన్నారు.

# 4,335 భారతీయ విమానాలు రద్దు

### రాజ్యసభకు తెలిపిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు




**న్యూఢిల్లీ :** పశ్చిమ ఆసియాలో నెలకొన్న సంఘర్షణల నేపథ్యంలో, ఇప్పటివరకు భారతీయ విమానయాన సంస్థలు 4,335 విమానాలను, విదేశీ విమానయాన సంస్థలు 1,187 విమానాలను రద్దు చేశాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు సోమవారం రాజ్యసభకు తెలియజేశారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య తీవ్రమవుతున్న ఈ సంఘర్షణ కారణంగా, పశ్చిమ ఆసియా ప్రాంతంలో గగనతలం మూసివేయబడటంతో విమాన కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన ఒక అనుబంధ ప్రశ్నకు సమాధానమిస్తూ విమానయాన కార్యకలాపాల భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమని మంత్రి స్పష్టం చేశారు. 'పశ్చిమ ఆసియాలో గగనతలం మూసివేత కారణంగా జరిగిన విమానాల రద్దు విషయానికి వస్తే, ఇప్పటివరకు మొత్తంగా భారతీయ విమానయాన సంస్థలు 4,335 విమానాలను, విదేశీ సంస్థలు 1,187 విమానాలను రద్దు చేశాయి' అని నాయుడు తెలిపారు. ఈ సంక్షోభ సమయంలో కార్యకలాపాల భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమని పేర్కొంటూ, గగనతలమే మూసివేయబడినప్పుడు ఆ ప్రాంతంలో విమానాలను నడపాల్సిన అవసరం తమకు లేదని మంత్రి అన్నారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖత, డిజిసిఎ (పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్) ఆయా దేశాల నియంత్రణ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయని నాయుడు తెలిపారు. విమానాలను నడపడానికి తమకు ఎప్పుడు అవకాశం లభించినా, విమానాలను నడిపామన్నారు. ఈ సంక్షోభ సమయంలో కూడా దాదాపు 2,19,780 మంది ప్రయాణించార మంత్రి తెలిపారు. ప్రస్తుతం, కొన్ని ప్రాంతాల్లో గగనతలం ఇంకా మూసివేసే ఉందని, ప్రయాణికులకు సౌకర్యం కల్పించడానికి మా వంతు కృషి చేస్తున్నామన్నారు. అయితే అన్నింటికంటే ముఖ్యంగా, గగనతలం తెరుచుకోవాలని, ప్రయాణించడానికి అది సురక్షితంగా ఉండాలన్నారు. అప్పుడే సాధారణ విమాన ప్రయాణాలు తిరిగి ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు.

# లోక్‌సభలో సజావుగా సాగిన ప్రశ్నోత్తరాలు

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండవ సెషన్‌లో మొట్టమొదటిసారి సోమవారం ఎలాంటి ఆటంకం లేకుండా ప్రశ్నోత్తరాలు చేపట్టారు. సభ సమావేశమైన వెంటనే కొంతమంది ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళనలను వెంటనే లేవనెత్తాలని డిమాండ్ చేశారు. అయితే, మధ్యాహ్నం 12 గంటలకు ప్రశ్నోత్తరాల సమయం తర్వాత మాట్లాడటానికి అనుమతిస్తామని స్పీకర్ ఓం బిర్లా చెప్పారు. ఎల్‌పిజి పరిస్థితికి దారితీసిన పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు ప్రతిపక్షాలు డిమాండ్ చేయడంతో లోక్‌సభలో నినాదాలు చేయడంతో పదేపదే అంతరాయం ఏర్పడింది. ఈనెల 9న ప్రారంభమైన బడ్జెట్ సమావేశాల రెండవ దశ మొదటి వారంలో, ప్రతిపక్షాల నిరసనల కారణంగా సభ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల మధ్య ప్రశ్నోత్తరాల సమయాన్ని పూర్తి చేయలేకపోయింది. స్పీకర్ బిర్లాను తొలగించాలని కోరుతూ ప్రతిపక్ష తీర్మానాన్ని 10న చేపట్టి రెండు రోజుల చర్చ తర్వాత సభ తిరస్కరించింది. బిర్లా పాలకపక్షం పట్ల పక్షపాతంతో వ్యవహరించారని, ప్రతిపక్షాల ఆందోళనలను విస్మరించారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. కాగా, కొంతమంది ఎంపిలు సభలో బ్యానర్లు, ప్లకార్డులు, పోస్టర్లు ప్రదర్శించడం, కొన్ని భాషలను ఉపయోగించడంపై బిర్లా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ సభ్యులలో క్రమశిక్షణ, ఉన్నత నైతిక ప్రవర్తనను నిర్ధారించాలని ఆయన కోరారు. లోక్‌సభలో సభ్యులుగా ఉన్న అన్ని రాజకీయ పార్టీల నాయకులకు బిర్లా లేఖలు రాశారు. సభ ఎల్లప్పుడూ గౌరవప్రదమైన చర్చలు, సంభాషణల అద్భుతమైన సంప్రదాయాన్ని కలిగి ఉందని, అయితే కొంతకాలంగా, దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య గౌరవం, ప్రతిష్టను చాంబర్ లోపల, వెలుపల, పార్లమెంటు కాంప్లెక్స్ లోపల కొంతమంది సభ్యులు దెబ్బతీస్తున్నారని అన్నారు.

# 'పొట్టి' త్యాగ స్ఫూర్తితో నవ్యాంధ్ర నిర్మాణం

### విగ్రహావిష్కరణలో ఎపి సిఎం చంద్రబాబు



**అమరావతి:** తెలుగువారి ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరమని, ఆయన స్ఫూర్తితోనే నవ్యాంధ్ర రాజధాని అమరావతిని నిర్మిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సోమవారం అమరావతిలోని శాఖమూరు పార్కులో ఏర్పాటు చేసిన 58 అడుగుల పొట్టి శ్రీరాములు భారీ విగ్రహాన్ని (స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్) ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, నారాయణ తదితరులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపాలా శాఖ రూపొందించిన ప్రత్యేక పోస్టల్ కవర్‌ను విడుదల చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములును కేవలం ఒక వర్గానికి చెందిన వ్యక్తిగా చూడకూడదని, ఆయన అందరివాడని కొనియాడారు. పొట్టి శ్రీరాములు 58 రోజుల నిరాహార దీక్షతో రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేశారని, అందుకే ఆయన దీక్షకు చిహ్నంగా 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేశామని సిఎం తెలిపారు. అమెరికాలో స్టాట్యూ ఆఫ్ లిబర్టీ, గుజరాత్‌లో స్టాట్యూ ఆఫ్ యూనిటీ తరహాలో ఎపిలో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' నిలిచిపోతుందన్నారు. గాంధీజీ అహింసా మార్గంలో స్వాతంత్ర్యం తెస్తే... శ్రీరాములు ఆత్మార్పణతో తెలుగు రాష్ట్రం సాధించారని, ఆయన త్యాగం వల్లే దేశం లో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పునాది పడిందని గుర్తుచేశారు. అమరావతి అభివద్ధిపై మాట్లాడుతూ గత ప్రభుత్వంపై సిఎం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 2019–24 మధ్య రాజధానిని 'మూడు ముక్కలాట'గా మార్చి... చివరకు రాజధాని లేని పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు. అమరావతిని శ్మశానం, ఎడారి అని అవహేళన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టి శ్రీరాములు త్యా గం మాదిరగా రాజధాని కోసం భూములిచ్చిన రై తుల పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని, వారి త్యాగాన్ని ఈ ప్రభుత్వం గౌరవిస్తుందని తెలిపారు. రాబోయే మూడేళ్లలో అమరావతిని దేశం గర్వించేలా అభివద్ధి చేస్తామని, రాజధాని రాష్ట్ర ఆర్థిక వద్ధికి కేంద్ర బిందువు అవుతుందని స్పష్టం చేశా రు. ఆర్యవైశ్య సామాజిక వర్గం పట్ల ప్రభుత్వం చూపిస్తున్న గౌరవాన్ని సిఎం వివరించారు. ఇంటింటికీ నీళ్లిచ్చే 'జల్ జీవన్ మిషన్'కు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో'అమరజీవి జలధార'గా నామకరణం చేశామని తెలిపారు.

**అమరజీవికి 'జలధార' నివాళి: పవన్**

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని అందించే 'జల్ జీవన్ మిషన్' పథకానికి 'అమరజీవి జలధార' అని నామకరణం చేయడం ద్వారా ఆయన కీర్తి ప్రతి ఇంటిలోనూ నిలిచిపోతుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో తెలుగు ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను, వారి ఆత్మగౌరవ కాంక్షను గుర్తించిన ఏకైక వ్యక్తి పొట్టి శ్రీరాములు అని పవన్ కొనియాడారు. తెలుగువారి హక్కుల కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు.

# కొలంబియా లెఫ్ట్ పోరాటం

దక్షిణ అమెరికాను తమ పెరడుగా పరిగణించే మన్రో సిద్ధాంతం ప్రకారం అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వామపక్ష ప్రభుత్వాలను అదిరింపులు, బెదిరింపులతో కూలదోస్తున్న నేపథ్యంలో ఆయన దారికి బలమైన అడ్డంకిగా కొనసాగుతున్నది కొలంబియా ప్రభుత్వం. తాను ప్రతిపాదించిన మితవాదిని అధ్యక్షునిగా ఎన్నుకోకపోతే అమెరికా సహాయం నిలిపివేస్తామని ట్రంప్ ఆయా దేశాల్లో ఎన్నికల సమయంలో ఓటర్లను బెదిరిస్తున్నాడు. ప్రజాస్వామిక పద్ధతుల్లో వెనిజులాలో ప్రభుత్వం మార్పు సాధించలేని ట్రంప్ మహాశయుడు బందిపోటు చర్యకు పాల్పడి ఆ దేశ అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను బందీలుగా అమెరికా తరలించుకువెళ్లాడు. వారిపై మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరారోపణతో కేసు బనాయించాడు. ఇప్పుడు కొలంబియా వంతు వచ్చింది. మే 31న జరిగే అధ్యక్ష ఎన్నికల్లో కొలంబియా ఓటర్లు తమ వామపక్ష సాంప్రదాయాన్ని నిలబెట్టుకుంటారా, లేక ట్రంప్ బెదిరింపులకు లొంగుబాటు చూపుతారా చూడాల్సి ఉంది. అయితే మార్చి 8న జాతీయ ఎన్నికల్లో అధ్యక్షుడు గుస్తావో పెట్రో నాయకత్వంలోని పాలక వామపక్ష కూటమి గణనీయమైన విజయాలు సాధించింది. ఇరాన్‌పై ట్రంప్ సాగిస్తున్న యుద్ధం, ట్రంప్–కొలంబియా అధ్యక్షుని మధ్య సాగుతున్న మాటల యుద్ధం నేపథ్యంలో కొలంబియాలో వామపక్షం విజయాలకు కొలంబియాలోనేగాక స్థూలంగా లాటిన్ అమెరికాకు ప్రాధాన్యం ఉంది. అధ్యక్షుడు గుస్తావో నిర్మించిన లెఫ్ట్ కూటమి పేరు హిస్టారిక్ పాక్ట్ (హెచ్‌పి). సెనేట్ ఎన్నికల్లో ఆ పార్టీకి 22.8శాతం ఓట్లు లభించగా, మితవాద డెమొక్రటిక్ సెంటర్ (డిసి)కు 15.6 శాతం ఓట్లు పోలైనాయి. అయితే డెమొక్రటిక్ ప్రైమరీల్లో మితవాద డిసి అభ్యర్థి పలోమా వాలెన్సియా గెలుస్తున్నారు. లెఫ్ట్ అభ్యర్థి పోటీ చేయలేదు. మార్చి 31న జరిగే తొలిరౌండ్ పోలింగ్‌లో అతడు పాల్గొంటాడు. రాజ్యాంగం ప్రకారం పెట్రోకు పోటీచేసే అర్హత లేదు.

జాతీయ అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల పోల్ చాలా తక్కువగా – 48 శాతమే ఉంది. 2022 ఎన్నికల్లోని 46.4శాతం కన్నా స్వల్పమైన మెరుగుదలను గమనించవచ్చు. మార్చి 8 ఎన్నికలపై ట్రంప్ ముద్ర స్పష్టంగా ఉంది. వెనిజులా తదుపరి ప్రభుత్వాల మార్పుకు ట్రంప్ తదుపరి లక్ష్యం క్యూబా, కొలంబియా అని ట్రంప్ అనుకూల పార్టీలు ప్రచారం చేశాయి. ఈ ఉద్రిక్తత మధ్య పెట్రో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తామని ప్రచారం చేశారు. లాటిన్ అమెరికా వ్యవహారాల్లో అమెరికా జోక్యానికి వ్యతిరేకంగా తమ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికోసం ఈ ప్రాంతం దేశాలు పోరాడాల్సిన అవసరాన్ని కూడా ఆయన నొక్కి చెప్పారు.

పెట్రో పదవీకాలం రాజ్యాంగరీత్యా ఒక టరంకే పరిమితమైనందున సెనేటర్ ఇవాన్ సెపెడా అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ టిక్కెట్‌పై పోటీ చేస్తారు. ఆయనకు మంచి పేరున్నా, పెట్రోలాగా లెఫ్ట్‌యేతర ఓట్లు రాబట్టగలడా అన్నది సందేహం. తొలి రౌండ్‌లో ఆయనకు అధిక ఓటు లభించినా, రెండవ రౌండ్ పోలింగ్‌కు మితవాదులు ఏకమైతే లెఫ్ట్‌కు ఇబ్బందులు ఎదురు కావచ్చు.

పెట్రో అధ్యక్షుడిగా ఎన్నుకోబడిన 2022 ఎన్నికల తదుపరి ఏర్పాటైన ప్రస్తుత సెనేట్‌లో లెఫ్ట్ వ్యతిరేక కూటమి అభ్యర్థులు మెజారిటీగా ఉన్నారు. వారు గత నాలుగేళ్లలో అధ్యక్షుడు ప్రవేశపెట్టిన అనేక ప్రతిపాదనలు వ్యతిరేకించారు. కొత్త సెనేట్‌లో వామపక్ష అభ్యర్థుల సంఖ్య పెరుగుతుంది. అయినా మితవాదుల సంఖ్యను మించకపోవచ్చు. అందువల్ల కొలంబియాలో ప్రజానుకూల కార్యక్రమాలు కొనసాగించాలంటే వామపక్ష అధ్యక్ష అభ్యర్థి ఇవాన్ సెపెడా గెలుపొందటం అవసరం.

అధ్యక్షుడు గుస్తావో పెట్రో చైనా, రష్యాలతో సంబంధాలు మెరుగుపరుచుకున్నారు. చేతులకు గొలుసులు బిగించి అక్రమ వలసదారులను ట్రంప్ వెనక్కు తరలించిన తొలిదశలో కొలంబియా ఆయన దాడికి లక్ష్యంగా ఉండింది. అయినా పెట్రో ఆయనతో సాధారణ సంబంధాలకోసం ప్రయత్నించాడు.

కొలంబియాకు మారుపేరు "దక్షిణ అమెరికాకు ముఖద్వారం". ఎందుకంటే మధ్య, ఉత్తర అమెరికాతో దక్షిణ అమెరికాను కలిపే అమెరికా ఖండం వాయవ్య భాగంగా కొలంబియా ఉంది. అది లాటిన్ అమెరికాలో ఐదవ పెద్ద దేశం; ప్రపంచంలో స్పానిష్ భాష మాట్లాడే అత్యధిక జనాభా ఉన్న దేశాల్లో దానికి రెండవ స్థానం. కొలంబియాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అమెరికా సంయుక్త రాష్ట్రాలు (యుఎస్ఎ). మాదక ద్రవ్యాల నిర్మూలనకు అమెరికాతో కలిసి ప్లాన్ కొలంబియాను అది అమలు చేస్తున్నది. వెనిజులాలాగే కొలంబియా అధ్యక్షునిపై కూడా ట్రంప్ ప్రధాన ఆరోపణ డ్రగ్స్ అక్రమ రవాణా. ఈ ఆరోపణను పెట్రో తిరస్కరిస్తున్నాడు. హెచ్‌పి కూటమి భాగస్వాములందరికీ – కొలంబియన్ కమ్యూనిస్టు పార్టీ సహా – పెట్రో నాయకత్వంలో విశ్వాసం ఉండటం విశేషం. అనేక లాటిన్ అమెరికా దేశాల్లో ముఠా కుమ్ములాటలు వామపక్షానికి చేటుచేశాయి. మే 31న అధ్యక్ష ఎన్నికల్లో తమ అభ్యర్థి విజయం పట్ల కొలంబియా లెఫ్ట్ ఆశలకు ఈ ఐక్యతే భరోసా.



## సంక్షోభానికి బాధ్యత వహించాలి

ప్రజలకు తగినంత గ్యాస్ సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. ప్రస్తుత గ్యాస్ సంక్షోభానికి ప్రధాని మోదీ బాధ్యత వహించాలి. బెంగాల్ ప్రజల హక్కులు, గౌరవం కోసం ఐక్య సమీకరణగా నిరసన ర్యాలీ నిర్వహించాం. ఎల్‌పిజి సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వమే కారణం. పశ్చిమ ఆసియాలో సంఘర్షణ కారణంగా ఇంధన అంతరాయాల మధ్య ఆంక్షలు విధించే ముందు వంట గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తుల నిల్వల అంశంలో కేంద్రం విఫలమైంది.

– తపశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ



# వేసవి సెలవులు నైపుణ్య శిక్షణకు వేదికలు కావాలి

పది మాసాల పాఠశాల లేదా కళాశాల విద్యా సంవత్సరం పూర్తి కావడం, ఆ తర్వాత పరీక్షలు కూడా పూర్తి అయిన తర్వాత మానసిక ఉల్లాసానికి ఆతిథ్యం ఇచ్చే వేసవి సెలవుల రాక కోసం విద్యార్థిలోకం ఎంతగానో ఎదురుచూడడం జరుగుతుంది. ఏడాదిలో ఒక్కసారి లభించే రెండు మాసాల వేసవి సెలవులు యువతకు ఎన్నో రకాల అనుభవాలను మూటకట్టి పెడతాయి.

**వినోద, విరామ, పునరుత్తేజ కార్యక్రమాలు:** అవసరం మేరకు నిద్ర పోవడం, మెదడు చురుదనం పెంచడానికి కార్యక్రమాలు, మనసుకు నచ్చిన కార్యక్రమాలు చేస్తూ మానసిక ఒత్తిడిని తగ్గించే అంశాలకు సమయం ఇవ్వడం వేసవి సెలవుల్లో మాత్రమే జరుగుతుంది. తమకు నచ్చిన అంశాలకు చెందిన పుస్తకాలు చదవడం, విజ్ఞాన వినోదాత్మక సినిమాలు చూడడం, సుస్వర సంగీతం వినడం, ఆటపాటల్లో మునిగి తేలడం, కుటుంబ సభ్యులు లేదా మిత్రులతో కలిసి బయటకు వెళ్లడం లాంటివి మానసిక వికాసానికి, మనసును తేలిక పర్చుకోవడానికి ఉపకరిస్తాయి. మన ప్రేమను చూరగొన్న సమీప బంధువులు లేదా మిత్రుల వద్దకు వెళ్లడం, పిక్నిక్/జూ/సర్కస్/ఎగ్జిబిషన్‌లకు వెళ్లడం, మనకు నచ్చిన క్రీడలు లేదా కళల్లో శిక్షణ తీసుకోవడం, వ్యక్తిత్వ వికాస ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ తరగతులకు హాజరుకావడం లాంటివి మంచి నిర్ణయాలు అవుతాయి.

**ఆధునిక డిజిటల్ కాలపు నైపుణ్య వికాస కార్యక్రమాలు:** నేటి ఆధునిక డిజిటల్ యుగంలో పుట్టుకొస్తున్న శాస్త్రసాంకేతిక ప్రగతి ఫలాలను ఆస్వాదించడం లేదా నూతన నైపుణ్యాలను అవపోసన పట్టడం, సంగీతం/నాట్యం/పెయింటింగ్ నేర్చుకోవడం, సంగీత వాయిద్యాల్లో శిక్షణలు, కవిత్వం/వ్యాస రచన/కథలు రాయడంతో సాహిత్య రంగంలో తొలి అక్షర అడుగులు వేయడానికి వేసవి సెలవులు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆసక్తి కలిగిన వారు కొత్త భాషను నేర్చుకోవడం, డిజిటల్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా నైపుణ్యాలకు పదును పెట్టడం, జనరల్ నాలెడ్జి పెంచుకోవడం, దిన పత్రికలను చదవడం, పాఠ్యాంశాలకు సంబంధించిన అదనపు పరిజ్ఞానాలను పొందడం, మానసిక పరిపక్వతకు ఆజ్యంపోసే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరు కావడం లాంటివి పిల్లలకు అందుబాటులో ఉంచాలి.


**ఆరోగ్య పరిరక్షణ – నవ్య జీవనశైలి కార్యక్రమాలు:** నేటి ఆరోగ్యమే రేపటి భవితకు పెట్టుబడి అని, ఆరోగ్యమే మహాభాగ్యం అని నమ్ముతూ వేసవి సెలవుల్లో ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలి. తగినంత సమయం నిద్ర పోవడం, సమయానికి ఆహారం తీసుకోవడం, పరిమిత సమయం పాటు ఆటపాటలకు కేటాయించడం, ప్రతిరోజు కొంత సమయం వ్యాయామం/యోగా/వాకింగ్/స్విమ్మింగ్/ట్రెక్కింగ్/మౌంటెనీరింగ్ చేయడం, సూర్యోదయాన్ని చూసి ఆనందించడం మరువరాదు.

**చేయగూడని కార్యక్రమాలు – తల్లిదండ్రుల పాత్ర:** వేసవి సెలవుల రూపంలో లభించిన రెండు మాసాల్లో పిల్లల దురలవాట్లు లేదా అనారోగ్యకర దినచర్యలకు అలవాటు పడకుండా చూసుకోవడం పెద్దల కనీస కర్తవ్యం అని తెలుసుకోవాలి. స్మార్ట్‌ఫోన్ అతిగా వాడడం లేదా టివీ ముందు కూర్చోవడం మంచి అలవాటు కాదని వారించడం మరువరాదు. ఆన్‌లైన్ గేమ్స్‌కు బదులుగా అవుట్/ఇండోర్ డోర్ గేమ్స్ ఆడడం ఉత్తమమని నమ్మాలి. ఎండలను గమనిస్తూ వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవి సెలవుల్లో పిల్లల వ్యక్తిత్వ వికాసం జరిగే విధంగా, విజ్ఞాన వంతులుగా మారడానికి తల్లిదండ్రులు పటిష్ట ప్రణాళికలు వేసి వాటిని పక్కాగా అమలు చేయాలి. సెలవుల కాలం సకల నైపుణ్యాలను వడ్డించే నెలవుగా మారాలని కోరుకుందాం.

# ఆర్‌టిసిలో ఆగమాగం... సమ్మె తప్పదా!

* రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ ఒక్క నియామకం కూడా చేపట్టని ఆర్‌టిసి యాజమాన్యం
* 2014లో ఉద్యోగుల సంఖ్య 57 వేలు .. ప్రస్తుతం 39 వేలు
* తీవ్ర పనిభారంతో అనారోగ్యం బారిన కార్మికులు
* పెండింగ్ బకాయిల చెల్లింపు లేదు... వేతన సవరణ ఊసేలేదు
* రెండేళ్లు దాటినా విలీనం కాలేదు... ట్రేడ్ యూనియన్లు నిర్వీర్యం?
* అరకొరగా 'మహాలక్ష్మి' నిధులు... ఎలక్ట్రిక్ బస్సులతో కార్మికుల్లో ఆందోళన
* సమస్యల పరిష్కారానికి టిజిఎస్ ఆర్‌టిసి ఉద్యోగుల సమ్మె సైరన్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్‌టిసి) లో ఒక్క శాశ్వత నియామకం జరపలేదు. ఫలితంగా కార్మికుల సంఖ్య నిత్యం తగ్గుతుంది. పని భారం పెరుగుతున్నది. ఉద్యోగులు అనారోగ్యం పాలవుతున్నారు. వేతన సవరణ లేదు. పెండింగ్ బకాయిల ఊసే లేదు. అలవెన్సులు పాతవే కొనసాగుతున్నాయి. ఫలితంగా కార్మికులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడంలేదు. కార్మికులు కష్టపడుతున్నా సంస్థ మనుగడ ప్రశార్థకంగానే మారుతున్నది. ప్రభుత్వంలో ఆర్‌టిసిని విలీనం చేయాలని తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు దాటినా అమలు కాలేదు. 'మహాలక్ష్మి' పేరుతో బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని ఘనంగా ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం అందుకు తగిన ఘనమైన నిధులను మాత్రం ఆర్‌టిసికి ఇవ్వడం లేదు. దీంతో ఆర్థికంగా ఆర్‌టిసి కుదేలవుతున్నది. ఇవన్నీ చాలదన్నట్లు ఎలక్ట్రిక్ బస్సులను తెచ్చి కార్మికుల ఉద్యోగ భద్రతకు షాక్ ఇస్తున్నది. చివరకు సర్వీసులో ఉండగా మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఇచ్చే కారుణ్య నియామకాల విషయంలో కూడా కారుణ్యం చూపకుండా తాత్కాలిక ప్రాతిపదికన నియమిస్తున్న హృదయ విదారక పరిస్థితి ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆర్‌టిసి మనుగడ ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమౌతున్నది. ఈ సమస్యలన్నీ చెప్పుకుందామంటే సంస్థలో ట్రేడ్ యూనియన్ల పునరుద్ధరణను పట్టించుకోవడంలేదు. ఇక చేసేదేమీ లేక తాజాగా కార్మిక సంఘాల జెఎసి సమ్మె సైరన్ మోగించింది. ఆర్‌టిసి కార్మికుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఆర్‌టిసి యాజమాన్యానికి, ప్రభుత్వానికి ఎన్ని విజ్ఞాపన లు చేసినా స్పందన లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో సమ్మె నోటీస్ ఇవ్వాల్సి వచ్చిదని ఆర్‌టిసి జెఎసి నాయకులు ప్రకటించారు. ప్రభుత్వం ఇకనైనా తమ డిమాండ్ల ను పరిష్కరించకుంటే 14 రోజుల తర్వాత సమ్మె తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు.



**తగ్గిన కార్మికులు!**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన 2014 నుంచి నేటివరకు టిజిఎస్‌ఆర్‌టిసిలో ఒక్క నియామకం కూడా జరగలేదు. 2014లో 57 వేలుగా ఉన్న ఉద్యోగుల సంఖ్య, ప్రస్తుతం 39 వేల మందికి చేరుకుంది. సుమారు 18 వేల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉన్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఎంటివిఎ ప్రకారం ఉద్యోగి ప్రతిరోజు 8 గంటలు పనిచేయాలని నిబంధన ఉన్నా, ఆర్‌టిసి ఉద్యోగులు మాత్రం సుమారు 16 నుంచి 18 గంటలు పనిచేస్తున్నారు. ఇలా అదనపు పనిభారంతో చాలా మంది డ్రైవర్లు, కండక్టర్లు తీవ్ర అనారోగ్యాల బారిన పడటంతో పాటు అకాల మరణం చెందుతున్నారు.

**ఆర్‌టిసి విలీన ప్రక్రియ ఏమైంది?**

ఆర్‌టిసి ఉద్యోగుల చిరకాల కోరిక అయిన ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం ప్రక్రియ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ 2023 సెప్టెంబర్‌లో ప్రారంభించారు. కానీ డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీ ఓటమితో ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడంతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో సైతం పొందుపరిచారు. ఆయన ముఖ్యమంత్రి అయి రెండున్నర సంవత్సరాలు గడిచినా విలీన ప్రక్రియ నేటి వరకు మొదలు కాలేదు.

**ట్రేడ్ యూనియన్ల నిర్వీర్యం?**

2019 నుండి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్‌టిసిలో ట్రేడ్ యూనియన్లను నిర్వీర్యం చేసింది. దానివల్ల ఆర్‌టిసి కార్మికులపై యాజమాన్యం వేధింపులు ఎక్కువయ్యాయి. అధికారులు పనిభారాలను పెంచి కార్మికుల నడ్డి విరుస్తున్నారు.

ఆర్‌టిసిలో ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించి చట్ట ప్రకారం నిర్వహించాల్సిన ఎన్నికలు జరపాలి. రాష్ట్ర హైకోర్టు 2023 ఏప్రిల్‌లో ఎన్నికలు జరపాలని ఆర్డర్ ఇచ్చింది. కానీ, రిటర్నింగ్ ఆఫీసర్ మూడు సార్లు మీటింగ్ పెట్టినా, ఆర్‌టిసి యాజమాన్యం గైర్హాజరైంది. దీంతో ఎన్నికలు నిలిచిపోయాయి. ఈ అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉంది.

**వేతన సవరణ ఏదీ?**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2017 వేతన సవరణ ఇచ్చారు కానీ ఆ వేతన సవరణకు సంబంధించిన ఎరియర్స్ నేటివరకు చెల్లింపు కాలేదు. ఆ వేతన సవరణలో జరగాల్సిన అలవెన్స్‌లు, ఫ్రింజ్ బెనిఫిట్స్ పెంచలేదు. పాత అలవెన్స్‌లే ఇవ్వడం వల్ల ఆర్‌టిసి కార్మికులకు ఆర్థిక నష్టం జరుగుతుంది. 2017లో రిటైరైన కార్మికులకు ఫిక్సేషన్లు జరిగినా, నేటి వరకు వారికి సెటిల్‌మెంట్స్ చేయలేదు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో ఆర్‌టిసి కార్మికులకు అందజేయాలి. దీంతో పాటు 2025 వేతన సవరణ చేపట్టాల్సి ఉంది.

**'బ్రెడ్ విన్నర్ స్కీమ్' శాశ్వత నియామకాలేవి?**

విధినిర్వహణలో ఆర్‌టిసి ఉద్యోగి చనిపోతే బ్రెడ్ విన్నర్ స్కీమ్ కింద ఆ కుటుంబంలో అర్హులైన ఒకరికి రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగం ఇస్తారు. ప్రభుత్వంలోను, సింగరేణి కాలరీస్‌లోను ఇలాంటి నియామకాలే జరుగుతున్నాయి. కానీ ఆర్‌టిసిలో ఇచ్చే ఉద్యోగం రెగ్యులర్ ప్రాతిపదికన కాకుండా, కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన కారుణ్య నియామకాలు చేపడుతున్నారు. సింగరేణి, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఆర్‌టిసిలో బ్రెడ్ విన్నర్ స్కీమ్ కింద చేసే నియామకాలు రెగ్యులర్ ప్రాతిపదికన ఉండాలని జెఎసి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

**'మహాలక్ష్మి' నిధులేవి?**

మహాలక్ష్మి పథకాన్ని ఆర్‌టిసి కార్మికులు చాలా విజయవంతం చేశారు. ఈ పథకంలో ప్రయాణీకులు డ్రైవర్, కండక్టర్లపై దాడులు చేస్తున్నా, ఫిర్యాదులు చేస్తున్నా అంకిత భావంతో పనిచేస్తున్నారని చెప్పవచ్చు. అయినా ఈ స్కీమ్‌లో అక్రమాలు జరిగాయని కార్మికులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి నెల ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.360 కోట్లను మొత్తం ఒకే దఫా చెల్లించకుండా, వాయిదా పద్ధతుల్లో చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు ఈ పథకం కింద రూ.2800కోట్లు ప్రభుత్వం నుంచి ఆర్‌టిసికి రావాల్సి ఉంది.

**ఎలక్ట్రిక్ బస్సులతో కార్మికుల్లో ఆందోళన**

ఆర్‌టిసిలో నిత్యం ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరుగుతోంది. దాని వల్ల చాపకింద నీరులా ప్రైవేటీకరణకు దారితీస్తోంది. ఇప్పటికే 850 ఎలక్ట్రిక్ బస్సులు ఆర్‌టిసిలో చేరాయి. మరో 3,850 ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ఆర్‌టిసికి ఇస్తుందని ముఖ్యమంత్రి చెబుతున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు డిపోలకు రావడం వల్ల సిబ్బందిని ఇతర డిపోలకు బదిలీ చేస్తున్నారు. ఎలక్ట్రిక్ బస్సులను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్‌టిసికి సరఫరా చేయాలి. దాని వల్ల ఆ బస్సులు ఆర్‌టిసికే చెందుతాయి. ఎలక్ట్రిక్ బస్సులు లాభదాయకం కాకపోగా నష్టాలు తెస్తున్నాయని ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు.

– వాసు, ప్రజాపక్షం,
హైదరాబాద్

# డిండి ఎత్తిపోతలకు అడుగడుగునా అడ్డంకులే!

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఫ్లోరైడ్ పీడిత ప్రాంతమైన నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు, నల్లగొండ నియోజకవర్గాలలోని కరువు పీడిత గ్రామాలకు త్రాగు, సాగుకు కృష్ణా జలాలు అందించాలని ఆ జిల్లా ప్రజల సుదీర్ఘకాల పోరాటాల ఫలితంగా డిండి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టుటకు వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం సర్వే చేయించి తేది:7–7–2007న జిఓ నెం. 159 ను 3.5 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు త్రాగు నీటిని అందించవచ్చని, ఈ ప్రాజెక్టుకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని నిపుణుల కమిటీ నివేదికను ఆమోదించారు. ఆనాడు శ్రీశైలం ఎడమగట్టు సొరంగంలో అంతర్భాగంగా చేపట్టాలని నిర్ణయించినప్పటికీ.. వివిధ కారణాలచే పనులు పూర్తిగా కాక పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది. 2014లో అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఇది ఎక్కువ ఖర్చుతో కూడుకున్నదని ఫీజిబులిటీ లేదని నిర్ణయానికి వచ్చి.. ఈ పథకాన్ని పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల్లో భాగంగా చేర్చడం జరిగింది.

శ్రీశైలం జలాశయం నుంచి వరద జలాల నుండి రోజుకు 2 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 120 టిఎంసిలు ( పాలమూరు రంగారెడ్డికి 90 టిఎంసిలు, డిండి ఎత్తిపోతలకు+ 30 టిఎంసిలు) తరలించడానికి జిఓ నెం.105 తేదీ 10–6–2015న రూ. 35,200 కోట్ల తో శాంక్షన్ ఇస్తూ 11–6–2015 న కెసిఆర్ శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రోజుకు 0.50 టిఎంసిలు చొప్పున 60 రోజుల్లో 30 టిఎంసిలు డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు తరలించి 3 లక్షల ఎకరాలకు నీరు అందిస్తామని 2015 ఆగస్టులో ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్ శివన్న గూడెం దగ్గర చర్లగూడెం రిజర్వాయర్(మరిగూడెం మండలం)కు శంకుస్థాపన చేశారు. డిండి లిఫ్ట్ స్కీంకు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల నుండి నీరు తరలించటాన్ని పాలమూరు ప్రజలు కొంత వ్యతిరేకత తెలుపుతూనే ఉన్నారు. దీంతో గత ప్రభుత్వం ఈ స్కీము పనులు వేగంగా జరపకుండా కాలయాపన చేస్తూ వచ్చింది. కానీ ఈ ప్రాజెక్టుకు ఎక్కడి నుంచి నీరు తరలించాలనే అంశంపైన గత బిఆర్ ఎస్ ప్రభుత్వం డిపిఆర్ తయారు చేయకుండా పెండింగ్‌లో పెడుతూ వచ్చింది. నల్లగొండ జిల్లాలో చేపట్టే రిజర్వాయర్లలో భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం ఇవ్వటంలోను, పనులలో కొంత కాలయాపన జరుగుతూ వస్తుంది.

**ఏదుల నుంచి డిండికి నీరు :**

శ్రీశైలం నుంచి వరద జలాల నుండి రోజుకు 2 టిఎంసిల చొప్పున 60 రోజుల్లో 120 టిఎంసిల నీటి ఎత్తిపోతలో భాగంగానే డిండి పథకానికి రోజుకు 0.5 టిఎంసిల చొప్పున నాగర్ కర్నూల్, నల్లగొండ జిల్లాలోని 3.41 లక్షల ఎకరాల ఆయకట్టుకు నిరంధించే పనులు రూ.1800 కోట్లతో చేపట్టుటకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. శ్రీశైలం నుంచి నీటిని తీసుకొని ప్రస్తుతం ఉన్న డిండి రిజర్వాయర్‌కు మళ్ళించి అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా ఆయకట్టుకు నీరందించటం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. రిజర్వాయర్లు, కాలువల పనులు నడుస్తున్నాయి. దీనిపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, ఉద్యమకారులు వ్యతిరేకత తెలుపుతున్న నేపథ్యంలో.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఆపకుండా వాటికి ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని ప్రభుత్వం జిల్లా ప్రజలకు తెలిపింది. ఇందులో భాగంగా పాలమూరు రంగారెడ్డి వైపు ఏదుల, వట్టెం, నార్లాపూర్ రిజర్వాయర్ల నిర్మాణ పనులు పూర్తి చేశారు. నల్లగొండ జిల్లాలో 11 రిజర్వాయర్లను చేపట్టగా కిష్టరాంపల్లి, చింతపల్లి రిజర్వాయర్లు మినహా మిగతావన్నీ పూర్తయ్యాయి. భూ సేకరణ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వల్ల నాగర్ కర్నూల్ జిల్లాలోని ఎర్రబెల్లిగోకారం, రంగారెడ్డి జిల్లాలోని ఇర్విన్ రిజర్వాయర్, నల్లగొండజిల్లాలో ప్రధాన కాలువల పనులు పెండింగ్‌లో ఉన్నాయి.



**ఇప్పుడు వివాదం రేపిన ఈ ఎన్ సి సర్క్యులర్ :**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జిల్లా ప్రజా ప్రతినిధిల ఒత్తిడి మేరకు.. ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి ఆయా జిల్లాల ప్రతినిధులతో చర్చలు జరిపి ఒప్పించి టెండర్లు, అగ్రిమెంట్లను పూర్తి చేయించారు. పాలమూరు కింద చేపడుతున్న ఏదుల రిజర్వాయర్ లో 336 మీ నీటి మట్టం నుంచి డిండి లిఫ్ట్ స్కీంకు నీటిని తరలించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది, గత ఏడాది జనవరి 22న నీటిపారుదల శాఖ జీవో 10 జారీ చేసింది. ఆ ప్రకారం కాలువల పనులు నడుస్తున్నాయి. కానీ ఇటీవల రిటైర్డ్ అయిన ఒఇఎన్‌సి గతంలో ఇచ్చిన సర్కులర్ కొత్త వివాదానికి తెరలేపింది.

ఏదుల రిజర్వాయర్లో నీటి మట్టం కనీసం 440 మీటర్లు ఉన్నప్పుడే డిండి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు నీటిని తరలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నీటిపారుల శాఖ సిఫారసు చేసింది.

ఫిబ్రవరి 6న నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) నేతృత్వంలోని కమిటీ డిండి ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

ఏదుల రిజర్వాయర్లో కనీసం 437.375 మీటర్ల నీటిమట్టం ఉంటేనే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా వీరాంజనేయ బ్యాలెన్స్ రిజర్వాయర్‌కు నీటిని తరలించాలని గతంలో అనుమతులు ఇచ్చారు. ఏదుల జలాశయ గరిష్ట నీటినిల్వ మట్టం(ఎఫ్ఆర్ఎల్)445 మీటర్లు కాగా గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 6.59 టిఎంసిలు. జలాశయంలో 440 మీటర్ల మట్టం 4.16 టిఎంసిలు.437 మీటర్ల మట్టంతో 3.04 టిఎంసిల నిల్వలు,436 మీటర్ల మట్టంతో 2.72 టీఎంసీలు నిల్వలు ఉంటాయి. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించడానికి నిర్మిస్తున్న కాల్వ అడుగు (బెడ్ లెవల్) 21.643 కి.మిల వద్ద 421.45 మీటర్ల మట్టాన్ని కలిగి ఉండగా, ప్రతిపాదనల ప్రకారం ఏదులలో 436.41 మీటర్ల మట్టం నుంచి నీటిని తరలించాల్సి ఉంటుంది.

డిండి ఎత్తిపోతలకు నీటిని తరలించడానికి ఏదుల రిజర్వాయర్లో ఉండాల్సిన నీటిమట్టం, దిండి ప్రాజెక్టు కాలువల లోతు మధ్య 4.9 మీటర్ల వ్యత్యాసం ఉంది. ఈ నేపథ్యంలో డిండి ఎత్తిపోతల పథకము ద్వారా నీటిని తరలించడానికి ఏదుల రిజర్వాయర్లో ఉండాల్సిన కనీస నిల్వ మట్టాన్ని 440 మీటర్లకు పెంచాలని ఈ.ఎన్.సి నేతృత్వంలో కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఏదుల రిజర్వాయర్ను 440 మీటర్లకు నింపడానికి కేవలం 2 రోజులే పడుతుందని, దీనివల్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేసింది. ఏదులలో 440 మీటర్ల స్థాయిలో నిల్వలున్నప్పుడే డిండి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాలని సూచించింది.

డిండి ఎత్తిపోతల పథకము ద్వారా నాగర్ కర్నూల్, నల్లగొండ,యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాలోని 21 మండలాల పరిధిలో 3.61 లక్షల ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించారు. 440 మీటర్లకు చేరినప్పుడే డిండి ఎత్తిపోతలకు నీటిని విడుదల చేయాలని నీటిపారుదల శాఖ తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆ జిల్లా శాసనసభ్యులు, పార్టీల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పునః సమీక్షించి జిల్లాకు నష్టం జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646




## పర్యావరణాన్ని కాపాడాలి... ప్లాస్టిక్‌ను విడనాడాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో వినియోగించకుండా ప్రజలందరూ బాధ్యతగా ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని తెలంగాణా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రాంతీయ కార్యాలయ పర్యావరణ ఇంజనీరు సూచించారు. 99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయ అధికారులు సోమవారం కూకట్‌పల్లిలోని రష్ యుబిఆర్ ఉమెన్స్ కాలేజిలో 'సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్' అన్న అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే హానికారక ప్రభావాలను వివరించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల భూమి, నీరు, జీవ వ్యవస్థలకు కలిగే నష్టాలన్నిటినీ విద్యార్థులకు స్పష్టం చేసారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించటానికి పాటించాల్సిన నియమాలు, ప్రత్యామ్నాయ మార్గాలన్నిటినీ తెలిపారు. దీనికి సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్లను ప్రదర్శించారు. 200 మందికి పైగా విద్యార్థినులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సైతం పర్యావరణ ప్రాముఖ్యతను వివరించారు.





## రంజాన్ తోఫాలు అందజేత

**ప్రజాపక్షం/చర్లపల్లి:** రంజాన్ పండుగను పురస్కరించుకుని జిహెచ్‌ఎంసి పరిధిలోని 4వ డివిజన్ కుందన్‌పల్లి శ్రీరామలింగేశ్వర కాలనీలో రంజాన్ తోఫాలను ముస్లీం సోదరులకు మాజీ కౌన్సిలర్ వరగంటి వెంకటేష్ ఆధ్వర్యంలో అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం తోఫాలను అందించడం సంతోషంగా ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రాజరెడ్డి, శ్రీనివాస్, చంద్రయ్య, రవీందర్‌రెడ్డి, రమేష్, అబ్బాస్, పాషా, తదితరులు పాల్గొన్నారు.




**మేడ్చల్ మల్కాజిగిరిలో:** శాంతి, సోదర భావం,సేవా భావానికి ప్రతీక అయిన రంజాన్ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం మైనారిటీ సోదరులకు రంజాన్ తోఫా అందచేయటం వారిని గౌరవించటమే అని కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఎంఎంసి కీసర సర్కిల్ పరిధిలోని జవహర్‌నగర్‌లోని నైస్ గార్డెన్‌లో సోమవారం రంజాన్ తోఫా కిట్లను హజ్ కమిటి సభ్యుడు మహ్మద్ ముజీబ్రుద్దీన్‌తో కల్సి ఆయన పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, కాంగ్రెస్ నేతలు సదానంద్, శంకర్ గౌడ్, ఫారూఖ్, అనంతలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్:** ప్రజావాణి పెండింగ్ పిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతలనుండి ప్రతిసోమవారం నిర్వహించే ప్రజావాణికి ప్రజలు నుండి 119 దరఖాస్తులు స్వీకరించామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి ప్రజలు జిల్లాలోని సుదూర ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కొరకు వస్తారని, వారి ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల వారీగా మున్సిపాలిటీలు, పంచాయతీరాజ్ అటవీశాఖ డిఆర్‌డిఎ, ప్రణాళికశాఖ,భూసేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్ లో ఉన్న దరఖాస్తులపై వివరణ ఇవ్వాలని కోరారు. వారంలోపు అన్నీ పరిష్కరించి గతవారంలో వచ్చిన దరఖాస్తులపై అడిగి తెలుసుకున్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల , మున్సిపాలిటీ, జిల్లా స్థాయిలో రోజువారీ షెడ్యుల్ ప్రకారం ప్రజలు, ప్రజా ప్రతినిధులు నిర్వహించిన కార్యక్రమాలకు తప్పని సరిగా పోటోలు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ట్రైనింగ్ కలెక్టర్ హర్స్‌చౌదిరి, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతం చేయాలి:** జిల్లా వ్యాప్తంగా లక్ష్యాలకు అనుగుణంగా సిసిరోడ్లు, ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ పనులు ,స్కూల్ కాంపౌండ్ వాల్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో మంజురైన 12,866 ఇందిర్మ ఇళ్లకు సంబంధించి8,560 ఇండ్లు గ్రౌండింగ్ చేయబడ్డాయని తెలిపారు. మండలాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**జనగణన 2027 పథకాల అమలు ,దేశ అభివృద్ధికి మూలం :** ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జనగణన 2027 నిర్వహణపై జిల్లా మండల , మున్సిపల్‌స్థాయి, అధికారులు 3రోజులు పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం లో కలెక్టర్ పాల్గొని జనగణన కార్యక్రమంలో పూర్తిస్థాయి అవగాహన కలిగిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జనగణన 2027 సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. జనగణన రెండు విడుతల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. జనాభ గణనను డిజిటల్ మొబైల్ యాప్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు.

## డిఎంహెచ్‌ఓ విజయకుమారి నిరంకుశ ధోరణిని విడనాడాలి

తెలంగాణా మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ

నేడు ధర్నాకు పిలుపు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** మేడ్చల్ మల్కాజిగిరి డిఎంహెచ్‌ఓ విజయకుమారి నిరంకుశ ధోరణికి నిరసనగా మంగళవారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నామని తెలంగాణా మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ తెలిపారు. రాష్ట్రంలోని ఏ జిల్లాలోనూ లేనివిధంగా మేడ్చల్ జిల్లా వైద్యారోగ్య శాఖలో యుపిహెచ్‌సి, పిహెచ్‌సిలలో పని చేసే ఎఎన్‌ఎంల హాజరీ విషయంలో ఆధార్ ప్రాతిపదిక హాజరు పేరిట వేతనాల్లో కోత విధి స్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. డిఎంహెచ్‌ఓ విధానాలకు నిరసనగా సోమవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాల యం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా యుపిహెచ్‌సి, పిహెచ్‌సిల ఎన్‌ఎంలు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఎంహెచ్‌ఓ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆధార్ ప్రాతిపదిక హాజరు అంటూ జీతాల్లో కోత విధించటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో ప్రతి రోజూ ఉదయం నుండి సాయంత్రం వరకు పనిచేసే ఎఎన్‌ఎంల కు ఆధార్ ప్రాతిపదికన హాజరు ఎంత వరకు సాధ్యమవుతుందన్నారు. ఉద్యోగులకు ఎలాంటి ముందస్తు కౌన్సిలింగ్ లేకుండా డిఎంహెచ్‌ఓ తన ఇష్టానుసారంగా వ్యవహరించటం సరైంది కాదన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు ఇన్విటేషన్ ఇవ్వరా?

అధికారులను ప్రశ్నించిన కౌన్సిలర్ చందుపట్ల విష్ణువర్ధన్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాల ప్రారంభాలకు తనకు సమాచారం ఇవ్వడం లేదని వెంటనే సదరు అధికారిని మణిదీపను సస్పెండ్ లేదా డిస్మిస్ చేయాలని జగ్గంగూడ 13వ వార్డు కౌన్సిలర్ చందుపట్ల విష్ణువర్ధన్‌రెడ్డి కౌన్సిల్ సభలో ధ్వజమెత్తారు. సోమవారం మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ జాం రవి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సభ ప్రారంభంలో కౌన్సిలర్ చందుపట్ల విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జగ్గంగూడలోని 13వ వార్డు లో రాత్రికి రాత్రే ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోశారని తన వార్డులో చేసిన కార్యక్రమానికి తనకు సమాచారం ఇవ్వని అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని కమిషనర్‌ను కోరారు. ఇట్టి విషయమై మణిదీప వివరణ ఇస్తు తనపై స్థానిక నాయకులు ఒత్తిడి తెచ్చారని అందుకే రాత్రి ముగ్గు పోయాల్సి వచ్చిందని అయినా తనను సస్పెండ్ చేయమని అడగడానికి నీకు అధికారం లేదని విష్ణువర్ధన్‌రెడ్డిని ఎదురు ప్రశ్నించింది. చైర్మన్ జాం రవి, కమిషనర్ పవన్‌కుమార్‌లు కలుగజేసుకుని ఇకపై ఇలాంటి తప్పిదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని ఇది మొదటి తప్పుగా భావించి క్షమాపణలు కోరుతున్నామని చెప్పారు. దీంతో కౌన్సిలర్ శాంతించారు.

అనంతరం చైర్మన్ జాం రవి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా మున్సిపల్‌ను అభివృద్ధి చేద్దామని దీనికి అధికారులు, కౌన్సిలర్లు సహకరించాలని కోరారు.

వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్య నివారణ ఇతర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పవన్‌కుమార్, ఆర్‌ఓ హర్షద్, మేనేజర్ ఉష, ఆర్‌ఐలు రాజేశ్వర్‌రెడ్డి, గౌతమి, డిఇ స్ఫూర్తి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌సింగ్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో సమస్యలు పరిష్కరిస్తాం

డిప్యూటీ కమిషనర్ ఎన్.కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/దుండిగల్:** ప్రజావాణిలో ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తామని కొంపల్లి డిప్యూటీ కమిషనర్ ఎన్.కృష్ణారెడ్డి అన్నారు ప్రజావాణిలో ప్రజల నుండి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 7 వినతి పత్రాలు వచ్చాయని అందులో ఆస్తి పన్ను కమర్షియల్ టాక్స్ నుంచి రెసిడెన్షియల్ టాక్స్‌గా మార్చుట గురించి, సూరారం సుందర్ నగర్ కాలనీ లో మట్టి రోడ్డు మరమ్మత్తు, సాయిబాబా నగర్ కాలనీలో ప్రభుత్వ నీటి బోరు నుండి అక్రమ కనెక్షన్ తీసుకున్న వ్యక్తిపై ఫిర్యాదు అదే విధంగా, సూరారం 60 గజాలలో అక్రమంగా రోడ్డుపై నిర్మాణాలు, తెలంగాణ హైకోర్టు ఆదేశాలను పాటించకుండా సుభాష్ నగర్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని టౌన్ ప్లానింగ్ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదులు, సుభాష్ నగర్, స్టీల్ సిటీ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదులు అందాయని, తెలంగాణ హైకోర్టు మరియు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆదేశాలను పాటించకుండా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందాయని వీటన్నిటిని పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు.

స్వీకరించిన వినతులను సంబంధిత శాఖ అధికారులకు పంపించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకొని, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని అన్నారు.

## బాచుపల్లి చౌరస్తాలో చలి వేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ జోనల్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, బాచుపల్లి చౌరస్తాలో శ్రీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంత రెడ్డి మాట్లాడుతూ మండుతున్న ఎండల వేడిమికి చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. బాచుపల్లి చౌరస్తాలో నిత్యం ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, అలాంటి వారికోసం ఇలాంటి చలివేంద్రాలు కాస్త ఉపశమనాన్ని కలిగిస్తాయని తెలిపారు. సంక్షేమ సంఘాలు, కులసంఘాలు, యువత ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొలను జీవన్ రెడ్డి, నాయకులు కొలను కృష్ణారెడ్డి, నిర్వాహకులు సంగమేశ్వర్, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.





## హెరిటేజ్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

**చందుపట్ల విష్ణువర్ధన్‌రెడ్డి**

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** పర్యావరణ కాలుష్యానికి కారణమైతున్న హెరిటేజ్ డైరీ కంపెనీపై చర్యలు తీసుకోవాలని జగ్గంగూడ 13వ వార్డు కౌన్సిలర్ చందుపట్ల విష్ణువర్ధన్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగ్గంగూడ సంపన్‌బోల్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న హెరిటేజ్ డైరీ కంపెనీ యాజమాన్యం కలుషితమైన నీరు, వ్యర్థ పదార్థాలను బయటకు విడుదల చేస్తు పర్యావరణాన్ని తీవ్రంగా కలుషితం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు నిర్మించడం జరుగుతుందన్నారు. సుమారు ఒక వేయి ఫీట్ల వరకు నీటి బోర్లు వేస్తున్నారని దీంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రాత్రి వేళల్లో అధికంగా విషతుల్యమైన పొగను వదులుతున్నారని తీవ్ర దుర్వాసనతో, ఆరోగ్య సమస్యలతో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సదరు కంపెనీని సందర్శించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల తరపున కోరుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జంగారెడ్డి ఉన్నారు.

## నిధులు మంజూరు చేయాలి

మాజీ కార్పొరేటర్లు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** తమ డివిజన్లకు అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్, మచ్చ బొల్లారం మాజీ కార్పొరేటర్లు వై ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్‌లు కోరారు. ఈ మేరకు సోమవారం వారు జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్‌ను కల్సి వినతిపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నిటిని పూర్తి చేయాలని, రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని బాక్స్ డ్రైవ్ పనులకు నిధులు మంజూరు చేయ టం ద్వారా వర్షపు నీటితో మునిగి పోయే ప్రమాదాలను ముందుగానే అరికట్టేందుకు యుద్ధ ప్రాతిపదికన పూర్తయ్యేలా చూడాలన్నారు.

## గ్యాస్ ధరలను తగ్గించండి...ఇరాన్‌పై వెంటనే యుద్ధాన్ని ఆపాలి

సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్



**ప్రజాపక్షం/తాండూరు:** దేశవ్యాప్తంగా పెరిగిన ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ తాండూరు పట్టణంలో సిపిఐ ఆధ్వర్యాన ఆందోళన చేశారు. పెరిగిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా సోమవారం వికారాబాద్ జిల్లా తాండూరులో బస్టాండ్ ఎదురుగా అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పెరిగిన ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని, తగ్గిన గ్యాస్ సరఫరాతో ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ సర్కార్ విధాన వైఫల్యాలే ఇందుకు కారణమన్నారు. ఇరాన్ నాయకత్వాన్ని మార్చాలని కుటిలనీతితో అమెరికా ఆ దేశంపై గత నెల 28న ఏకపక్షంగా బాంబులతో దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. ఈ దాడులలో 165 మంది చదువుకునే అమ్మాయిలు, టీచర్లను పొట్టపెట్టుకున్నారని అన్నారు. ఆ దేశ సర్వోన్నత నాయకుడు రక్షణ మంత్రి ఉన్నత సైనికాధికారులు సమావేశమైన భవనంపై బాంబులు వేసి హతమార్చారని అన్నారు. ఇప్పటి వరకు యుద్ధంలో ఇరాన్‌కు చెందిన అనేక నగరాలలో వేలాది బాంబుల దాడులతో సుమారు 1900 మంది అమాయక ప్రజలు బలి అయ్యారని, మరో 20వేల మంది గాయపడినట్లు సమాచారమన్నారు. ఇరాన్ తనపై జరిగిన దాడుల ప్రతిస్పందనగా యుఎఇ బహ్రెయిన్, దుబాయ్, ఖతార్ తదితర గల్ఫ్ దేశాలలోని అమెరికా రాయబార కార్యాలయాలు, చమురు క్షేత్రాలపై డ్రోన్ దాడులు చేస్తోందన్నారు. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ రెండవసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రపంచానికి తనకు తానే రారాజుగా భావిస్తున్నాడని అన్నారు. అరుదైన ఖనిజాలు కల్గిన గ్రీన్‌ల్యాండ్‌ను తమ దేశంలో కలిసి పోవాలని హెచ్చరికలు జారీ చేశారు. వెనిజులాలో చమురు నిక్షేపాలపై కన్నేసిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మధరోను, ఆయన సతీమణితో పాటు ఏకంగా అర్ధరాత్రి అపహరించి అమెరికాకు తరలించుక పోయారని అన్నారు. ఇప్పుడు ఇరాన్‌లో తమకు అనుకూలమైన ప్రభుత్వం రావాలని అక్కడి పెట్రోల్ నిక్షేపాలపై నియంత్రణ సాధించాలని యుద్ధం చేస్తున్నాడని అన్నారు. యుద్ధం ఫలితంగానే భారత దేశంలో గృహ అవసరాల గ్యాస్ ధరలు పెరిగి పోయాయని అన్నారు. దేశంలో పెట్రోల్, గ్యాస్‌కు ఏలాంటి కొరత లేదని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇస్తున్న ప్రకటనలు అబద్ధమన్నారు. యుద్ధాన్ని ఆపాలని, ప్రపంచ శాంతిని పరిరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అబ్దుల్లా, రవీందర్, మునీర్ ఆహ్మద్, పుష్ప, లక్ష్మి , దస్తప్ప, తదితరులు పాల్గొన్నారు.



## గ్యాస్ ధరలు తగ్గించాలి : సిపిఐ

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సోమవారం కూకట్‌పల్లి మండలం ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఖండించాలని, పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని యుద్ధం ఆపాలని శ్రీశ్రీ నగర్ సిపిఐ కార్యాలయం నుండి ప్రశాంతి నగర్ మెయిన్ రోడ్డు వరకు నిరసన తెలిపారు. ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, యుద్ధాన్ని ఆపాలని ఈ నిరసన కార్యక్రమంలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ హాజరై ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలని, పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని ప్రపంచ శాంతి వర్థిల్లాలని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగన్న, జి.రాములు, ఉమాదేవి, కిష్టప్ప, పాండు, తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలి

అధికారులకు సూచించిన ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పేట్‌బషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ పునర్విభజన తరువాత ఏర్పడిన సర్కిళ్లు, వార్డులలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పై ఎమ్మెల్యే వివేక్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ పునర్విభజన అనంతరం ఏర్పడిన నూతన వార్డుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో గుర్తించి స్థానిక ప్రజలను భాగస్వాములను చేస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని వార్డులలో సమగ్ర మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలను రూపొందించాలని అన్నారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా సిమెంటు రోడ్లు, స్మశాన వాటికలు, పార్కులు, నాలాలు, వీధి దిపాలు వంటి సదుపాయాలను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. వివిధ కాలనీలు, బస్తీలలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను గుర్తించి ప్రణాళికబద్ధంగా వ్యయ ప్రణాళికలను రూపొందించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా అధికారులు వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌ఈ శ్రీకాంతి, ఇఇ భద్రు, డిఇ లు పాపమ్మ, అనురాగ్, విరాట్ రాజ్ కుమార్, వసంత, తదితరులు పాల్గొన్నారు.

## తూతూ మంత్రంగా మారుతున్న ప్రజావాణి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం నానాటికి నీరు కారిపోతోంది. ప్రారంభంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖాధికారులతో కల్సి జిల్లా కలెక్టర్ నేరుగా అర్జీలను స్వీకరించి ఆ తర్వాత వాటి పరిష్కార దిశగా ఏం చేయాలన్న విషయమై తగు సూచనలిచ్చేవారు. రానురాను కలెక్టర్ బదులుగా జిల్లా అదనపు కలెక్టర్లు, డిఆర్‌ఓ, లా అధికారి ఆధ్వర్యంలో ప్రజావాణి అర్జీలను స్వీకరిస్తున్న క్రమంలో తాజాగా సోమవారం జరిగిన ప్రజావాణిలో డిప్యూటి కలెక్టర్ మాలతి అర్జీలను స్వీకరించటం గమనార్హం. ఇదిలా ఉంటే ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరుగుతున్న ప్రజావాణిలో వచ్చాయన్న విషయమై జిల్లా పౌరసంబంధాల శాఖ ద్వారా విడుదల చేస్తున్న పత్రికా ప్రకటనలో అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, పరిష్కార వివరాలన్నిటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలంటూ తెలియ చేస్తూ ఒకే మాదిరి వాక్యాలతో స్వీకరించిన అర్జీల సంఖ్యను తెలియచేయటం పరిపాటిగా మారింది. ప్రజావాణి ప్రారంభమైన నేటి వరకు కలెక్టరేట్ ప్రజావాణిలో తీసుకొన్న అర్జీల్లో ఏ మేరకు పరిష్కారం చేసామన్న వివరాలు ప్రకటించక పోవటం గమనార్హం.

**తాజాగా 125 అర్జీలు :** కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తమ అర్జీలు ఇస్తే మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం 125 అర్జీలను దరఖాస్తుదారులు అధికారులకు సమర్పించారు. డిప్యూటి కలెక్టర్ మాలతి అర్జీలను స్వీకరించారు. అనంతరం వారితో పాటు ఉన్న వివిధ ప్రభు త్వ విభాగాల అధికారులను అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆయన సూచించారు.ఒకవేళ అర్జీలను పరిష్కరించ లేనిపక్షంలో దానికి కారణాలను సైతం దరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు. జిల్లా పరిపాలనాధికారి సుజాత, ఎఫ్ అండ్ జి సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్, హౌసింగ్ విభాగ ప్రాజెక్టు డైరెక్టర్ రమణ మూర్తి, డిర్డీ సాంబశివరావు తదితర జిల్లా స్థాయి అధికారులు ప్రజావాణిలో పాల్గొన్నారు.

## వాటర్ పైప్‌లైన్ లీకేజీ సమస్యకు స్పందన



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో గత కొన్ని రోజులుగా వాటర్ పైప్‌లైన్ లీకేజీ అవుతుందని ప్రజాపక్షం దిన పత్రికలో ప్రచురించడం జరగింది. దినం తప్పి దినం వాటర్ రావడంతో లీకేజీ తో నీరు ప్రవహించి రోడ్డు పాడవుతుందని,వాహన దారు లు జారిపడి గాయాలపాలవుతున్నారని కాప్రా డిప్యూటీ కమిషనర్, వాటర్ వర్క్స్ ఏఇ సందీప్‌కు విన్నవించుకోవడం జరిగింది.ఈ సమస్య మాది కాదు అంటే మాది కాదు చెప్పడంతో పదేపదే ప్రజాపక్షం గ్రూపుద్వారా సమాచారం అందించినందుకు స్పందించిన అధికారులు, సిబ్బంది వాటర్ పైప్‌లైన్ కు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించినందుకు వాహనదారులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదం... ఇద్దరు దుర్మరణం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఒఆర్‌ఆర్‌పై ఆగి భోజనం చేస్తుండగా ఓ లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి ఆర్‌టిసి కాలనీకి చెందిన మహ్మద్ యూసుఫ్(51), షేక్‌పేట్ నివాసి మహ్మద్ హుస్సేన్ (48) వీరు (టిఎస్09 ఇడి3303) కారులో ఇసిఐఎల్ నుంచి తుప్రాన్ వైపు ఓఆర్‌ఆర్ పై ప్రయాణం చేస్తున్నారు. మార్గమధ్యంలోని శామీర్‌పేట పరిధిలో



భోజనం చేయడానికి కారును ఆపారు. (ఎంహెచ్12పిక్యూ 2337) లారీ వేగంగా వచ్చి వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరి పైకి లారీ దూసుకెళ్లడంతో రక్త గాయాలై అక్కడిక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడని వచ్చింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కాలనీ వాసులకు అవస్థలు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఎస్‌కెడి నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారని తాజా, మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆరోపించారు. సోమవారం జిహెచ్‌ఎంసి డిఇ కనకయ్య, ఎఇ విగ్నేశ్వరిచారితో కలిసి సిసి రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తిచేసి కాలనీవాసులకు అందుబాటులో తీసుకువచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి శ్రీధర్‌రావు, కన్వీనర్ రఘురాంనేత, కృష్ణారావు, కాంతారావు, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయంతో రైతులకు మంచి లాభాలు



**ప్రజాపక్షం/షాబాద్:** ఆధునిక వ్యవసాయంతో రైతులకు మంచి లాభాలు వస్తాయని మండల వ్యవసాయ శాఖ అధికారి దండెం విజయచంద్ర అన్నారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో సాంకేతిక యాజమాన్యం సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీకృష్ణ, దిలీప్, చంద్రశేఖర్‌రెడ్డి, జయంత్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారులు లిఖిత, శివతేజ, రాజేశ్వరి, మౌనిక, ఇఫ్కో కంపెనీ అభివృద్ధి అధికారి సంజయ్ భార్దజ్ మండల రైతులు పాల్గొన్నారు.

## మత్స్యపారిశ్రామిక సంఘం నూతన కమిటీ



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో మత్స్యపారిశ్రామిక సంఘం నూతన కమిటి ఎన్నిక జరిగింది.సోమవారం గ్రామంలోని ముదిరాజ్ భవనంలో జిల్లా అధికారి సిహెచ్ సామ్సన్ అధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా తెరేటి భరత్‌కుమార్, కార్యదర్శిగా గుడాల వేంకటేశ్, ఉపాధ్యక్షులు కర్నాటి కళ్యాణ్, కమిటి సభ్యులుగా తీగల దశరథ, సంగెం రవి, మాదం జంగయ్య, మేకల యాదయ్య, గుడాల రాములు, సంగెం శ్రీకాంత్, సొసైటీ సభ్యులుగా గగనమోని రమేశ్, పెద్దమ్మయాదయ్య, కర్నాటి నరేశ్ ఎన్నికయ్యారు.

## జల్ జీవన్ మిషన్‌లో కృషికి ఉత్తమ అవార్డుకు ఎంపిక



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా అమన్‌గల్ మండలం చెన్నంపల్లి గ్రామ పంచాయతీకి చెందిన "జల వనిత" (వాటర్ ఉమెన్ ) తెలగమల్ల ఆనంద,"జల్ జీవన్ మిషన్" అమలులో ఆమె చేసిన కృషికి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. అందుకుగాను న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన "జల్ మహోత్సవ్ ప్రచార కార్యక్రమం 2026"లో ఆమె పాల్గొన్నారు. జల్ జీవన్ మిషన్ అమలులో ఆమె చేసిన విశేష కృషిని గుర్తించి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం(ఐడిఒసి)లో తెలగమల్ల ఆనందను ఘనంగా సన్మానించారు. కార్యక్రమం మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/కేశంపేట:** సిసి రోడ్డు నిర్మాణం పనులను స్థానిక సర్పంచ్ బీస కవిత కరుణాకర్‌రెడ్డి ప్రారంభించారు. సోమవారం మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు రూ.10లక్షలతో నిర్మించే సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉడ్తవత్ రవినాయక్, పంచాయతీ కార్యదర్శి అనినాష్ గౌడ్, వార్డు సభ్యులు లచ్చిరామ్‌నాయక్, పోగుల నర్సింలు, గుత్తి చంద్రయ్య, లాలమోని మల్లేష్, కావలి వసంత, కందెన సంతోష, నాగిళ్ల ప్రేమలత, నాయకులు చిట్టిరెడ్డి, నరసింహారెడ్డి, గుత్తి శేఖర్, శంభుల శేఖర్ పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** షాద్‌నగర్ పట్టణంలోని ఠాగూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ కుంగ్‌ఫూ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో న్యూ పవర్ కుంగ్ ఫూ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సొంతం చేసుకున్నారు. అకాడమీ కరాటే మాస్టర్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు తమ విన్యాసాలతో అకట్టుకొని ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లరు అందుకున్నారు. కుంగ్‌ఫూ మాస్టర్ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీలకు వివిధ జిల్లాల నుండి పెద్ద ఎత్తున కరాటే విద్యార్థులు హాజరయ్యారు. పోటీకు ముఖ్యఅతిధిగా కుంగ్‌ఫూ గ్రాండ్ మాస్టర్ వీరాచారి హాజరై గెలుపోందిన కరాటే విద్యార్థులకు బహుమతులు అంధించారు. న్యూ పవర్ కుంగ్‌ఫూ అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రేమ్‌కుమార్, రాహుల్ కట్ట ఫైట్ విభాగంలో పోటీ పడి అగ్రస్థానంలో నిలిచి ట్రోఫీలను సొంతం చేసుకున్నారు. కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినంధించారు.

# మోదీ వైఫల్యంతోనే గ్యాస్ ధరల పెరుగుదల

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారీ

**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ :** ప్రధాని నరేంద్ర మోదీ వైఫల్యంతోనే దేశంలో గ్యాస్ ధరలు పెరిగాయని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారీ ఆరోపించారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్దానికి నిరసనగా సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కార్యదర్శి అజ్మీరా హరి సింగ్ నాయక్ అధ్యక్షతన సోమవారం మెట్టు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆందోజు రవీంద్రచారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి హాజరై మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను అపి శాంతిని నెలకొలపాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్ మెట్టు మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, నాయకులు అరుణ, నవనీత, రవి, డౌల రాములు, ఈశ్వర్, యాదగిరి, మధు, సైదులు ముదిరాజ్, భైరగోని రాజు గౌడ్, గణేష్, రమేష్, రవి పాల్గొన్నారు.

**రంగారెడ్డి:** పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు రాజేంద్రనగర్ మండల కేంద్రంలో పార్టీ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో బుద్వేల్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జె.ఆనంద్‌గౌడ్, మండల సహాయ కార్యదర్శి జె.విజయ, ఆనంద్ గౌడ్, ఎఐటియుసి మండల కార్యదర్శి సయ్యద్ కాజా, అధ్యక్షులు ఎండి.సలీం, నాయకులు జి.సత్యం, పాండు, సదానందగౌడ్, మౌనిక, కె.వాణి, పుష్ప, శాలిని, శాంతమ్మ, ఎండి సాబీర్, ఇంద్ర, మణెమ్మ, తదితరులు పాల్గొన్నారు.




**ఇబ్రహీంపట్నం :** పెంచిన వంటగ్యాస్ ధరలు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద సాగర్ రహదారిపై సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు కావలి నర్సింహ్మా, మండల కార్యదర్శి కావలి సురేష్, నాయకులుశ్రీకాంత్, కిరణ్, అబిఅజయ్, రాజు, మధు, భిట్టు కార్యకర్తలు పాల్గొన్నారు.





## 'పీపుల్స్ మార్చ్'కు మూడేళ్లు

### భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు తెలిపిన చల్లా



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్' పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. 2023లో సిఎల్‌పి నేతగా ఉన్న సమయంలో భట్టి విక్రమార్క మల్లు ఆదిలాబాద్ జిల్లా పిప్పిరి గ్రామం నుంచి పీపుల్స్ మార్చ్' పాదయాత్రను ప్రారంభించారు. 108 రోజుల పాటు 1,360 కిలోమీటర్ల మేర సాగిన ఈ పాదయాత్ర ఖమ్మం జిల్లాలో పూర్తి చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిరి పరిష్కారం కనుగొనే లక్ష్యంతో చేపట్టిన ఈపాదయాత్రకు మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చల్లా నర్సింహారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

# మలకం చెరువు సమస్యలు పరిష్కరిస్తా

### కమిషనర్ హేమంత్ సహదేవరా



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మలకం చెరువు సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని కమిషనర్ హేమంత్ సహదేవరావు తెలిపారు. మలకం చెరువు వాకర్స్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు కమిషనర్ హేమంత్ సహదేవరావు సోమవారం ఉదయం పార్క్‌ను సందర్శించారు. అసోసియేషన్ సభ్యులు కమిషనర్‌తో పాటు పార్క్ తిరిగి సమస్యలను వివరించారు. వివిధ విభాగాలకు చెందిన వెటర్నరీ, ఆర్టికల్చర్, బ్రేవరేజ్, స్పోర్ట్స్ సంబంధించిన అధికారులు కమిషనర్ వెంట పాల్గొన్నారు. పార్కులో వాకింగ్ ట్రాక్ పూర్తిగా ప్రొఫషనల్‌గా ఏర్పాటు చేయడం, జిమ్‌లో ఉన్న ఎక్విప్మెంట్‌ని కొన్నింటిని మార్చడం, మరికొన్ని కొత్తవి ఏర్పాటు చేయడం, అలాగే రెండు షటిల్ కోర్టులు, ఒక యోగా సెంటర్ ఏర్పాటు చేసే విధంగా, మురుగు వాసన రాకుండా వాటర్‌ని ఫిల్టర్ చేసే ప్లాంటు ఏర్పాటు చేయడానికి అధికారులను ఆదేశించారు. సమ్మర్ కాబట్టి ఫ్రంట్, బ్యాక్ గేట్ ప్రధాన ద్వారాల వద్ద డ్రింకింగ్ వాటర్‌ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాక్‌లో కనిపిస్తున్న కుక్కలను లోపలకు రాకుండా ఏర్పాట్లు చేయాలని వెటర్నరీ అధికారులను ఆదేశించారు. వాకింగ్ టైంలో వెహికల్స్ రాకుంగా చూడాలన్నారు. మొక్కలకు ఫస్టిసైడ్స్ వేయడం ప్రమాదం కాబట్టి వాకర్స్ వెళ్లాక ఆ పనులు చేయాలన్నారు. ఇవన్నీ వీలైనంత తొందరగా పూర్తి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు, పనులు వెంటనే ప్రారంభించాలన్నిరు. వచ్చే వారం మళ్ళీ వస్తానని పనులపై నాకు అప్డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మలకం చెరువు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్దగోని సతీష్ గౌడ్, జనరల్ సెక్రటరీ ఎన్.మల్లికార్జున్, జాయింట్ సెక్రెటరీ రాజేష్, ట్రెజరర్ బాబ్జీ, జాయింట్ ట్రెజరర్ రమణారెడ్డి, గౌరవ అధ్యక్షులు ప్రభాకర్, సభ్యులు గోపాలకృష్ణ, ప్రమోద్, సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ హేమంత్ సహదేవరావుకు పుష్పగుచ్చాన్ని అందించి శాలువాతో సన్మానించారు.

# గిరిజన తండాల అభివృద్ధికి నిరంతరం కృషి

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గిరిజన తండాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మెండోనిరాయి తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్‌షాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ వెనుకబడిన గిరిజన తండాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్, పారిశుద్ధ్యం, పంచాయతీ భవనాలు, సిసి రోడ్లు వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. మెండోనిరాయి తండాలో రేషన్ షాపు గిరిజనులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, బుజ్జి బాబునాయక్, తుపాకుల శేఖర్, సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన ఓ కామాంధుడు..ఆపై బాలికను దారుణంగా హతమార్చాడు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా ఉండే ఆరేళ్ల చిన్నారి ఆదివారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. దీంతో చిన్నారి తల్లిదండ్రులు చుట్టపక్కల ప్రాంతాల్లో వెతికారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఆ తర్వాత తెలిసిన వారు, బంధువుల ఇళ్లల్లో వెతికారు. అయినప్పటికీ చిన్నారి కనిపించలేదు. దీంతో భయాందోళనకు గురై బాలిక తల్లిదండ్రులు నార్సింగి పోలీసులను ఆశ్రయించారు. చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. చిన్నారి ఇంటి పరిసరాల్లో ఉన్న సిసి టీవీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ కెమెరాలలో ఓ వ్యక్తి బాలికను తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. వాటి ఆధారంగా పోలీసులు సదరు వ్యక్తిని గుర్తించారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా జరిగిన అసలు విషయం చెప్పాడు. చాక్లెట్ ఆశ చూపించి తానే ఆ బాలికను తీసుకెళ్లినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. చిన్నారిపై లైంగికదాడికి పాల్పడి..ఆ తర్వాత దొరికిపోతానన్న భయంతో చంపినట్లు అంగీకరించాడు. నిందితుడు చూపిన ప్రాంతంలో పోలీసులు బాలిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల అదుపులో ఉన్న అనుమానుడిని కోర్టులో హాజరు పర్చినట్టు, చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## అధిక వడ్డీ పేరిట 'శ్రీరామ్ ఫైనాన్స్' వేధింపులు!

### న్యాయం చేయాలని బాధితుడు వేడుకోలు

**ప్రజాపక్షం/సోమాజిగూడ :** అధిక వడ్డీ పేరిట భయభ్రాంతులకు గురిచేస్తూ మానసికంగా వేధిస్తున్న భువనగిరి బ్రాంచ్ శ్రీరామ్ ఫైనాన్స్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు పున్నపురాల కృష్ణ అలియాస్ కృష్ణ చైతన్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు శ్రీరామ్ ఫైనాన్స్ వారు ట్రేడింగ్ లోన్ కింద రూ.60లక్షలు మంజూరు చేసి, రూ.57లక్షల 47వేల 666 మాత్రమే చెక్కు ఇచ్చారన్నారు. రుణ నగదు అని రూ.60వేలు, ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.14,600, ప్రీ ఇఎంఐ వడ్డీ కింద రూ.36వేలు, డాక్యుమెంటేషన్ ఫీజు రూ.3వేలు ఇన్సూరెన్స్ కింద రూ.60వేలు కట్‌చేసి, వడ్డీ రేటు రూ.26.46 పర్సంటేజీ విధించారన్నారు. అయితే, రుణ నగదులో రూ.60వేలు, ఇన్సూరెన్స్ కింద రూ.60వేల నగదును తీసుకొని సంబంధించిన పత్రాలు తనకివ్వలేదన్నారు. దీనిపై శ్రీరామ్ ఫైనాన్స్ ఆఫీసులో అడిగినా సమాధానం లేదన్నారు. తనకు మంజూరైన రూ.60 లక్షల రుణ నగదుకు వడ్డీతో సహా 60 నెలల్లో రూ.కోటి 9లక్షలు చెల్లించానని తెలిపారు. అయినా, రుణ వ్యవధిని ఇంకా 18 నెలలు పెంచి మొత్తం రూ.62లక్షల 39వేల 744 నగదు చెల్లించాలని, ఇందుకు నెలవారీగా రూ.లక్షా 82,500 చెల్లించాలని లీగల్ డిపార్టుమెంట్ శ్రీనివాస్‌రెడ్డి తనను వేధిస్తున్నారని, ఇంటిపైకొచ్చి ఇల్లును అమ్మేస్తామని తన కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తనతో పాటు తన గ్యారంటెర్ సంతోష్‌కుమార్‌ను కూడా డబ్బులు చెల్లించాలని వేధించడంతో అతనికి హైబిపితో చికిత్స పొందుతూ చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను రుణ నగదును వడ్డీతో సహా చెల్లించిన రశీదులన్నీ ఉన్నాయని, అయినా శ్రీనివాస్‌రెడ్డి దౌర్జన్యం ఆగడం లేదన్నారు. దీనిపై సిఎంని, గవర్నర్‌ను కలిసేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. తనకు జరిగిన మోసంపై ప్రభుత్వం స్పందించి శ్రీనివాస్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేడుకొన్నారు.

# సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలి

### ఒటిఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి
### నగర ప్రజలకు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ విజ్ఞప్తి






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీకి 90 శాతం రాయితీ కల్పిస్తున్న వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటిఎస్) పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సూచించారు. ఈ అవకాశాన్ని మార్చి 31 వరకు వినియోగించుకోవచ్చని తెలిపారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ క్యూర్ పరిధిలో 28 లక్షల 8 వేల మంది ఆస్తి పన్నుదారుల్లో ఇప్పటికే 16 లక్షల 80 వేల మంది పన్ను చెల్లించారని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయానికి రూ.1,984 కోట్లు వసూలవగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.2,186 కోట్ల పన్ను వసూలైనట్లు వెల్లడించారు. పన్ను చెల్లింపుల్లో పారదర్శకత కోసం ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నామని, మీసేవ, ghmc.gov.in పోర్టల్, సిటిజన్ సర్వీస్ సెంటర్లు, మై క్యూర్ యాప్ ద్వారా పన్ను చెల్లించవచ్చని తెలిపారు. దీర్ఘకాలంగా పన్ను చెల్లించని వారిపై జిహెచ్‌ఎంసి చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6 నుంచి 16 వరకు జిహెచ్‌ఎంసి పరిధిలో పారిశుద్ధ్యం, ఫైళ్ల క్లియరెన్స్, జివిపి పాయింట్ల మ్యాపింగ్, సి అండ్ డి వ్యర్థాల తొలగింపు, ఈవేస్ట్ డ్రైవ్, ప్రజా మరుగుదొడ్ల శుభ్రత వంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

**ఓటిఎస్ ప్రచారానికి విస్తృత కార్యక్రమాలు..**

ఓటిఎస్ గడువు ఇంకా 15 రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. నగరంలోని 100 బస్ షెల్టర్లలో ప్రచారం కొనసాగుతోందని చెప్పారు. అలాగే కేబుల్ న్యూస్ ఛానెల్స్, ఎఫ్‌ఎం రేడియోలు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నామని చెప్పారు. సినిమా థియేటర్లలో కూడా ఓటిఎస్‌పై ప్రత్యేక వీడియోలు ప్రదర్శించేందుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి) అనుమతి తీసుకున్నామని, మంగళవారం నుంచి అవి ప్రదర్శనలోకి వస్తాయన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్(రెవెన్యూ) ప్రియాంక అల, అదనపు కమిషనర్(పారిశుద్ధ్యం ఆరోగ్యం) ఎన్. రవి కిరణ్, జాయింట్ కమిషనర్(రెవెన్యూ) రజనీకాంత్ రెడ్డి, ప్రజా సంబంధాల అధికారి మామిండ్ల దశరథం తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులు, వినతులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ అదనపు కమిషనర్లు, విభాగాధిపతులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రధాన కార్యాలయంలో 46, ఆరు జోన్‌లలో 24 ఇలా మొత్తం 70 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరిత పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో వచ్చిన సమస్యలను విభాగాల వారీగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఎన్. రవి కిరణ్, కె. సత్యనారాయణ, చీఫ్ సిటీ ప్లానర్ కె. శ్రీనివాస్, సిఈ సహదేవ్ రత్నాకర్, విజిలెన్స్ ఏఎస్‌పి నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నస్వామికి తొలగిన అడ్డంకులు

## ఐపిఎల్ మ్యాచ్‌లకు అనుమతించిన కర్నాటక ప్రభుత్వం !

చిన్నస్వామి స్టేడియంలో ఐపిఎల్ మ్యాచ్‌లకు అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి ఈ మైదానంలో ఆరంభ మ్యాచ్ జరగడంపై నెలకొన్న సందేహాలకు తెరపడింది. దాదాపు ఏడాది కాలంగా ఒక్క మ్యాచ్‌కు నోచుకోని చిన్నస్వామిలో ఐపిఎల్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ప్రభుత్వం సోమవారం కర్నాటక క్రికెట్ సంఘానికి అధికారికంగా అనుమతులు జారీ చేసింది. ఈ విషయాన్ని 'క్రిక్‌బజ్'తో కేఎస్‌సీఏ సెక్రటరీ సంతోష్ మీనన్ వెల్లడించాడు. ఐపిఎల్ మ్యాచ్‌ల నిర్వహణకు చిన్నస్వామి స్టేడియం సిద్ధమవుతోంది. తొక్కిసలాటతో అప్రతిష్టపాలైన ఈ మైదానానికి పూర్వవైభవం తీసుకొస్తామని మాటిచ్చిన కర్నాటక ప్రభుత్వం ఐపీఎల్‌కు పచ్చజెండా ఊపింది. మైదానంలోని నిర్మాణపరమైన మార్పుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన నిపుణుల కమిటీ.. ప్రభుత్వానికి సానుకూలంగా నివేదిక సమర్పించింది. దాంతో.. చిన్నస్వామిలో ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు రాష్ట్ర పభ్రుత్వం అధికారికంగా అనుమతి ఇచ్చింది.



'ఈ రోజు (సోమవారం) ఉదయం విధాన సభలో మంత్రి డాక్టర్.జీ.పరమేశ్వర్, నిపుణుల కమిటీ ప్రతినిధులు, కర్నాటక క్రికెట్ సంఘం, ఆర్సీబీ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా.. చిన్నస్వామి స్టేడియంలో ఈమధ్య చేసిన నిర్మాణపరమైన మార్పులు, అభిమానుల భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించిన నివేదికను ప్రభుత్వానికి నిపుణుల కమిటీ సమర్పించింది. కమిటీ పేర్కొన్న అంశాల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన హోం మంత్రి ఐపిఎల్ మ్యాచ్‌లకు అనుమతిచ్చారు. చిన్నస్వామికి పూర్వ వైభవం తేవడం కోసం కెసిఎస్ అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్, ఆర్సీబీ యాజమాన్యం హోం మంత్రిని కలిసి పలుమార్లు మాట్లాడారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, నిపుణుల కమిటీ, నిపుణుల ఉప కమిటీ, రాష్ట్రంలోని సీనియర్ అధికారులు ఎంతో కృషి చేశారు. ఐపిఎల్ మ్యాచ్‌ల నిర్వహణలో ఆర్సీబీ యాజమాన్యానికి కేసీఎస్ పూర్తిగా సహకరిస్తుంది' అని కేసీఎస్ సెక్రటరీన సంతోష్ మీనన్ తెలిపారు. 19వ సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను చిన్నస్వామిలో ఢీకొట్టనుంది.

**4.5 కోట్ల ఖర్చుతో..** కృత్రిమ మేధతో పని చేసే కెమెరాల సాయంతో పోలీసులు ప్రేక్షకుల మధ్య తోపులాట జరగకుండా చూస్తారు. అంతే కాదు స్టేడియంలోకి అభిమానులను అనుమతించేటప్పుడు, మ్యాచ్ అనంతరం బయటకు వెళ్లేటప్పుడు క్యూలో వెళ్లేలా చర్యలు తీసుకుంటారు. తద్వారా ఎవరికి ఎలాంటి ఇబ్బంది, ప్రమాదం జరగకుండా చూసుకుంటామని ఆర్సీబీ, కేఎస్‌సీఏ అంటున్నాయి. అందుకని ఒక్కసారే స్టేడియమంతా రూ.4.5 కోట్లు ఖర్చుతో ఈ ఏఐ కెమెరాలను ఏర్పాటు చేయాలని అనుకుంటున్నామని ఫ్రాంచైజీ వెల్లడించింది.

## జగజ్జేతలకు ఘన సత్కారం..

### మెడల్స్‌తో గౌరవించిన బీసీసీఐ..

తొలిసారి ఐసిసి ఛాంపియన్లుగా చరిత్ర సృష్టించిన భారత మహిళా క్రికెటర్లను భారత క్రికెట్ నియంత్రణ మండలి ఘనంగా సత్కరించింది. ఆదివారం కన్నులపండువగా జరిగిన వార్షిక అవార్డుల కార్యక్రమంలో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందానికి ప్రత్యేక మెడల్స్ ప్రదానం చేశారు అధికారులు. బిసిసిఐ ఉపాధ్యక్షుడు రాజీశ్ శుక్లా, జాయింట్ సెక్రటరీ ప్రభుతేజ్ సింగ్ భాటియా చేతుల మీదుగా మెడల్ స్వీకరించిన అనంతరం గ్రూప్ ఫొటో దిగారు. భారత మహిళల క్రికెట్ జట్టును అందని ద్రాక్షలా ఊరించిన ఐసిసి ట్రోఫీని హర్మన్‌ప్రీత్ కౌర్ సేన కొల్లగొట్టింది. 23 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ.. కోట్లాదిమందిని సంబురాల్లో ముంచెత్తుతూ వన్డే ప్రపంచకప్ ఛాంపియన్‌గా అవతరించింది టీమిండియా. చరిత్రాత్మక విజయంతో మహిళా క్రికెట్‌లో నవ శకానికి నాంది పలికిన హర్మన్‌ప్రీత్ సేనను వార్షిక అవార్డుల వేడుకలో బిసిసిఐ ఘనంగా సత్కరించింది. వన్డే వరల్డ్‌కప్ 2025 విజేతలను వేదిక మీదికు అహ్వానించగానే ఆహుతులందరూ లేచి నిలబడి చప్పట్లు కొడుతూ మహిళా క్రికెటర్లను అభినందించారు. వైస్ స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, స్నేహ్ రానా, షఫాలీ వర్మ, అమన్‌జోత్ కౌర్, ప్రతీకా రావల్, రేణుకా సింగ్, రీచా ఘోష్, జి.కమలిని తదితరులు అవార్డులు అందుకున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 విజేతలు, అండర్19 ప్రపంచకప్ హీరోలు, టీ20 ప్రపంచకప్ విజేతలుకు కూడా బిసిసిఐ అవార్డులు ప్రదానం చేసింది




## చరిత్ర సృష్టించిన ఇటలీ కెరటం..

పురుషుల టెన్నిస్‌లో తారాజువ్వలా దూసుకొచ్చిన జన్నిక్ సినర్ చరిత్ర సృష్టించాడు. చిన్న వయసులోనే అన్ని ప్రధాన హార్డ్ కోర్ట్ టోర్నీల్లో ఛాంపియన్‌గా అవతరించాడు. సోమవారం ఇండియన్ వెల్స్ ఫైనల్లో డానిల్ మెద్వెదేవ్‌ను చిత్తుగా ఓడించిన ఇటలీ కెరటం.. 24 ఏళ్లకే అన్ని హార్డ్‌కోర్ట్ ఈవెంట్లలో విజేతగా నిలిచాడు. తద్వారా నొవాక్ జకోవిచ్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును అతడు బద్ధలు కొట్టాడు.



ఇండియన్ వెల్స్ ఫైనల్లో సినర్ ధాటికి డానిల్ మెద్వెదేవ్ తేలిపోయాడు. సెమీఫైనల్లో వరల్డ్ నంబర్ 1 కార్లోస్ అల్కరాస్‌కు చెక్ పెట్టిన రష్యా ఆటగాడు ఇటలీ స్టార్ దూకుడు ముందు నిలువలేకపోయాడు. ఈ టోర్నీలో ఒక్క సెట్ కూడా కోల్పోని సినర్.. ఫైనల్లోనూ పంజా విసిరి తో మట్టికరిపించాడు. ఫలితంగా 24 ఏళ్లకే ప్రధాన హార్డ్ కోర్టుల్లో ఛాంపియన్‌గా అవతరించాడీ సంచలనం. మొట్ట మొదటి ఇండియన్ వెల్స్ ట్రోఫీతోనే సినర్ దిగ్గజాల సరసన చేరాడు. ఇది వరకు జకోవిచ్ 31 ఏళ్లప్పుడు ఈ ఘనత సాధించాడు. కొన్నాళ్లుగా జకో పేరిటే ఉన్న ఈ రికార్డును సినర్ బ్రేక్ చేశాడు. అంతేకాదు అన్ని హార్డ్ కోర్టు 1000 మాస్టర్స్ టోర్నీల్లో విజేతగా నిలిచిన మూడో ఆటగాడిగానూ చరిత్రకెక్కాడు. అతడి కంటే ముందు రోజర్ ఫెదర్, జకోవిచ్ మాత్రమే ఈ మైలురాయిని అధిగమించారు.

# యువతరంగం

## కార్పొరేట్ ఉద్యోగాలకు దూరంగా..



ఇటీవల పలు దేశాల యువతలో ఒక కొత్త సామాజిక ధోరణి కనిపిస్తోంది. ముఖ్యంగా నగరాల్లో పనిచేసే యువ ప్రొఫెషనల్స్‌లో కొందరు సంప్రదాయ కార్పొరేట్ ఉద్యోగాల నుండి దూరంగా ఉండాలని నిర్ణయించుకుంటున్నారు. తీవ్ర పోటీ, ఎక్కువ పని గంటలు, ఒత్తిడితో కూడిన కార్యాలయ సంస్కృతి వల్ల వారు అలసిపోయి తక్కువ ఒత్తిడితో కూడిన జీవనశైలిని ఎంచుకోవాలని ప్రయత్నిస్తున్నారు. దీనిని కొందరు 'ఎర్లీ రిటైర్మెంట్' లేదా 'లేయింగ్ ఫ్లాట్' వంటి ధోరణిగా విశ్లేషిస్తున్నారు. కొందరు యువకులు సంప్రదాయ కెరీర్ మార్గాన్ని అనుసరించడం కన్నా, తక్కువ ఆదాయం ఉన్నా ప్రశాంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకుంటున్నారు. అయితే ఈ ధోరణిని ఎలా అర్థం చేసుకోవాలి అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇది నిజంగా కార్పొరేట్ పని సంస్కృతికి వ్యతిరేకంగా యువత చేస్తున్న ఒక నిరసనా? లేక ఆర్థిక వ్యవస్థ మందగించడం వల్ల వచ్చిన అనివార్య పరిస్థితి మాత్రమేనా? కొంత మంది ఆర్థిక నిపుణులు రెండో అభిప్రాయానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. వారి ప్రకారం ఇది కేవలం జీవనశైలి ఎంపిక కాదు. ఇది ఉద్యోగ మార్కెట్‌లో ఉన్న నిర్మాణాత్మక సమస్యలను ప్రతిబింబిస్తుంది. ఉదాహరణకు, విశ్వవిద్యాలయాల నుండి పెద్ద సంఖ్యలో గ్రాడ్యుయేట్లు బయటకు వస్తున్నారు. కానీ అదే స్థాయిలో ఉన్నత నైపుణ్యాల ఉద్యోగాలు పెరగడం లేదు. ఫలితంగా చదువు పూర్తిచేసిన యువతకు సరైన అవకాశాలు దొరకడం లేదు. ఈ పరిస్థితి యువతలో నిరుత్సాహాన్ని పెంచుతోంది. అందువల్ల కొందరు కార్పొరేట్ పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకుంటున్నారు. ఈ ధోరణి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, కార్పొరేట్ సమాజానికి ఒక ముఖ్యమైన హెచ్చరికగా భావించవచ్చు. ఇది యువత పని సంస్కృతి, ఆర్థిక ఒత్తిళ్లు, ఉద్యోగ మార్కెట్ మధ్య ఉన్న సంక్లిష్ట సంబంధాన్ని స్పష్టంగా చూపిస్తోంది. దీన్ని పరిష్కరించాలంటే కేవలం ఉద్యోగాల సంఖ్య పెరగడం మాత్రమే కాకుండా, యువత ఆశయాలకు సరిపోయే విధంగా ఆర్థిక వ్యవస్థ మారాల్సిన అవసరం ఉంది.



## పెరుగుతున్న రాజకీయ అవగాహన

భారతదేశంలో యువత రాజకీయ, ఆర్థిక అంశాలపై స్పందించే విధానం మారుతున్నదని, అవగాహన పెరుగుతున్నదని ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. వాటిలో ఉదాహరణగా యూత్ కాంగ్రెస్ ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన 'సన్సద్ ఘెరావో'ను ఉదాహరణగా చెప్పవచ్చు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పంద వివరాలను గోప్యంగా ఉంచుతూ, దేశ ప్రతిష్ఠను, సార్వభౌమాధికారాన్ని, సంపదను అమెరికాకు తాకట్టుపెట్టేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని యూత్ కాంగ్రెస్ ఆరోపణ. ఈ ఒప్పందం వల్ల దేశీయ ఉపాధి అవకాశాలు తగ్గవచ్చని, చిన్న వ్యాపారాలు నష్టపోవచ్చని యూత్ కాంగ్రెస్ వాదిస్తోంది. నేతల అభిప్రాయం ప్రకారం, విదేశీ సంస్థలకు ఎక్కువ అవకాశాలు కల్పిస్తే స్థానిక వ్యాపారాలు పోటీ చేయలేకపోవచ్చు. దీని ఫలితంగా చిన్న స్థాయి వ్యాపారులు, ఉద్యోగార్థులు ఆర్థికంగా దెబ్బతినే అవకాశం ఉంది. కాగా, ఈ ఘటన ఒక పెద్ద మార్పును కూడా సూచిస్తుంది. గతంలో యువజన రాజకీయ సంస్థలు ప్రధానంగా సిద్ధాంతపరమైన లేదా పార్టీ రాజకీయ అంశాలపై మాత్రమే స్పందించేవి. అయితే ఇప్పుడు యువజన విభాగాలు ఎక్కువగా ఆర్థిక విధానాలు, ఉపాధి అవకాశాలు, వాణిజ్య ఒప్పందాలు వంటి ప్రాముఖ్యమైన విధాన నిర్ణయాలపై నిరసనలు చేపడుతున్నాయి. అంటే, యువత రాజకీయ చర్చలో ఆర్థిక అంశాలు మరింత కేంద్రంగా మారుతున్నాయి. అయితే ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. యువత నిరసనలు జరిగితే అవి దేశంలోని మొత్తం యువత అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తాయని అనుకోవడం తప్పు కావచ్చు. చాలా సందర్భాల్లో ఇటువంటి నిరసనలను రాజకీయ పార్టీలకు చెందిన యువజన సంఘాలు లేదా ప్రత్యేకంగా సంఘటితమైన చిన్న గుంపులు నిర్వహిస్తాయి. అందువల్ల ఇవి మొత్తం యువత భావజాలాన్ని పూర్తిగా ప్రతినిధ్యం వహిస్తాయని చెప్పడం సరైన విశ్లేషణ కాదు. దీన్ని మరింత జాగ్రత్తగా అర్థం చేసుకోవాలంటే, ఈ నిరసనలను ఎలైట్ యువజన చైతన్యంగా చూడవచ్చు. అంటే రాజకీయంగా చురుకైన, సంఘటితమైన కొంతమంది యువత తమ అభిప్రాయాన్ని బహిరంగంగా వ్యక్తం చేస్తున్నారని చెప్పవచ్చు. కానీ అదే సమయంలో దేశంలోని అన్ని యువత అదే విధంగా ఆలోచిస్తున్నారని నిర్ధారించడం సాధ్యం కాదు. యూత్ కాంగ్రెస్ మాదిరి ఇతర యువజన సంఘాలు, సంస్థలతోపాటు దేశంలోని అధికశాతం మంది యువత కూడా స్పందిస్తే, మార్పు స్పష్టంగా కనిపిస్తుంది.

## యువత ఆధ్వర్యంలో స్టార్టప్ వ్యవస్థ



ఇటీవలి కాలంలో యువత స్టార్టప్ ప్రపంచంలో కీలక పాత్ర పోషిస్తోంది. విద్యార్థులు లేదా యువ ఇంజనీర్లు తమ సొంత కంపెనీలను ప్రారంభించి కొత్త ఆవిష్కరణలను రూపొందిస్తున్నారు. ఆరోగ్య సాంకేతికత, వ్యవసాయ సాంకేతికత, రోబోటిక్స్, డేటా విశ్లేషణ వంటి రంగాల్లో యువత స్టార్టప్‌లను ప్రారంభిస్తున్న ఉదాహరణలు పెరుగుతున్నాయి. ఈ స్టార్టప్ వ్యవస్థలో ఒక ముఖ్యమైన అంశం సమస్యలను పరిష్కరించే దృష్టికోణం. ఉదాహరణకు రైతులకు పంటల సమాచారాన్ని అందించే యాప్‌లు, వైద్య పరీక్షలను సులభం చేసే డిజిటల్ పరికరాలు, లేదా చిన్న వ్యాపారాల నిర్వహణను సులభం చేసే సాఫ్ట్‌వేర్‌లను యువత అభివృద్ధి చేస్తోంది. ఈ విధంగా స్టార్టప్‌లు కేవలం వ్యాపారాలు మాత్రమే కాకుండా సామాజిక సమస్యలకు పరిష్కారాలను కూడా అందించడానికి ప్రయత్నిస్తున్నాయి. అయితే స్టార్టప్ వ్యవస్థలో సవాళ్లు కూడా ఉన్నాయి. చాలా స్టార్టప్‌లు ప్రారంభంలో ఉత్సాహంగా ప్రారంభమైనా కొద్ది సంవత్సరాల్లోనే మూతపడే ప్రమాదం ఉంది. దీనికి కారణాలు పెట్టుబడి కొరత, వ్యాపార వ్యూహాల లోపం, లేదా మార్కెట్ అవసరాలను సరైన విధంగా అర్థం చేసుకోలేకపోవడం. అందువల్ల విజయవంతమైన స్టార్టప్‌లకు సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాకుండా నిర్వహణ నైపుణ్యాలు కూడా అవసరం.

# రీల్

## 'ఉస్తాద్ భగత్ సింగ్' ఘన విజయం సాధిస్తుంది



'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయ తరువాత పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కలయికలో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు. శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలు. మార్చి 19న ఈ సినిమా రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం హైదరాబాద్‌లోని పోలీస్ గ్రౌండ్స్‌లో ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా పవన్ క ళ్యాణ్ మాట్లాడుతూ ఉస్తాద్ భగత్ సింగ్ ప్రీ వేడుకకు హాజరైన అభిమానులకు, లైవ్ లో వేడుకను వీక్షిస్తున్న ప్రజలకు నమస్కారాలు. సినిమా నాకు చాలా ఇష్టమైనవి. నాకు అన్నం పెట్టింది సినిమా. ఈరోజు ప్రజలకు సేవ చేసే గుర్తింపు ఇచ్చింది సినిమా. అందుకే నా నిర్మాతలు బాగుండాలని కోరుకుంటాను. సినిమా కోసం ఉత్సాహంగా వచ్చే నా అభిమానులకు ఆనందం కలగాలని కోరుకుంటాను. సినిమా ఎంత వసూలు చేసింది అని నేను ఎప్పుడూ పట్టించుకోను. సినిమా బాగుండాలని కోరుకుంటాను. తెలుగు సినిమా, తమిళ సినిమా అని చూడను.. భారతీయ సినిమా అనుకుంటాను నేను. మన తెలుగు చిత్ర పరిశ్రమ ఆస్కార్ స్థాయికి చేరుకోవడం గొప్ప ఘనత. ఇలాంటి పరిశ్రమలో భాగం కావడం నాకు ఆనందంగా ఉంటుంది. నా వరకు ఒకే ఒక్క హీరో చిరంజీవి. ఆయన పక్కన ఉంటే నేను హీరో అనే సంగతి మర్చిపోతాను. అలాంటి అన్నయ్య చిరంజీవి ఉస్తాద్ భగత్ సింగ్ ట్రైలర్ చూసి ట్వీట్ చేయడం చాలా సంతోషంగా ఉంది. అలాగే ట్వీట్ చేసిన రామ్ చరణ్ కి నా కృతజ్ఞతలు. సినిమా విజయం సాధించాలనే అందరం కలిసి పని చేస్తాం. ఈ ప్రయాణంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటాం. వాటిని తట్టుకొని సినిమా పూర్తి చేయడం చాలా కష్టమైనది. గబ్బర్ సింగ్ తరువాత నేను, హరీష్ శంకర్ చేసిన సినిమా ఇది. మొదట ఒక కథ అనుకున్నాం. తర్వాత కథ మారింది. కోవిడ్ వచ్చింది. వీటన్నింటి మధ్య నేను రాజకీయాల్లోకి వెళ్లి, అక్కడ పదవీ బాధ్యతలు తీసుకోవడం జరిగింది. నాకున్న బాధ్యతలు, విధులకు ఇబ్బంది కలగకుండా.. చాలా తక్కువ సమయంలోనే ఈ సినిమాను పూర్తి చేశాము. 4045 రోజుల్లోనే సినిమా పూర్తి చేశాము. రోజుకి ఐదారు గంటల లోపే పని చేశాను. హరీష్ అంత బాగా ప్లాన్ చేశారు. నాకు సినిమాలు చేయొచ్చు అనే భరోసాను ఇచ్చింది ఉస్తాద్ భగత్ సింగ్. పుష్ప, జనతా గ్యారేజ్, శ్రీమంతుడు వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలను మైత్రి సంస్థ అందించింది. వాళ్లకు వరుస విజయాలు వస్తున్నాయంటే.. దాని వెనుక వారి కష్టం ఎంతో ఉంది. ఉస్తాద్ భగత్ సింగ్ మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను అని పవన్ కళ్యాణ్ అన్నారు. హరీష్ శంకర్ మాట్లాడుతూ 'ముందుగా ఈ సినిమా ఎందుకు ఆలస్యమైంది అనేది నేను మీతో పంచుకుంటాను. మొదట కాలేజ్ బ్యాక్ డ్రాప్ లో ఖుషికి కొనసాగింపు లాంటి కథ అనుకున్నాము. కాలేజ్ సమయంలో ఇగోతో విడిపోయిన ఇద్దరు స్టూడెంట్స్.. అదే ఇగోతో కాలేజ్ లో లెక్చరర్స్ గా జాయిన్ అయితే ఎలా ఉంటుంది అనే ఆలోచనతో కథ అనుకున్నాం. ఆ తరువాత కొన్ని కారణాల వల్ల కథ మార్చడం జరిగింది. కోవిడ్ కూడా కొంత ప్రభావం చూపించింది అన్నారు. ఈ కార్యక్రమంలో కథానాయిక శ్రీలీల, కథానాయిక రాశి ఖన్నా, నిర్మాత నవీన్ యెర్నేని, నిర్మాత రవిశంకర్ యలమంచిలి పాల్గొన్నారు.

## ఇది ఒక ఫ్యామిలీ సినిమా



పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ ఈ నెల 19వ తేదీన థియేటర్‌లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ రాశి సింగ్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్'తో నా కల నెరవేరింది. నా పాత్ర పేరు శ్లోక. తను చాలా మోడరన్ అమ్మాయి. సినిమాలో ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంది. నా పాత్రకు కూడా మంచి క్యారెక్టరైజేషన్ ఉంటుంది. నాకు ఇందులో ఒక మాస్ సాంగ్ ఉంది. నాకు డ్యాన్స్ అంటే ఇష్టం కాబట్టి, ఆ సాంగ్ షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాను. నేను ఐఎఎస్ ఆఫీసర్ కావాలనుకున్నానని ఆయనతో చెప్పాను. ఆయన తక్కువ మాట్లాడతారు.. కానీ, ప్రతి మాటలో విలువ ఉంటుంది. నాతో ప్రజా సేవ చేయమని చెప్పారు. హరీష్ శంకర్ చాలా స్మార్ట్. ఆయనకు మాస్ పల్స్ బాగా తెలుసు. సాధారణంగా 120 రోజులు పట్టే షూటింగ్‌ను ఆయన కేవలం 40 రోజుల్లోనే పూర్తి చేశారు. సరిగా నిద్ర కూడా పోకుండా సినిమా కోసం ఎంతో కష్టపడ్డారు. షూ టింగ్ సమయంలో సెట్‌లోనే పంచ్ డై లాగ్స్ రాసి ఇస్తుంటారు. హరీష్ కి ఓపిక ఎక్కువ. సినిమా పట్ల ఆయన అంకితభావ ం చూసి చాలా నేర్చుకున్నాను. శ్రీశ్రీ లకు నాకు కలిసి సన్నివేశాలు లేవు. ప్రతి పాత్ర దేనికదే ప్రత్యేకంగా ఉంటుంది. నా పాత్రలో కూడా మంచి వేరియేషన్స్ ఉంటాయి. పవన్ కళ్యాణ్ షెడ్యూల్స్ ఎలా ఉంటాయో చెప్పలేమని హరీష్ ముందే చెప్పారు. అందుకు తగ్గట్టుగా నేను అడ్జస్ట్ చేసుకుంటాను అని చెప్పాను. కొన్నిసార్లు పగలు రాత్రి తేడా లేకుండా 24 గంటల షిఫ్టులు కూడా పని చేశాను. ఈ సినిమా గబ్బర్ సింగ్' లాగే ఈ సినిమా కూడా చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది. ఇది ఒక ఫ్యామిలీ సినిమా, అందరూ కలిసి థియేటర్‌లో చూడొచ్చు. హిందీలో అక్షయ్ కుమార్‌తో ఒక సినిమా, 'ఫర్జీ 2' షో చేస్తున్నాను. అమెజాన్ సిరీస్ లో ఒక పంజాబీ పోలీస్ క్యారెక్టర్ చేస్తున్నాను, అందులో నా డైలాగ్స్ అన్నీ పంజాబీలోనే ఉంటాయి. తమిళ్ లో 'రౌడీ అండ్ కో' చేస్తున్నాను. తెలుగులో కూడా కొన్ని కథలు వింటున్నాను.

## ఎమోషనల్ డ్రామాగా విశ్వనాథ్ అండ్ సన్స్

సూర్య ప్రధాన పాత్రలో నటిస్తు న్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా టీజర్ విడుదలైంది. ఈ టీజర్ ద్వారా సంజయ్ విశ్వనాథ్ అనే పాత్ర ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. టీజర్‌లో సంజయ్ వి శ్వనాథ్ అనే అంతర్జాతీయ పిస్టల్ షూటర్ పాత్రను చూపించారు. 40 ఏళ్ల వయసులో కూడా తన కలలను వదలకుండా ముందుకు సాగుతున్న వ్యక్తిగా అతడిని పరిచయం చేశారు. సూర్య ఈ సినిమాలో తండ్రి ప్రేమ, భావోద్వేగ లోతు రెండూ కలిసిన ఒక గాఢమైన పాత్రలో కనిపిస్తున్నారు. ఆయన తెరపై కనిపించిన తీరు, వెంకీ అట్లూరి రాసిన ప్రభావవంతమైన సంభాషణలు.. సూర్య సినీ ప్రయాణంలో చిరస్థాయిగా నిలిచిపోయిన అద్భుతమైన ప్రదర్శనలను గుర్తు చేస్తున్నాయి.కథకు కొత్తదనాన్ని జోడించే పాత్రలో మమితా బైజు కనిపిస్తున్నారు. ఆమె పాత్ర సినిమాలో ఉత్సాహం, చురుకుదనం తీసుకొస్తుందని టీజర్ సూచిస్తోంది. వయస్సు అంతరం ఉన్న అసాధారణ ప్రేమకథను కూడా ఈ సినిమా చూపించబోతున్నట్టు టీజర్‌లో చూచాయగా తెలిపారు. సున్నితమైన భావోద్వేగాలతో అందమైన కథ చెప్పడం వెంకీ అట్లూరి శైలి. తనదైన ప్రత్యేక శైలి రచనతో.. ఈ అంశాన్ని కూడా లోతుగా, భావోద్వేగ పరిపక్వతతో మధురానుభూతిని కలిగించేలా చూపిస్తారు అనడంలో సందేహం లేదు.'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్ర సాంకేతిక విలువలు ఉన్న స్థాయిలో ఉండబోతున్నాయని టీజర్‌తో స్పష్టమైంది. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన శక్తివంతమైన నేపథ్య సంగీతం, విజువల్స్‌ను మరింత ఎలివేట్ చేసింది. 'విశ్వనాథ్ & సన్స్' చిత్రం ఈ ఏడాది జూలైలో ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ చిత్రానికి జీవి ప్రకాష్ సంగీతం అందిస్తున్నారు.




## నమోరే సాంగ్ విడుదల



పాన్‌ఇండియా సినిమా 'నాగబంధం' నుంచి ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన నమోరే పాట విడుదలైంది. దర్శకుడు అభిషేక్ నామా తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని కిషోర్ అన్నపరెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్నారు. విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, కళాత్మక సంపదను ప్రతిబింబించేలా రూపొందుతోంది. తాజాగా విడుదలైన నమో రే పాట భక్తి యుగానికి శ్రీకారం చుట్టింది. శ్రీమహా విష్ణువుకు అంకితంగా రూపొందిన ఈ పాట భక్తి, ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మిక అనుభూతిని అద్భుతంగా చూపించింది. ఈ సాంగ్‌కు జునైద్ కుమార్, అభే అద్భుతమైన మ్యూజిక్ అంది ంచారు. క్లాసికల్ టచ్తో పాటు మోడరన్ మ్యూజిక్ స్టైల్ను కలిపి గొప్ప అనుభూతిని ఇచ్చారు. శ్రీహర్ష ఈమని లిరిక్స్‌లో భక్తి భావం అద్భుతంగా వినిపిస్తుంది. గాయకు లు సింధుజా శ్రీనివాసన్, ఐశ్వర్య దారూరి పాడిన విధానం పాటకు మరింత బలాన్ని ఇచ్చింది. కొరియోగ్రఫీ. ప్రముఖ కొరియోగ్రాఫర్లు గణేశ్ ఆచార్య, శ్రష్టి వర్మ నేతృత్వం లో దాదాపు రెండు వేల మందికి పైగా డ్యాన్సర్లు వివిధ భారతీయ నృత్యాలతో అద్భుతమై న విజువల్ ట్రీట్ ఇచ్చారు. హీరోయిన్లు నభా నటేశ్, దక్ష నాగార్కర్ క్లాసికల్ డ్యాన్స్‌తో సాంగ్ మార్చారు. ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని అచ్చంగా గుర్తుకు వచ్చేలా ఒక అద్భుతమైన సెట్ రూపొందించారు. తిరువనంతపురంలోని అసలు ఆలయంలోనే షూట్ చేసినట్టుగా అనిపించేంత ఖచ్చితంగా ఈ సెట్ను తయారు చేశారు. సినిమాటోగ్రాఫర్‌గా సౌందర్ రాజన్ పని చేశారు.

## బైకర్ మ్యూజిక్ కొత్తగా ఉంటుంది : జిబ్రాన్



శర్వా హీరోగా నటిస్తున్న స్పోర్ట్స్ డ్రామా బైకర్. మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 3న ఈ సినిమా థియేటర్‌లలోకి రానుంది. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ జిబ్రాన్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు సాహో తర్వాత ఒక మంచి కం బ్యాక్ ఫిలిం కోసం ఎదురు చూస్తున్నాను. ఆ సమయంలో యువి క్రియేషన్స్ వంశీ ఈ ప్రాజెక్టు గురించి చెప్పారు. తర్వాత దర్శకుడు అభిలాష్‌ని కలిశాను. ఆయనతో నాకు చాలా విషయాల్లో సిమిలారిటీస్ అనిపించాయి. ఆయన కథ చెప్పినప్పుడు ఇది ఖచ్చితంగా నాకు మంచి కం బ్యాక్ ఫిలిం అవుతుందని బలంగా అనిపించింది. స్క్రిప్ట్ చాలా అద్భుతంగా ఉంది. ఎమోషన్ చాలా స్ట్రాంగ్గా ఉంటుంది. శర్వా రన్ రాజా రన్ సినిమాతోనే నేను ఇక్కడ మ్యూజిక్ డైరెక్టర్గా పరిచయం అయ్యాను. ఇప్పుడు మళ్లీ ఈ సినిమాతో ఆయనతో పని చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా నాకు మంచి కం బ్యాక్ ఇస్తుందని నమ్ముతున్నాను. ఈ సినిమా మేకింగ్ ఒక హాలీవుడ్ లెవెల్లో ఉంటుంది. దర్శకుడు అభిలాష్ గారి ఆలోచన కూడా అదే. ఇందులో కేవలం రేసింగ్, యాక్షన్ మాత్రమే కాదు, చాలా స్ట్రాంగ్ ఎమోషనల్ ఫ్యామిలీ కంటెంట్ కూడా ఉంది. సినిమా మొత్తం చాలా అద్భుతంగా వచ్చింది. ముఖ్యంగా రేసింగ్ సన్నివేశాలు ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ అనుభూతి ఇస్తాయి. బైక్ రేసింగ్ గురించి పెద్దగా తెలియని వారికి కూడా ఈ సినిమాలో చూపించిన రేసింగ్ చాలా ఎక్సైటింగ్గా అనిపిస్తుంది. అలాగే తండ్రికొడుకు మధ్య ఉండే ఎమోషన్ కూడా చాలా బాగా చూపించారు. యూత్తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ కూడా ఈ సినిమాను ఇష్టపడతారు . రేసింగ్ బ్యాక్డ్రాప్లో వచ్చే సినిమాలు అంటే చాలా మంది హాలీవుడ్ సినిమాలతో పోల్చుతారు. ఎక్కడికి వెళ్లినా ఎఫ్ 1 లాంటి మ్యూజిక్ చేయమని అడిగేవారు. నిజానికి ఈ సినిమా అనుకున్నపుడు ఎఫ్ 1 ఇంకా రాలేదు.

## హోటళ్లపై ఆకస్మిక తనిఖీ

40 డొమెస్టిక్ సిలిండర్లు పట్టివేత

**ప్రజాపక్షం/అచ్చంపేట :** ఆదివారం రాత్రి సివిల్ సప్లై అధికారుల ఆధ్వర్యంలో అచ్చంపేట తహసీల్దార్ సైదులు ఆకస్మికంగా దాడి చేసి 40 సిలిండర్లు పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలో ఆదివారం సివిల్ సప్లై అధికారుల ఆధ్వర్యంలో హోటళ్లలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో డొమెస్టిక్ సిలిండర్లను గుర్తించారు. అవి ఎక్కడి నుంచి వచ్చాయి అనే వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఒకవేళ ఇచ్చినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని ఏజెన్సీలు ఇచ్చినట్లయితే గ్యాస్ డీలర్లు ఇచ్చినట్లయితే వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అలాగే గ్యాస్ సిలిండర్ గోదామును పరిశీలించగా 300 సిలిండర్లు తక్కువ ఉన్నట్లు తెలిపారు. వీరిపై సివిల్ సప్లై అధికారులకు తెలుపనున్నట్లు ఆయన తెలిపారు.

## కలెక్టర్‌కు తపస్ స్వాగతం



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘ జిల్లా శాఖ పక్షాన పూల మొక్క, తపస్ డైరీ, బాధ్యతలు స్వీకరించి మొదటి సంతకం చేస్తున్న చిత్రపటం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంలో నారాయణపేటను అగ్రస్థానంలో నిలుపుటకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కోరారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన చిత్రపటాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి షేర్ కృష్ణా రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరసింహ, రవీందర్, జిల్లా నాయకులు సీతారాములు, శ్రీనివాస్‌రెడ్డి, మండల స్థాయి నాయకులు, చిన్న నరసింహులు, అశోక్‌రెడ్డి, జగదీష్, వెంకటేశ్, భాస్కర్ పాల్గొన్నారు.

## యుద్ధంతో వినాశనం.. శాంతితో అభివృద్ధి




**ప్రజాపక్షం/పానుగల్ :** యుద్ధంతో వినాశనం శాంతితో అభివృద్ధి చెందుతుంది, ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దాడులను వెంటనే ఆపాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కళావతమ్మ, ఉపసర్పంచు కృష్ణవేణి విమర్శించారు. పానుగల్ అంబేద్కర్ చౌక్‌లో ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దాడులు ధరల పెరుగుదల, నరేంద్ర మోడీ వైఫల్యంపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దాసోహంతోనే ఇరాన్‌పై భీకర దాడులు, ప్రాణనష్టం, గ్యాస్ ధరల పెరుగుదలకు కారణమని అన్నారు. సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్, పానుగల్ మండల కార్యదర్శి దంగు కుర్మయ్య, మాజీ కార్యదర్శి కాకం బాలస్వామి, వార్డు సభ్యులు కురుమయ్య, లక్ష్మి, సహదేవుడు, నేతలు చిన్న కుర్మయ్య, చెన్నమ్మ, మల్లెపు బాలస్వామి, సాయిలీల తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధించిన పంచాయతీ



**ప్రజాపక్షం/నర్వ :** మండల పరిధిలోని ఉందేకోడు గ్రామంలో ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉంది. ఈ నిషేధాన్ని గ్రామపంచాయితీ ఆమోదించడం జరిగింది. వ్యాపారస్తులు ప్లాస్టిక్‌ని నిషేధించాలని గ్రామ సర్పంచ్ జగన్నాథ్ గ్రామ సెక్రటరీ సత్యనారాయణ గ్రామపంచాయితీ తీర్మానం చేయడం జరిగింది. కిరాణం, టీ స్టాల్, హోటల్స్, చికెన్ సెంటర్, కూర దుకాణాలు, ప్లాస్టిక్ కవర్లను ఎవరు వాడకూడదని దుకాణా యజమానులకి అవగాహన కల్పించారు. ఈ నెల లాస్ట్ వరకే ఛాన్స్ ఇస్తున్నట్లు వచ్చే నెల ఏప్రిల్ ఫస్ట్ నుండి పూర్తిగా నిషేధించాలని ఆ తర్వాత ప్లాస్టిక్ వాడితే రూ.500 నుండి రూ.1000 జరిమానా విధించబడునని అదేవిధంగా ప్రతి ఒక్క షాపు లైసెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలని పంచాయితీ సెక్రెటరీ స్పష్టం చేశారు. సర్పంచ్ జగనాథ్ మాట్లాడుతూ వారం సంతలో వారు కూడా రుసుము చెల్లించాలని గ్రామసభలో స్పష్టం చేశారు. గ్రామ పంచాయితీ తీర్మానం ప్రకారం ప్లాస్టిక్ నిషేధించాలని సర్పంచ్, ఉపసర్పంచ్ రాజు వివిధ దుకాణాల యాజమానులు పాల్గొన్నారు.

## రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా సరఫరా చేయాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శివ శంకర్ ఆగ్రో ట్రైడర్స్ ఫర్టిలైజర్స్ షాప్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం వారికి పెద్దపీట వేస్తోందన్నారు. ఎరువుల స్టాక్ వివరాలను ప్రతి రోజు బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలని స్టాక్ బోర్డు ప్రకారం కచ్చితంగా నిల్వలు ఉండాలన్నారు. స్టాక్ లెక్కలలో తేడా వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాక్ వివరానలు కచ్చితంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలనీ, ఎరువుల ధరలు ప్రభుత్వ నియమాల ప్రకారం ఉండాలన్నారు. అన్ని విక్రయాలు ఈ పాస్ యంత్రం ద్వారా మాత్రమే జరగాలని, లైసెన్స్ లేకుండా ఎరువుల అమ్మకాలు జరగకూడదని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తరచూ పెస్టిసైడ్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, రైతులకు ఎరువుల కొరత ఏర్పడకుండా క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ బస్తీ దవాఖానాను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. అంతకు ముందు గోనుపాడు శివారులో కలెక్టర్ పొలాలను సందర్శించిన పంటల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడారు. డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రేషన్ పకడ్బందీగా చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, మండల వ్యవసాయాధికారి ప్రతాప్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/మక్తల్ :** ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని తమకు చేతనైనంత ఇతరులకు సహాయం అందించడం గొప్ప వరంగా భావించాలని రాష్ట్ర పశుసంవర్థక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మక్తల్ పట్టణంలోని గాంధీ చౌక్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బురాన్ ఆధ్వర్యంలో 30 మంది మున్సిపల్ వర్కర్లకు దుస్తుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి బురాన్‌తో కలిసి మున్సిపల్ వర్కర్లకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ప్రత్యేకంగా నిరుపేదలకు తన వంతు సహాయం అందజేస్తున్న బురాన్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. సేవ చేయడం కూడా అదృష్టంగా భావించాలని అన్నారు. ఇచ్చే శక్తి గుణం ఉన్నప్పటికీ తీసుకునే వారు కూడా ఉంటేనే దానం చేసే అవకాశం లభిస్తుందన్నారు. రంజాన్ మాసంలో దానం చేయడం అనేది గొప్ప అవకాశంగా భావిస్తారని గత కొంతకాలంగా బురాన్ ఈ కార్యక్రమం చేపట్టడం ఎంతో అభినందనీయమని అన్నారు. 30 మందికి దుస్తుల పంపిణీ చేయడం పట్ల ప్రత్యేకంగా మంత్రి బురాన్‌ను అభినందించారు. రంజాన్ పండుగను ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో సంతోషాల మధ్య ఘనంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హన్మంతు, 13వ వార్డు కౌన్సిలర్ సరిత గోవింద్ రావు, కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్ కుమార్ గుప్తా, గోవిందరావు, గోవర్ధన్, కావలి తాయప్ప, వల్లంపల్లి లక్ష్మ ణ్, ఎఎంసి డైరెక్టర్ అంజి తదితరులు పాల్గొన్నారు.



## నారాయణపేట జిల్లా నూతన కలెక్టర్‌గా ప్రతీక్ జైన్ బాధ్యతలు

**ప్రజాపక్షం/నారాయణపేట :** సోమవారం ఇక్కడి కలెక్టరేట్ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, ట్రైని కలెక్టర్ ప్రణయ్ కుమార్, ఏవో శ్రీధర్, జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు, నోట్ పుస్తకాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## సిలిండర్లు బ్లాక్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు : ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** వంట గ్యాస్ సిలిండర్లను ఎవరైనా బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అక్రమాలకు పాల్పడిన డీలర్ల డీలర్ షిప్పులను రద్దు చేయిస్తామని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని జైలుకు పంపుతామని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్ రెడ్డి హెచ్చరించారు. యుద్ధ నేపథ్యంలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడిందని సిలిండర్ల కొరతపై జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు, ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులతో ఫోన్లో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వంట గ్యాస్ సిలిండర్లకు కొరత అంటూ ఏమీ లేదని, సిలిండర్లను బుక్ చేసిన వారందరికీ వాటిని సరఫరా ఎమ్మెల్యేకు చెప్పారు. ప్రజలు కూడా సిలిండర్లను బ్లాక్‌లో కొనుగోలు చేసినట్లయితే దానికి సంబంధించిన ఆధారాలు తనకు నేరుగా పంపాలని, వాటిని తాను అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్రమాలకు పాల్పడిన డీలర్లపై చర్యలు తీసుకునేలా చూస్తానని అనిరుధ్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# యుద్ధం వల్ల సామాన్య ప్రజలపై ఆర్థిక భారం

సిపిఐ జిల్లా కౌన్సిల్ మెంబర్ పెబ్బేటి విజయుడు



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని, యుద్ధం వల్ల సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతుందని సిపిఐ జిల్లా కౌన్సిల్ మెంబర్, మాజీ సర్పంచ్ పెబ్బేటి విజయుడు అన్నారు. భారతదేశంలో ఎల్పిజి గ్యాస్, డీజిల్ పెట్రోల్ కొరత నివారించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సోమవారం సిపిఐ పార్టీ నాయకులు పెబ్బేటి విజయుడు అధ్యక్షతన కొల్లాపూర్ పట్టణం ఎన్టీఆర్ చివరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కౌన్సిల్ మెంబర్ పెబ్బేటి విజయుడు మాట్లాడుతూ ఎల్పిజి గ్యాస్ బుక్ చేసుకున్న ప్రతి భారతదేశం పౌరుడికి సిలిండర్ ఇవ్వాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో గ్యాస్ గోదాములను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆర్. ఇందిరా, సిపిఐ కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, కొల్లాపూర్ పట్టణ సిపిఐ కార్యదర్శి ఎండి యూసుఫ్, కల్వకోల్ సిపిఐ కార్యదర్శి సంఘం కృష్ణ, కోడేరు మండల్ సిపిఐ కార్యదర్శి తపెపెట కిరణ్ కుమార్, సిపిఐ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల కష్టార్జితం కాంట్రాక్టర్ జేబుల్లోకి



కార్మికులకు అన్యాయం చేస్తున్న సాయి సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీపై చర్య తీసుకోవాలి

తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికుల కష్టార్జితం కార్మికులకు చెందకుండా ఏజెన్సీ కాంట్రాక్టర్లు దళారుల జేబుల్లోకి వెళుతున్నాయని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) కార్యదర్శి పి.సురేష్ మండిపడ్డారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు అందించాలని, కార్మికుల పొట్టలు కొడుతున్న సాయి సెక్యూరిటీ ఏజెన్సీని రద్దు చేయాలని, వైద్యశాఖ అధికారులు ఏజెన్సీ నిర్వాహకుల వేధింపులు ఆపాలని, కార్మికులను అక్రమ తొలగింపులు ఆపాలని, ఆసుపత్రి 600 పడకల సామర్థ్యాన్ని కనుకొనగా కార్మికుల సంఖ్యలు పెంచి పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరకి ఆయన చాంబర్లో పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ కార్మికులు సమ్మె నోటిస్ అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రుల పని చేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులు జీతభత్యాల కోసం ఒక్కో కార్మికునికి రూ.15600 ఖర్చు చేస్తున్నదని దీనికి అనుగుణంగా జీవో నెంబర్ 60 ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. వాస్తవంగా కార్మికుని బేసిక్ వేతనం రూ.13,600 చెల్లించాలని జీవో 60 చెబుతున్న వైద్యశాఖ అప్పటి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్మికునికి రూ.12,093 బేసిక్ వేతనం, రూ.3033 ప్రావిడెంట్ ఫండ్, రూ.489 ఈఎస్ఐ చెల్లించాలని ప్రత్యేక సర్క్యులర్ విడుదల చేసిందని కనీసం దీని ప్రకారం కూడా ఆసుపత్రి కార్మికులకు వేతాలు అందడం లేదని వాపోయారు. సాయి సెక్యూరిటీ ఏజెన్సీ అగ్రిమెంట్ ప్రకారం కార్మికుల సంఖ్య లేరని వస్తున్న ఆరోపణల పై సమగ్ర విచారణ జరిపి బహిర్గతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నేతలు కార్మికులు బి. చెన్నయ్య, మొగులయ్య, బాలరాజ్, అంజి, నైసస్, యాదయ్య, గోపాల్, నరేష్ వెంకటన్న, బాలరాజ్, కృష్ణ, కొండయ్య, పద్మ, వరలక్ష్మి, సునీత, లక్ష్మి, కవిత, సాయమ్మ,నిర్మల, సంధ్య, అంజమ్మ, సవిత, ఇందిరా, సునీత, లక్ష్మ మ్మ, జ్యోతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

సిపిఐ నియోజవకవర్గ ఇంచార్జీ పులిజాల పరశురాములు




**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం ఉదయం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెంచిన వంట గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ పులిజాల పరశురాములు మాట్లాడుతూ యుద్ధం వలన వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి గ్యాస్ సిలిండర్ దొరకడం లేదు. యుద్ధం పేరుతో నిత్యవసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచారు. ప్రజలు అవసరాలు దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెరిగే ధరలను అదుపు చేసి యుద్ధాన్ని ఆపేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ అనితకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి దార దాసు, సిపిఐ మండల నాయకులు నేరటి రాజు, వడ్డేమాన్ యేసు, శివుడు, వానరాశి శివ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## కళ్లకు గంతలతో సిపిఐ వినూత్న నిరసన




**ప్రజాపక్షం/వనపర్తి :** దేశంలో గ్యాస్ కొరతతో ప్రతిచోట ఖాళీ సిలిండర్ల క్యూలైన్లు కనిపిస్తున్నా గ్యాస్ కొరతలేదని కేంద్రం చెబుతోందని, గుడ్డి ప్రభుత్వమా కళ్లు తెరిచి నిజం చూడాలని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ డిమాండు చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సిపిఐ వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గ్యాస్ కొరత లేదని బుకాయిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా కళ్లకు నల్లని గంతలు కట్టుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా గౌరవ అధ్యక్షురాలు కళావతమ్మ, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, పట్టణ కన్వీనర్ జయమ్మ, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం, జిల్లా అధ్యక్షుడు చిన్నకురుమన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వీనాదం, డిహెచ్‌సిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ, శిరీష, జ్యోతి, రూప, సాయిలీల, వెంకటయ్య, సుప్రియ, కురుమూర్తి, కృష్ణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

ప్రజావాణికి 165 ఫిర్యాదులు

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను ప్రాధాన్యతనిచ్చి పెండింగ్‌లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 165 పిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ లకు విన్నవించారు. జిల్లా కలెక్టర్ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలు శ్రద్ధగా విని సంబంధిత అధికారులతో మాట్లాడి ఎండార్ చేస్తూ ఫిర్యాదులు పరిష్కారం చేయాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ సి.ఎం కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులు, ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ కు అందిన పెండింగ్ ఫిర్యాదులు శాఖల వారీగా సమీక్షించారు. మూడు నెలల కు మించి పెండింగ్‌లో నున్న ఫిర్యాదులు అన్ని వెంటనే పరిష్కరించాలని, గత ప్రజావాణి లో కూడా జిల్లా కలెక్టర్ సమీక్షించి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాం రెడ్డి, జిల్లా పరిషత్ సిఈ.ఓ వెంకట్ రెడ్డి, డి.ఆర్.డి.ఓ. నరసింహులు, ఆర్డీఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



**ప్రజాపక్షం/నారాయణపేట :** నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద రూ.55 కోట్ల నిధులతో కొనసాగుతున్న నూతన కలెక్టరేట్ భవన సముదాయ నిర్మాణ పనులను సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. అంతకుముందు జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ప్రతీక్ జైన్ అక్కడి నుంచి నేరుగా కొత్త కలెక్టరేట్ భవన సముదాయం వద్దకు వెళ్లి ఇప్పటిదాకా జరిగిన నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనుల గురించి ఆర్అండ్‌బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆయన సూచించారు. భవన సముదాయ నిర్మాణ పనులతో పాటు బయట రోడ్లు, ఇతర పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రధాన రహదారికి కలెక్టరేట్ భవన సముదాయం వరకు మొరం మట్టి లెవెల్ చేయాల్సిన ఉందని ఆర్అండ్‌బిఈఈ వెంకటరమణ కలెక్టర్‌కు తెలిపారు. ఎస్టిమేట్ కంటే అదనంగా నిధులు అవసరం అవుతాయని అధికారులు కలెక్టర్‌కు తెలపగా ముందే ఎస్టిమేట్‌లో అదనపు నిధుల అవశ్యకత ను పొందుపర్చాల్సి ఉండేదని ఆయన సూచించారు. భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జరుగుతున్న పనులను కూడా కలెక్టర్ ను పరిశీలించారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, ఆర్అండ్‌బిఈఈ వెంకటరమణ, డీఈ రాములు, ఏఈ, తదితరులు ఉన్నారు.

# తల్లిదండ్రులు ఆస్తులను కండీషన్ గిఫ్ట్ డీడ్ చేయాలి

జిల్లా ఎస్పీ సునిత రెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి :** వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయములో నిర్వహించే ప్రజావాణిలో భాగంగా జిల్లాలో సోమవారం వివిధ ప్రాంతాల నుండి 7మంది ఫిర్యాదుదారులు వివిధ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీ సునిత రెడ్డికి ఫిర్యాదులు అందించారు. ప్రతి ఫిర్యాదుపై వనపర్తి ఎస్పీ స్పందించి స్వయంగా ఫిర్యాదును పరిశీలించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు తక్షణమే చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తరచూ వృద్యాపంలో తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఫిర్యాదులు వస్తున్నందున తల్లిదండ్రులు తమ ఆస్తులకు పిల్లలకు ఇవ్వాలనుకుంటే సాధారణ గిఫ్ట్ డీడ్ కంటే కండిషన్ గిఫ్ట్ డీడ్ ద్వారా ఇవ్వడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఈ డీడ్‌లో తల్లిదండ్రులను చూసుకోవడం వంటి షరతులు నమోదు చేయవచ్చు. భవిష్యత్తులో వృద్ధాప్యంలో వివాదాలు రాకుండా ఉండేందుకు దీనిని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చట్టబద్ధంగా నమోదుచేయించడం అవసరమని ఎస్పీ తెలిపారు. ఈరోజు ప్రజావాణిలో మొత్తం 7 ఫిర్యాదుల్లో 2 భూతగాదాల ఫిర్యాదులు, 5 ఇతర ఫిర్యాదులు ఉన్నాయి.

## హామీలు వెంటనే అమలు చేయాల్సిందే

**ప్రజాపక్షం/కృష్ణ :** బిజెపి రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు సేవ్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా బిజెపి కృష్ణ మండల శాఖ ఆధ్వర్యంలో నల్లే నర్సప్ప అధ్యక్షతన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీలు 420 హామీలు ఇచ్చి విస్మరించిన సందర్భంగా వెంటనే హామీలు అమలు చేయాలని కృష్ణ మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు జి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దండు రాఘవేంద్ర, మాజీ ఎంపీటీసీ కొంకల్ వెంకటేశ్, చేగుంట సర్పంచు సంజీవ్‌రెడ్డి గౌడ, ఉపసర్పంచు విజయ్ గౌడ, మండల ఉపాధ్యాక్షులు డీకే కిష్టప్ప, మాజీ సర్పంచు గుంతల్ హన్మంత్రాయ, సీనియర్ నాయకులు జెంసేర్ నర్సింగప్ప, నర్సింహాచారి, కార్యదర్శి గురువు మల్లేష్, టీ.బాలరాజ్, మాజీ ఉపసర్పంచులు బి.శంకరప్ప, కుమ్మరి తిమ్మప్ప, నల్లే సాయిబాన్న, తాయప్ప గౌడ్, జింకల్ నాగప్ప, మాల దేవిందరప్ప, బాలు, బూత్ అధ్యక్షులు పంతిగి చిన్న, మనివర్ధన్, జనార్ధన్ గౌడ్, అలిగేరి శివాజి, పల్లె రమేష్, జాల తిప్పయ్య, కున్సీ కర్రెప్ప, కంద్రాయ్ రాజు, కావాలి బస్వరాజ్, గుండెల మహేష్ పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో అంగన్‌వాడీ టీచర్లు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ధర్నాలో పాల్గొనేందుకు వీపనగండ్ల మండలంలోని వివిధ గ్రామాల నుండి బయలుదేరిన అంగన్‌వాడీ సిబ్బందిని పోలీసులు ఆపి వీపనగండ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల నాయకుడు ఆశన్నతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను అదుపులోకి తీసుకోవడం అన్యాయమని అన్నారు. అక్రమ అరెస్టులతో తమ డిమాండ్ పోరాటాలను ఆపలేరని, ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.



## నాణ్యమైన వైద్య సేవలందించాలి

మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్‌రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట** : రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ప్రముఖ వ్యాపారవేత్త గుర్రం సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వేద కిడ్నీ సూపర్ స్పెషాలిటి హాస్పటల్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. జిల్లా కేంద్రం ఏర్పాటుతో సూర్యాపేట విద్య, వైద్య, వ్యాపార హబ్‌గా మారిందన్నారు. పేదలకు సుదూర ప్రాంతాలకు వెళ్ళకుండా అన్ని వసతులతో ఆసుప్రతి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అతి తక్కువ ఖర్చుతో అత్యాధునిక వసతులతో మెరుగైన సేవలందించి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, ఉప్పల ఆనంద్, డాక్టర్లు సాయి కుమార్ రెడ్డి, ప్రవళిక రెడ్డి పాల్గొన్నారు. రోగులకు మెరుగైన సేవలందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, ప్రముఖ వ్యాపార వేత్త సంకినేని కృష్ణారావులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వేద కిడ్నీ స్పెషాలిటి ఆసుపత్రిని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, గునగంటి హేమసతీష్, ఆయూబ్‌ఖాన్, చింతమల్ల రమేష్, ధరావత్ వీరన్న నాయక్, రాచకొండ శ్రీను, రాంబాబు, అబ్దుల్ రహీం, వాసుదేవరావు, నాగెల్లి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, వివిధ శాఖలలో చాలాకాలం పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై శాఖలవారీగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రస్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలన్నారు. ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫైల్స్ అన్ని సక్రమంగా ఉంచుకోవాలని, ప్రతి కార్యాలయ సిబ్బంది అటెండెన్స్ తప్పనిసరిగా ఫేస్ రికగ్నేషన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కలెక్టరేట్‌లోని ప్రతి కార్యాలయాన్ని సందర్శిస్తానని ఫైల్ సరిగా లేకపోయినా, శుభ్రంగా ఉండని కార్యాలయాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 68 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి సిఇఓ శిరీష, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్, డిఇఓ అశోక్, సంక్షేమ అధికారులు నర్సింహారావు, నరసింహ, శంకర్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాలు దేశానికి పట్టుగొమ్మలు : ఎస్‌పి



**ప్రజాపక్షం/తుంగతుర్తి** : గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాలు శాంతియుతంగా ఉండాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్నారం గ్రామంలో సామాజిక భద్రతపై తుంగతుర్తి పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి ముఖ్య అతిధిగా హాజరై సామాజిక భద్రత, సమస్యలపై అవగాహన కల్పించారు. గ్రామాలు శాంతియుతంగా ఉంటేనే త్వరితగతిన అభివృద్ధి చెందుతాయన్నారు. స్థానికంగా ఉన్న చిన్న చిన్న సమస్యలను గ్రామ స్థాయిలోనే ఆదిలోనే పరిష్కరించుకోవాలని క్షణికావేశంలో తప్పులకు, నేరాలకు పాల్పడవద్దని కోరారు. ఉద్యోగ, ఉపాధి కల్పనలో యువతకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పోలీసు ఉద్యోగాలకు సిద్ధం అవుతున్న యువతకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ డిఎస్‌పి ప్రసన్నకుమార్, గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాస్‌రెడ్డి, తుంగతుర్తి సిఐ నరసింహారావు, స్థానిక ఎస్‌ఐ క్రాంతికుమార్, మద్దిరాల ఎస్‌ఐ వీరన్న పాల్గొన్నారు.

## జనావాసాలు ఉన్న ప్రాంతాలను కూడా బ్లాక్ చేస్తున్నారు

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసిన వడాయిగూడెం సర్పంచ్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భువనగిరి మండలం వడాయిగూడెం గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ నీల శిరీష ఓంప్రకాశ్ గౌడ్ సోమవారం హైదరాబాద్‌లో శాసనమండలి సభ్యులు తీన్మార్ మల్లన్ని మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలోని సర్వే నంబర్ 518 భూములకు సంబంధించిన వివాదాలపై ఆయనకు వినతి పత్రం సమర్పించారు. సర్వే నంబర్ 518లో కేవలం 20 ఎకరాల భూదాన్ భూమి ఉంటే, మొత్తం 467 ఎకరాలను నిషిద్ధ జాబితాలో పెట్టడం వల్ల రైతులు, సామాన్యులు పడుతున్న ఇబ్బందులను మల్లన్నకు వివరించారు. జనావాసాలు ఉన్న ప్రాంతాలను కూడా బ్లాక్ చేయడం వల్ల ఇండ్ల రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయని, దీనిపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సర్పంచ్ వివరించిన సమస్యను సావధానంగా విన్న తీన్మార్ మల్లన్న స్పందిస్తూ భూభారతి లోపాలు, రెవెన్యూ అధికారుల పొరపాట్ల వల్ల పేద ప్రజలు ఇబ్బంది పడటం అన్యాయమని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డు సభ్యులు సుక్కల దుర్గ య్య యాదవ్, ఉమ రమేష్, కోట దీప కోట సుధాకర్, కోట సుధావాణి, గ్రామ నాయకులు బబ్బూరి సాగర్ గౌడ్, రాసాల రాజు యాదవ్, సాంబేష్, మనీష్ గౌడ్ పాల్గొన్నారు.

# పొట్టదశలోనే ఎండిపోతున్న వరి పంటలు

నీటి కోసం రోడ్డెక్కిన రైతులు - మునుగోడులో ఆందోళన

బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుంచి నీళ్లు ఇవ్వాలని ధర్నా -సాగునీరు వచ్చే వరకు ఉద్యమం కొనసాగిస్తాం

రైతు సంఘాల నాయకులు



**ప్రజాపక్షం/మునుగోడు:** నీటి కోసం ఎదురుచూస్తూ చివరి దశకు చేరుకున్న వరి పంటలు కళ్లముందే ఎండిపోతుండటంతో మునుగోడు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్టు ద్వారా మండలంలోని గ్రామాలకు సాగునీరు అందించే వరకు ఉద్యమం ఆగదని రైతు సంఘాల నాయకులు స్పష్టం చేశారు.సోమవారం మండల కేంద్రంలోని తహాసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు,వివిధ పార్టీల నాయకులు ధర్నా నిర్వహించి తహాసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫ్లోరైడ్ సమస్యతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న మునుగోడు ప్రాంత రైతులకు సాగునీరు అందించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు.కూతవేటు దూరంలో కృష్ణా నది పరవళ్లు తొక్కుతున్నా,ఈప్రాంతంలోని పంట పొలాలకు మాత్రం నీటి చుక్క కూడా అందకపోవడం దురదృష్టకరమన్నారు. వందలాది ఎకరాల్లో సాగు చేసిన వరి పంటలు పొట్ట దశలో ఉండగానే నీటి కొరతతో ఎండిపోతున్నాయని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.పంట దిగుబడి ఆశతో రైతులు వేలకు వేలు అప్పులు తెచ్చి సాగు చేస్తే,చేతికి వచ్చే సమయానికి నీళ్లు లేక పంటలు ఎండిపోతూ పశువులకు మేతగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో రైతులు అప్పుల భారంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.ఉదయ సముద్రం ప్రాజెక్టు ప్రారంభ దశలో ఉన్న డిజైన్‌ను గత ప్రభుత్వం మార్చడం వల్ల ఈ ప్రాంతానికి నీళ్లు రాకుండా అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుంచి కిష్టాపురం చెరువుకు కాలువలు తవ్వించి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాగునీరు వచ్చే వరకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు మాజీ సర్పంచ్ గట్టుపల్లి నర్సిరెడ్డి,రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురుజ రామచంద్రం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు, బొల్గూరి నరసింహ,మాజీ జడ్‌పిటిసి జాజుల అంజయ్య గౌడ్, మాజీ ఎంపీపీ పోలగోని సత్యం గౌడ్,బూడిద లింగయ్య యాదవ్, పోలగోని సైదులు గౌడ్,ఈదులకంటి కైలాస్,సాగర్ల మల్లేష్,మందుల బీరప్ప,అయితగొని విజయ్, గజ్జల బాలరాజు,నన్నూరు భూపతి రెడ్డి, గోస్కొండ లింగయ్య, నిమ్మల జగాల్,మాలిగ యాదయ్య, బోయ లింగస్వామి,బోయపల్లి రవి, రైతులు పాల్గొన్నారు.

## కార్యాలయాలు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా...?

జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సి సెక్షన్‌లోని జిల్లా కోశాధికారి కార్యాలయం, జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, ఎన్ఐసి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కార్యాలయం, జిల్లా పంచాయితీ అధికారి, హౌసింగ్ కార్యాలయం, తదితర ప్రభుత్వ కార్యాలయాలను సోమవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాలు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా, ఫైల్స్, పిఆర్ రిజిష్టర్, హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కార్యాలయాల ఫైల్స్ సక్రమంగా, క్రమ పద్ధతిలో ఉండాలని, కార్యాలయాలు పరిశుభ్రంగా ఎలాంటి చెత్తాచెదారం లేకుండా ఉండాలన్నారు. హాజరు, పిఆర్ రిజిష్టర్లు, కార్యాలయాల ఫైల్స్ సక్రమంగా నిర్వహించాలని ప్రతి కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏఓ సుదర్శన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** మతసామరస్యానికి మారుపేరుగా నిలిచిన నల్లగొండ జిల్లాలో మైనార్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని సోమవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సమీపంలోని మదీనా మసీదులో ముస్లిం మైనార్టీ సోదరుల కోసం దావత్‌ఎఇఫ్తార్ కార్యక్రమాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి గతం నుంచే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముస్లిం మైనార్టీలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు.తాము అధికారంలోకి వచ్చిన తరువాత కూడా మైనార్టీల అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. పట్టణంలోని పేద మైనార్టీ మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇవ్వడంతో పాటు 150 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రాబోయే మూడు సంవత్సరాల్లో నిరుపేద ముస్లింలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి అందజేస్తామని,అలాగే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మైనార్టీలకు ఎలాంటి సమస్యలు ఉన్నా మేయర్ లేదా తన దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఆఫీజ్ ఖాన్,డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,గుమ్ముల మోహన్ రెడ్డి ఉన్నారు.

## సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

ఇందిరమ్మ గృహం ప్రారంభించిన ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ



**ప్రజాపక్షం/మర్రిగూడ** : మునుగోడు నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా మర్రిగూడ మండలంలోని సరంపేట నుండి శివన్నగూడెం వరకు ఒక కోటి ఎనభై లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కలిసిశంకుస్థాపన చేశారు.ఆదివారం రాత్రి పలు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని,నాణ్యమైన రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.అనంతరం శివన్నగూడెం గ్రామంలో లబ్ధిదారులు మారపాకల సత్తిరెడ్డివినోద దంపతులు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించారు. నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# నల్లగొండలో గంజాయి ముఠా అరెస్ట్




2 కిలోల గంజాయి స్వాధీనం: నలుగురు అరెస్ట్

నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి వెల్లడి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న నలుగురు సభ్యులతో కూడిన ముఠాను వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి సుమారు రూ.50 వేల విలువైన 2 కిలోల గంజాయి, రెండు మోటార్ సైకిళ్లు, నాలుగు స్మార్ట్ మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి తెలిపారు.సోమవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారని చెప్పారు.ఈక్రమంలో ఈ నెల 15న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో నల్లగొండ పట్టణ శివారు ప్రాంతమైన మునుగోడు రోడ్డులోని గణేష్ నగర్ కాలనీ శ్మశాన వాటిక సమీపంలో కొంతమంది గంజాయి తాగుతూ విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వన్ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆకస్మిక దాడి నిర్వహించి నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు.హైదరాబాద్‌లోని ధూల్‌పేట్ ప్రాంతం నుంచి గంజాయిని అక్రమంగా తెచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి స్థానిక యువత, విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. అరెస్టు అయినవారిని మహమ్మద్ ఫుర్ఖాన్,కారింగుల ప్రదీప్, వల్కీ వినోద్ కుమార్, బైరుగొండ నవీన్‌లుగా గుర్తించినట్లు తెలిపారు.ఈ కేసును చాకచక్యంగా ఛేధించి నిందితులను పట్టుకున్న వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎస్‌ఐలు కే.సతీష్,బి.లచ్చి రెడ్డి,సిబ్బంది లింగారెడ్డి,శ్రీనివాస ప్రసాద్,అంజయ్య,సైదులు లను జిల్లా ఎస్‌పి అభినందించారు.ల

## కలను సాకారం చేయండి...

పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు ఇండ్లు ఇవ్వాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రాష్ట్ర భారీనీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిరకాల వాంచ అయినటువంటి నిరుపేదలకు ఇల్లు అందించాలనే సంకల్పంతో హుజూర్‌నగర్ పట్టణ శివారులోని రామస్వామి గుట్టపై నిర్మాణాలు చేపట్టిన ఇందిర ఆదర్శ మోడల్ కాలనీలో అర్హులైన వారికి ఇండ్లు అందజేసి ఉత్తమ్ సార్ కలను సాకారం చేయండి సార్ అంటూ ఐఎన్‌టియుసి హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ గురవయ్యగౌడ్ అన్నారు. సోమవారం ఆర్డీవో, తహసిల్దార్ లకు అర్హులైన పేద వారితో కలిసి వినతిపత్రం అందజేశారు. రామస్వామి గుట్ట దగ్గర నిర్మించిన ఇందిరమ్మ మోడల్ కాలనీకి సంబంధించిన లబ్ధిదారుల డ్రాఫ్ట్ లిస్టును ఇటీవల అధికారులు విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వాధికారులు విడుదలచేసిన ఇందిరమ్మ మోడల్ కాలనీ లబ్ధిదారుల డ్రాఫ్ లిస్టులో అనర్హులే ఎక్కువగా ఉన్నారని, అర్హులైన వారికి లిస్టులో చోటు దక్కకపోవడం శోచనీయమన్నారు. మంత్రి ఉత్తమ్ ఆశయ సాధన కోసం పట్టణంలోని 28వ వార్డులో అర్హులైన ప్రతి నిరుపేదకు ఇల్లు అందించడమే లక్ష్యంగా నిర్మించిన మోడల్ కాలనీలోని ఇళ్లు అందించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి నాయకులు పోతనబోయిన రామ్మూర్తి, చప్పిడి సావిత్రి, నాగమ్మ, నాగలక్ష్మి , భారతి, స్వప్న, జ్యోతి, త్రివేణి, జరీనా పాల్గొన్నారు.

# పెరుగుతున్న గ్యాస్ ధరలు అరికట్టాలి

ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా దేశాలు యుద్ధం ఆపాలి

ఇరాన్‌పై దాడులకు వ్యతిరేకంగా పలుచోట్ల సిపిఐ ట్రంప్,మోదీ దిష్టిబొమ్మల దహనం



**ప్రజాపక్షం/మోటకొండూరు** :ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా దేశాలు చేస్తున్న యుద్ధాలు వెంటనే ఆపాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన మోటకొండూరు మండలకేంద్రంలో రెడ్డిగట్టి శేషయ్య నగర్‌లో బారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో సిపిఐ కార్యకర్తలతో కలిసి ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా దేశాలు యుద్ధం ఆపాలని నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలోమండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు ,మండల కార్యవర్గ సభ్యులు బీరకాయల మల్లేష్, మంచాల రాధమ్మ, పసుల నరసింహ, ఏఐవైఎఫ్ మండల సహాయ కార్యదర్శి గొట్టిపాముల సునీల్, రేగు యాదయ్య,బొడిగె సు దర్శన్, సూదగాని వెంకన్న పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చింతపల్లి** : దేశ వ్యాప్తంగా పెరిగిన ఎల్పిజి గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం చింతపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం, ఇటు గల్ఫ్ దేశాలలో చమురు క్షేత్రాలపై దాడి, కీలకమైన హెర్మ్యాజ్ జలసంధి నుంచి నౌకాలను వెళ్ళనీయకుండా ఇరాన్ అడ్డుకోవడం వంటి చర్యలతో ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్ డీజిల్ గ్యాస్ కొరత తీవ్రమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చింతపల్లి మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, మండల కార్యవర్గ సభ్యులు మండల కౌన్సిల్ సభ్యులు జోగు శ్రీరాములు, గుండ్లపల్లి ఇద్ది రాములు, ముదిగొండ లక్ష్మయ్య, కోడిదాల వెంకటయ్య, షేక్ శంశోద్దీన్, మస్కు వెంకటయ్య, వెంకటయ్య, మల్లేష్ పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/మునుగోడు** : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం వైఫల్యంతోనే దేశంలో చమురు సంక్షోభం ఏర్పడిందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుజ రామచంద్రం విమర్శించారు.సోమవారం మండల కేంద్రంలోని చౌరస్తాలో ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయిల్ దాడులను ఆపాలని, గ్యాస్,పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు,సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను,జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి,మండల కార్యవర్గ సభ్యులు బి.లాలు,చల్మెడ సర్పంచ్ బండమీది యాదయ్య,నాయకులు దుబ్బ వెంకన్న,కైలాస్,ఉప్పునూతల రమేష్, మునుగోటి దయాకర్,పాండు,కాయిత వెంకన్న,బెల్లం శివయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నల్లగొండ (నార్కట్‌పల్లి)** :అమెరికా నియంతృత్వంగా ఇరాక్ దేశం పై దాడులు చేస్తూ వేలాదిమంది బలి తీసుకుంటున్న చర్యలను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్ తీవ్రంగా నిరసించారు. సోమవారం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో నార్కట్‌పల్లి తహసీల్దార్‌కు మెమోరండం సమర్పించడం జరిగింది. మెమొరాండం సమర్పించిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్ మండల నాయకులు వెంపటి శ్రీనివాస్,సంగిశెట్టి శ్రీనివాస్,శ్రీపతి స్వామి,శీలోజు,వెంకటయ్య,దుబ్బ నరసింహ,చిరబోయిన మల్లయ్య,బోడ మల్లేష్, ఉపేందర సైదులు,మంటిపెల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : ఇరాన్ పై ఇజ్రాయిల్, అమెరికా సామ్రాజ్య వాద యుద్ధాన్ని ఆపాలని సిపిఐ ఆధ్వరంలో డిమాండ్ చేస్తూ సోమవారం మోడీ బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి చెడే చంద్రయ్య మాట్లాడుతూ ఇరాన్ పై సామ్రాజ్యవాద దేశాలు ఇజ్రాయిల్, అమెరికా చేస్తున్నటువంటి దాడుల నేపథ్యంలో అక్కడున్న పిల్లలు, పెద్దలు, ఆస్తులు, ప్రాణ నష్టం వాటిల్లుతున్నదన్నారు. సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి ట్రంప్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రేఖల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉప్పుల శాంతి కుమార్, మండల సహాయ కార్యదర్శి వెంకన్న, సిపిఐ నాయకులు కంచనపల్లి ఉపసర్పంచ్ బెల్లి శ్రీకాంత్, బొడ్డు గూడెం శాఖ కార్యదర్శి సోలిపురం నాగిరెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.








**ప్రజాపక్షం/(నల్లగొండ)దామరచర్ల** : నిత్యావసర వస్తువులు,గ్యాస్ ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం దామరచర్ల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారీ వర్గాలకు మద్దతుగా ప్రజలపై ధరల భారాన్ని మోపుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ధనావత్ శాంత, సీనియర్ నాయకులు జమ్ముల కోటయ్య,గజ్జల లక్ష్మినరసింహారెడ్డి, భాగం శేషయ్య,శుద్ధబోయిన రాములు,వెంకన్న,వినయ్ పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
మంగళవారం
17-03-2026
www.prajapaksham.in

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, దేశంలో పెరిగిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



# ప్రపంచ శాంతిని విచ్ఛిన్నం చేస్తున్న సామ్రాజ్యవాదులు

## మోదీ తీరే గ్యాస్ ధరల పెరుగుదలకు కారణం
## నిరసన కార్యక్రమాల్లో సిపిఐ నేతలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** ట్రంప్ యుద్ధ కాంక్ష భారతదేశంలో సామాన్యులపై తీవ్ర ప్రభావం చూపుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. గ్యాస్ ధరలతో పాటు ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, అదే సమయంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు క్షీణిస్తున్నాయని ఆయన తెలిపారు. గ్యాస్ సహా ధరల పెరుగుదలను నిరసిస్తూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన తెలియజేశారు. ధరలను తగ్గించాలని కేంద్ర విధానాలే ధరల పెరుగుదలకు కారణమని నినదించారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, మిడికంటి వెంకటరెడ్డి, పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పుచ్చకాయల సుధాకర్, గాదె లక్ష్మి నారాయణ, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, బానోత్ రాంకోటి, ఎస్‌కె సైదా, మడుపల్లి లక్ష్మణ్, శ్రవణ్, చింతల రమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ వైఫల్యం...

**హుజూర్‌నగర్:** దేశంలో గ్యాస్ కొరత ధరల పెంపు కేంద్ర ప్రభుత్వ వైఫల్యం అని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ఆరోపించారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ సామాన్య ప్రజలపై భారం పడేలా పెంచిన గ్యాస్ ధరలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్, మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి, కౌన్సిలర్ చెనగాని సైదులు, సోమగాని కృష్ణ, యల్లావుల రమేష్, కందుల వెంకటేశ్వర్లు, జక్కుల రమేష్, జడ వెంకన్న, మామిడి నర్సయ్య, ఇందిరాల వెంకటేశ్వర్లు, చక్రాల స్టాలిన్, పొనుగుపాటి వాసుదేవరావు, ప్రసాద్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**మోత్కూర్ :** సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో యుద్ధం వద్దు ప్రపంచ శాంతి కావాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, గీత పని వారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య, ఎఐటియుసి మండల అధ్యక్ష, కార్యదర్శులు జంగ నరసయ్య, తొంట తిరుపయ్య, పట్టణ కార్యదర్శి బోయిని ఉప్పలయ్య, తాడూరు లక్ష్మీ నరసయ్య, పెండెం వెంకటేశ్వర్లు కడమంచి వీరస్వామి, గొలుసుల యాదగిరి, పిట్టల చంద్రయ్య, బోడ సోమనర్సయ్య, నిల్గొండ అశోక్, అన్నపురెడ్డి, వెంకన్న, ఆలకుంట్ల వెంకన్న, బోడ ప్రవీణ్ పాల్గొన్నారు.

**నల్లగొండ :** పెరిగిన ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధరలు, గ్యాస్ సరఫరాలో ఏర్పడిన కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ


సూర్యాపేట జిల్లా మునగాలలో..

జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్ విమర్శించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధానికి వ్యతిరేకంగా, పెరిగిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో నల్లగొండలోని సుభాష్ సెంటర్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగురి నరసింహ, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, సిపిఐ నల్లగొండ పట్టణ సహాయ కార్యదర్శి వి.లెనిన్, కనగల్ మండల కార్యదర్శి గంటా సత్యనారా యణ, నాయకులు ముండ్ల ముత్యాలు, ఎస్‌కె. మదర్, వెంకటయ్య, నారాయణ, అక్కలయ్య, వెంకటేశం, జోగు కృష్ణ, పి.సుజాత, కౌసల్య, విజయ, రజిత, చిత్ర, యాదగిరి, అంజయ్య పాల్గొన్నారు.

### మోదీ వైఫల్యంతో పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలు

**కొండమల్లేపల్లి :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వ వైఫల్యంతోనే దేశంలో చమురు సంక్షోభం ఏర్పడిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు పెరిగిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ పల్లా దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిపిఐ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పేరికేటి శేఖరాచారి, పన్నాల శ్రీనివాస్, చరణ్‌రెడ్డి, సోమ్లానాయక్, వీరస్వామి, ధర్మయ్య, విప్పలపల్లి వెంకటయ్య, నగేష్, శంకర్, శ్రీను, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

### సామ్రాజ్యావాదం నశించాలి...

**దేవరకొండ :** యుద్ధం వద్దు శాంతి ముద్దు అమెరికా సామ్రాజ్య వాదం నశించాలని, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్దాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ జిల్లా దేవరకొండలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలు, తగ్గిన గ్యాస్ సరఫరాతో ప్రజలు సతమత మవుతున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, వెంకటయ్య, యాదయ్య, నాయకులు జ్యోతిబస్, మాధవరెడ్డి, మైనోద్దిన్, భూపాల్‌రెడ్డి, గోవర్ధన్, శ్రీను, మోహన్‌రెడ్డి, గోపి, పుల్లయ్య, కృష్ణయ్య, భారీములు, రామాంజనేయులు, గిరిప్రసాద్, బుచ్చయ్య, పర్వతాలు, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### అణ్వాయుధాలు కాదు... ప్రపంచ శాంతి కావాలి

**పెద్దపల్లి :** సామ్రాజ్యవాదం దురాక్రమనే లక్ష్యంగా అమెరికా దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేతిలో కీలుబొమ్మగా మారిన ఇజ్రాయెల్ దేశ అధ్యక్షుడు జియోనిస్ట్ ఇరాన్ పై దాడి చేయడం అంతర్జాతీయ హక్కుల ఉల్లంఘన అని తక్షణమే యుద్దాన్ని ఆపి శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పెద్దపల్లి జిల్లా కేంద్రం లో కలెక్టర్ కార్యాలయం ముందు అమెరికా సామ్రాజవాదం నశించాలి, ఇరాన్ దేశంపై యుద్దోన్మాధ ట్రంప్ అమెరికా, నేత న్యాహు ఇజ్రాయిల్ దాడిని ఖండిద్దాం, ఇరాన్ పై యుద్ధం ఆపాలని, యుద్ధం వద్దు శాంతి ముద్దు అనే ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. కార్య క్రమంలో సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, జిల్లా కార్యవర్గ సభ్యులు గౌతమ్ గోవర్ధన్, కె.కనకరాజు, మణికొండ ఓదెమ్మ, మార్కాపూరి సూర్య, జిల్లా తాళ్లపల్లి లక్ష్మణ్, కౌన్సిల్ సభ్యులు ఆరెపల్లి మానస్ కుమార్, రేణుకుంట్ల రమ, బాలసాని లెనిన్, రాజారత్నం, కల్లెపల్లి నవీన్, చంద్రగిరి ఉదయ్, నాగరాజు, సుధీర్, శివ, పోలు యాదగిరి, జోగుల రామస్వామి, మాచర్ల లక్ష్మణ్, సుద్దాల అనురాజ్, జూపక రాంచందర్, శనిగరం తిరుమల, రేణుక తదితరులు పాల్గొన్నారు.

**జగిత్యాల :** యుద్ధ ప్రభావంతో పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలు తక్షణమే తగ్గించేలా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం డిమాండ్ చేశారు. యుద్ధం వద్దు శాంతి ముద్దు అని జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం సిపిఐ జిల్లా కమిటీ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమాక్రసి జిల్లా కమిటి, వామపక్ష, పూలే, అంబేడ్కర్, మైనారిటీ ఐక్య వేదికల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు సిపిఐ నాయకులు ర్యాలీ చేపట్టి పెంచిన సిలిండర్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొక్కుల శాంత, సుతారి రాములు, వెన్న సురేష్, మునుగూరి హన్మంతు, జిల్లా కౌన్సిల్ సభ్యులు మాడిశెట్టి కిరణ్, రాధ, నాయకులు చెరుకూరి రాజేశం, ఎదులాపురం గంగరాజం, గంగ నర్సయ్య, శ్రీగాద దేవదాసు, భారత్ బచావో నాయకులు పిట్టల నారాయణ, మారకొండ గంగాధర్, కల్లెడ రాజన్న, కాడ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రి :** పెరిగిన గ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం మందమర్రి మండల సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బీమనాథుని సుదర్శన్, మందమర్రి పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజ్, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, వనం సత్యనారాయణ, మామిడి గోపి, ఎగుడ మొండి, నాయకులు వెంకన్న, రాజేశం, రాజేశం, దినేష్, దేవానంద్, రాజం, జనార్ధన్, తిరుపతి, శీనివాస్, సంతోష్, దుర్గ ప్రసాద్, అరుణ్, పోశం, సుమన్ పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ :** పెరిగిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ చౌరస్తా సమీపంలో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాము, పి.సురేష్, కె.పద్మావతి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సత్యనారాయణరెడ్డి, మహేష్‌బాబు, భార్గవి, శ్రీనివాసులు, ఎఐవైఎఫ్ ఉమ్మడి జిల్లా నాయకులు భూపేష్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ పట్టణ కార్యదర్శి ఇందిరక్క, నరసింహులు, యాదమ్మ, పద్మ భవానీ, సత్తెమ్మ, యశోదమ్మ అంజమ్మ, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ అర్బన్ :** బిజెపి ప్రభుత్వ విధాన వైఫల్యం కారణంగా దేశవ్యాప్తంగా ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధరలు పెరిగాయని, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల కారణంగా గ్యాస్ సరఫరా తగ్గి దేశప్రజలు సతమతమవుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో నిజామాబాద్ రైల్వేస్టేషన్ ముందు గ్యాస్ సిలిండర్‌తో నిరసన కార్యక్రమాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి, నగర కార్యదర్శులు పి.సుదాకర్, వై.ఓమయ్యలు నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రంజిత్, అనిల్, పి. ముత్యాలు, రమేష్, రాధాకుమార్, గోపి, కాళీ ప్రసాద్, ఆనంద్ పాల్గొన్నారు.

**ఆదిలాబాద్ రూరల్ :** ఇరాన్‌పై జరుగుతున్న యుద్దాన్ని తక్షణమే ఆపాలని సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మావల మండల తహసీల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కమలే రాందాస్, కొడప సురేష్, ప్రహ్లాద్, సోను బాయ్, తాజ్ మీరాబాయి పాల్గొన్నారు.

### ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ఆపాలి

**జనగామ :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి డిమాండ్ చేశారు. అమెరికా యుద్దోన్మాదానికి వ్యతిరేకంగా సోమవారం జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సిపిఐ కార్యాలయం నుంచి ఆర్‌టిసి చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, మోటె శ్రీశైలం నాయకులు చామకూర యాకుబ్, గుగులోతు సఖి, దాయా నగేష్, బుడిగ వీరస్వామి, పుప్పాల ఐలయ్య, తిప్పరబోయిన సిద్దులు, యాకయ్య, గోలనుకొండ నాగరా, సువర్ణ పాల్గొన్నారు.

**నిర్మల్ టౌన్ :** సామాన్య ప్రజలపై భారం పడేలా పెంచిన గ్యాస్ ధరలను రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం నిర్మల్ జిల్లాకేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్.ఎన్.రెడ్డి, రాజేశ్వర్, పుండలిక్, ముత్యం, నారాయణ, శివకుమార్, నజీర్, అనంతరావు, పలు ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

**షాబాద్:** కేంద్రం ప్రభుత్వం వెంటనే పెట్రోల్, వంట గ్యాస్ నివారణ చర్యలు చేపటాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలో ప్రజలకు వంట గ్యాస్ సమస్యలు రాకుండా మందస్తు చర్యలు తీసుకోవాలని ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం, నాయకులు నక్కల జంగయ్య, నర్సింలు, మధు, రాములు, ఆనందం, పాండు, మల్లయ్య పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### దేశ ప్రయోజనాలను అగ్ర రాజ్యానికి తాకట్టు పెడుతున్న కేంద్రం

**భద్రాద్రి కొత్తగూడెం :** ప్రపంచ శాంతిని సామ్రాజ్యవాదులు విచ్ఛిన్నం చేస్తున్నారని, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ ది యుద్ధోన్మాదమని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా ఆరోపించారు. దేశవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో మానవహారం చేపట్టి ఖాళీ సిలెండర్లతో వినూత్న నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, కందుల భాస్కర్, భూక్య శ్రీనివాస్, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, సిపిఐ సంఘాల నాయకులు ఎం ధనలక్ష్మి, కే రత్నకుమారి, నిర్మల, గోపికృష్ణ, పి ధనలక్ష్మి, ధర్మరాజు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, ఆకాంక్ష, వాడే రాములు, మంద నాగలక్ష్మి, సత్యనారాయణ మూర్తి, విజయలక్ష్మి, యూసఫ్, షాహీన్, కైసర్, అబ్బులు, రాకేష్, సింగరాల రమేష్, లక్ష్మీ నారాయణ, మండల రాజు పాల్గొన్నారు.

**సిద్దిపేట :** కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వ వైపల్యంతోనే దేశంలో చమురు సంక్షోభం నెలకొందని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆరోపించారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో చమురు సంక్షోభాన్ని నివారించాలని, వంట గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఖాళీ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కిష్టపురం లక్ష్మణ్, పిట్ల మల్లేశం, బిక్షపతి, నర్సింలు, మహేందర్, భూమయ్య, రాజు పాల్గొన్నారు.


భద్రాద్రిలో...


నల్లగొండలో...


పెద్దపల్లిలో...


యాద్రాద్రి..మోత్కూర్‌లో..


దేవరకొండలో...


జగిత్యాలలో...


జనగాంలో...


మహబూబ్‌నగర్‌లో...


మంచిర్యాలలో...


ఖమ్మంలో...



నల్లగొండ..కొండమల్లెపల్లి...



రంగారెడ్డి...షాబాద్‌లో...



నిర్మల్‌లో...



ఆదిలాబాద్‌లో...


సిద్దిపేటలో...



నిజామాబాద్‌లో...

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com